thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 270 | కరీంనగర్ ఆదివారం, 7 డిసెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!

న్యూఢిల్లీ : భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌లోనే అతి పెద్ద ప్రావిన్స్(విస్తీర్ణం పరంగా) అయిన బలూచిస్థాన్.. పాకిస్థాన్ నుంచి విడిపోతున్నట్టు బలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్థాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ ఏర్పాటును తన పోస్టుల్లో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను దేశంగా గుర్తించి.. కరెన్సీ, పాస్‌పోర్టు జారీ వంటి ప్రాథమిక అవసరాలకు నిధులు సమకూర్చాలని ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించారు.

# పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్.. సీఎం రేవంత్‌రెడ్డి సెటైర్లు




నల్లగొండ, డిసెంబరు6 : తమ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి రెండుకళ్లుగా పాలన సాగుతోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాపాలన రెండేళ్లు పూర్తిచేసుకుంటున్నామని పేర్కొన్నారు. నిజాంలు, రజాకార్లను తరిమికొట్టిన ప్రాంతం నల్గొండ అని చెప్పుకొచ్చారు. గడీల పాలనను ప్రజలు తరిమికొట్టారని ప్రస్తావించారు. కేసీఆర్ హయాంలో పేదలకు రేషన్ కార్డులు ఇవ్వాలనే ఆలోచనే చేయలేదని విమర్శించారు.

పేదలందరికీ తమ ప్రభుత్వంలో రేషన్ కార్డులు ఇచ్చామని స్పష్టం చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇవాళ(శనివారం) నల్లగొండ జిల్లాలోని దేవరకొండలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీ బహిరంగ సభలో ప్రసంగించారు సీఎం రేవంత్‌రెడ్డి.

**కేసీఆర్ హయాంలో దొడ్డుబియ్యం..** 'కేసీఆర్ హయాంలో పేదలకు దొడ్డుబియ్యం ఇచ్చారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ సన్నబియ్యం ఇవ్వట్లేదు. మా హయాంలో సన్నబియ్యం సరఫరా చేస్తున్నాం. పేదల ఆకలి తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం. డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తానని మాట ఇచ్చి కేసీఆర్ మోసం చేశారు. యూపీఏ హయాంలో తెలంగాణలో 25 లక్షల ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పుడు తెలంగాణలో 4 లక్షలకు పైగా ఇళ్లు కడుతున్నాం. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎన్ని ఇళ్లు ఇచ్చారో చెప్పాలి.

కాంగ్రెస్ పాలనలో పేదలకు న్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ గెలిస్తే కరెంట్ ఉండదన్నారు. 24 గంటలపాటు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత మాదే. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్‌దే. పేదలంటే కేసీఆర్‌కు ఇష్టం ఉండదు. రైతులను కేసీఆర్ మోసం చేశారు' అని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.

**ముంచే రోజులొస్తాయి..** 'మంచిరోజులు వస్తాయని కేసీఆర్ అంటున్నారు. పదేళ్ల దోపిడీ ఇంకా చాల్లేదా కేసీఆర్?. ఆయన మళ్లీ అధికారంలోకి వస్తే మనల్ని ముంచే రోజులొస్తాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బండకేసి కొట్టింది గుర్తులేదా..? అయిన.. మీ కుమారుడే మీకు పెద్ద గుదిబండ. కేటీఆర్ ఉన్నంతకాలం బీఆర్‌ఎస్‌ను ప్రజలు బండకేసి కొడుతూనే ఉంటారు. కేసీఆర్ ఓడిపోయాకే ప్రజలకు మంచి జరిగిందని.. గతంలో మంత్రులు, ఎమ్మెల్యేలనూ కలవలేదు. ఫామ్‌హౌస్, ప్రగతి భవన్‌కు ఎవరినీ రానివ్వలేదు. ఇప్పుడు సర్పంచ్‌లు, వార్డు మెంబర్లనూ కలుస్తున్నారు. యువతకు 60 వేల ఉద్యోగాలు ఇచ్చాం. భవిష్యత్‌లో మరో 40 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తాం.

ఎస్‌ఎల్‌బీసీను కేసీఆర్ పదేళ్లపాటు పట్టించుకోలేదు, నిర్లక్ష్యం చేశారు. ఎస్‌ఎల్‌బీసీ ఆగిందని మామ, అల్లుడు డ్యాన్సులు చేస్తున్నారు. ఎవరూ అడ్డుపడ్డా ఎస్‌ఎల్‌బీసీను పూర్తిచేసి తీరుతాం' అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

## 'రేవంత్.. ఒక్కసారి భ్రమల నుంచి బయటకొచ్చి చూడు'



హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీమంత్రి, బీఆర్‌ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు మరోసారి ధ్వజమెత్తారు. కనకపు సింహాసనం మీద కూర్చోబెట్టినంత మాత్రాన శునకం తన బుద్ధి మార్చుకోదని, అట్లాగే రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి సీట్లో కూర్చోబెట్టినా వెనుకటి గుణం మార్చుకోరని, మార్చు కోలేరని విమర్శించారు. ఈ మేరకు శనివారం ప్రెస్‌నోట్ రిలీజ్ చేశారు. ' రెండేళ్లుగా కేసీఆర్ మీద, బీఆర్‌ఎస్ పార్టీ మీద పడి ఏడ్వడం తప్ప చేసిందేముంది రేవంత్ రెడ్డి?, విజయోత్సవాలు అంటూ విచ్చలవిడిగా తిరుగుతూ, విక ృతంగా మాట్లాడటం వల్ల చేయనివి చేసినట్లు అయిపోవు. అబద్ధాలు ప్రచారం చేసినంత మాత్రాన, వాస్తవాలు మరుగున పడిపోవు. కేసీఆర్ అందించిన సంక్షేమ ఫలాలు ప్రజలు మరిచిపోరు. బీఆర్‌ఎస్ హయాంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని పచ్చి అబద్ధం చెబుతున్న రేవంత్ రెడ్డి.. 6,47,479 రేషన్ కార్డులు మంజూరు చేసింది అబద్ధమా?, గతంలో కార్డు మీద నాలుగు కేజీల బియ్యం మాత్రమే ఇస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దాన్ని ఆరు కేజీలకు పెంచి, కుటుంబంలో ఎంత మంది ఉంటే అంత మందికి ఇచ్చింది అబద్ధమా?, నల్లగొండ ప్రజల మీద కక్ష కట్టింది ఎవరు?, ఎస్‌ఎల్‌బీసీ ప్రాజెక్టును నెవర్ ఎండింగ్ ప్రాజెక్టుగా డిజైన్ చేసింది ఎవరు? ప్రాజెక్టును పడావు పెట్టింది ఎవరు?, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3892 కోట్లు ఖర్చు చేసి, 11.48 కిలోమీటర్ల సొరంగం పనులు పూర్తి చేసింది నిజం కాదా?, ఈ లెక్కలు మీ ప్రభుత్వం దగ్గర లేవా? పదే పదే ఎందుకు అబద్ధాలు చెబుతున్నారు రేవంత్ రెడ్డి?, మీ అనాలోచిత నిరయాల వల్ల, మీ నిర్లక్ష్యం వల్ల, మీ దుందుడుకు చర్యల వల్ల ఇవాళ ఎస్‌ఎల్‌బీసీని త్రిశంకు స్వర్గంలో పడేసింది మీరు కాదా?, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా, ఎలాంటి స్టడీ నిర్వహించకుండా 8 మంది అమాయకుల ప్రాణాలను బలి కొన్నది మీరు కాదా?, రెండేళ్లలో కొత్తగా ఒక్క ఎకరాకు నీళ్ళు ఇవ్వని నువ్వు ఇరిగేషన్ గురించి మాట్లాడితే ప్రజలకు ఇరిటేషన్ కలుగుతుంది. అక్రమంగా క ృష్ణా? నీళ్లను ఏపీ తరలించుకుపోతుంటే, అక్రమ ప్రాజెక్టులకు డీపీఆర్ లు తయారు చేస్తుంటే అడ్డుకోలేని రేవంత్ రెడ్డి.. బీఆర్‌ఎస్ మీద పడి ఏడుస్తున్నడు. ముఖ్యమంత్రి, మంత్రులు కలిసి అందిన కాడికి దండుకుంటున్నరు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయలేని చేతగాని సర్కారు మీది. కూట్లో రాయి తీయని రేవంత్ రెడ్డి మాట్లాడితే ప్రపంచ స్థాయి అంటుండటం హాస్యాస్పదం. తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ అంటూ.. ఎవరిని మభ్య పెడుతున్నవు?, ఇందులో ఎన్ని కోట్ల స్కాంకు ప్లాన్ వేసినవు. ఇందులో ఎవరి వాటా ఎంత?, గాల్లో మేడలు కట్టడం, అబద్ధాలు చెప్పి రంగుల ప్రపంచం చూపడం మానేసి.. పాలన మీద ద ృష్టి సారించు. చిల్లర మాటలు, వెకిలి చేష్టలతో రాష్ట్రం అభివ ృద్ధి చెందదు, ప్రజల సమస్యలకు పరిష్కారం లభించదు. నువ్వు రాష్ట్రానికి ముఖ్యమంత్రివి అన్న విషయం గుర్తుంచుకో.. అహంకారం తగ్గించుకొని అజ్ఞానాంధకారం తొలగించుకో' అని హరీష్ ధ్వజమెత్తారు.

# యావత్ ప్రపంచం తిరిగి చూసేలా...

# 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'

## ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రేవంత్ సర్కార్!



## పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన అజెండా!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే ప్రధాన లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఈ అంతర్జాతీయ సదస్సు డిసెంబర్ 8 మరియు 9 తేదీల్లో జరగనుంది. ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుండి వివిధ రంగాలకు చెందిన నిపుణులు, ప్రముఖులు, మేధావులు సహా 4,000 మందికి పైగా అతిథులుగా హాజరుకానున్నారు. ఈ భారీ సదస్సు ద్వారా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ఉన్న ప్రత్యేకతను ప్రపంచ వేదికపై ప్రదర్శించాలని రేవంత్ సర్కార్ సంకల్పించింది. అంతేకాకుండా, తెలంగాణను 'సభూతో న భవిష్యత్' అన్నట్లుగా పెట్టుబడులకు స్వర్ణధామంగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేయడం ద్వారా, తెలంగాణ ఆర్థికాభివృద్ధికి బలమైన పునాది వేయాలని ప్రభుత్వం కృషి చేస్తోంది. సదస్సుకు హాజరయ్యే అతిథులను తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా స్వాగతించడానికి ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. అతిథులకు అందిచే స్పెషల్ గిఫ్ట్ బాస్కెట్‌లో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే అనేక జ్ఞాపికలు ఉండనున్నాయి. ఇందులో ముఖ్యంగా పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లోగోతో కూడిన సావనీర్ కిట్లు, పోచంపల్లి తాలువా, మరియు నిర్మల్ మాస్క్ పెయింటింగ్స్ ఉండనున్నాయి. అంతేకాక, హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపునిచ్చే హైదరాబాద్ అత్తర్ మరియు హైదరాబాద్ ముత్యాలతో చేసిన ఆభరణాలు కూడా ఈ బాస్కెట్‌లో భాగమవుతాయి. మరోవైపు, రుచికరమైన వంటకాలతో కూడిన ఫుడ్ బాస్కెట్‌ను కూడా అందించనున్నారు. ఇందులో మహువా లడ్డులు, సకినాలు, బప్పాలు, రామ్ డి వంటి సాంప్రదాయ తెలంగాణ వంటకాలు ప్రత్యేక డిజైన్ చేసిన కవర్లలో ప్యాక్ చేసి స్వాగతం పలకనున్నాయి. ఈ సదస్సు కోసం దేశంలోని ప్రముఖులను ఆహ్వానించే బాధ్యతను రేవంత్ ప్రభుత్వం స్వయంగా తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అంతర్జాతీయ ప్రముఖులతో పాటు, దేశ ప్రధాని నరేంద్ర మోదీని స్వయంగా కలిసి ఆహ్వానించనున్నారు. అలాగే కాంగ్రెస్ అగ్ర నేతలు ఏఐసీసీ చీఫ్ మల్లిఖార్జున ఖర్గే మరియు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా సదస్సుకు హాజరుకానున్నారు. ఇంతేకాక దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను (సీఎంలను) కూడా ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా, ఆయా రాష్ట్రాల సీఎంలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆహ్వానించే బాధ్యతను డిసెంబర్ 4న మంత్రులకు అప్పగించారు. ఈ విధంగా కేంద్ర నాయకులను, వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించడం ద్వారా, సదస్సుకు జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడంతో పాటు, పెట్టుబడుల ఆకర్షణకు మరింత అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించాలని రేవంత్ ప్రభుత్వం వ్యూహరచన చేసింది.




# మోడీ దెబ్బకు ట్రంప్ విలవిల..

## సెకండ్ కో షాక్ ఇస్తూ చుక్కలు చూపిస్తున్నాడుగా..?

## పుతిన్ భారత పర్యటనతో అగ్రరాజ్యాధ్యక్షుని ఉక్కిరిబిక్కిరి!!

ప్రపంచ దేశాల్లో అమెరికా అగ్రరాజ్యమని అందరూ భావిస్తారు.. అంతేకాదు చాలా దేశాలలోని ప్రజలు అమెరికాకు వెళ్లి బ్రతుకుతూ ఉంటారు. అందుకే అమెరికాను అగ్ర రాజ్యమని పిలుస్తూ ఉంటారు.. అలాంటి అగ్రరాజ్య దేశానికి చుట్టుపక్కల ఉన్న దేశాలన్నీ భయపడిపోతూ వాళ్ళు చెప్పినవన్నీ వింటూ ఉంటారు.. ఆ విధమైనటువంటి అమెరికాకు భారతదేశం ఎప్పుడు భయపడుతూ ఉండేది. వాళ్ళు చెప్పిన దాని ప్రకారమే నడుచుకుంటూ ఉండేది.. కానీ మోడీ ప్రధాని అయిన తర్వాత ఈ పరిస్థితులు మారిపోయాయి. అమెరికా దేశాన్ని కూడా తలదన్నే విధంగా మోడీ తయారయ్యారు.. అంతేకాదు అమెరికా అధ్యక్షుని మాటను కూడా పట్టించుకోకుండా మన దేశ అభివృద్ధి కోసమే పాటుపడుతున్నాడు.. ఒక రకంగా చెప్పాలంటే మోడీ ట్రంప్ కి చుక్కలు చూపిస్తున్నారని చెప్పవచ్చు.. అగ్రరాజ్యమని అహంకార భావం నుండి అమెరికాను మోడీ చీపురు పుల్లతో సమానంగా తీసివేస్తున్నారు. అయితే ఈ కొన్ని విషయాల్లో మోడీ ధైర్యాన్ని దేశమంతా ప్రశంసిస్తున్నారు.. ఆ విషయాలు ఏంటో చూద్దాం.. అమెరికా ఏం చెప్పినా సరే వింటూ అమలు చేసే బానిసత్వం ఇంతకుముందు ఉండేది. కానీ ప్రస్తుత పరిస్థితులు మారిపోయి మోడీ ఆ విధానానికి వ్యతిరేకంగా ముందుకు వెళ్తున్నారు. ముఖ్యంగా అమెరికా మనపైన సుంకాలు వేసి మనల్ని బెదిరించాలని చూసింది. కానీ ఆ బెదిరింపులకు భయపడకుండా రష్యాతో బంధం ఏర్పరచుకొని అమెరికాకు చుక్కలు చూపించింది. అంతేకాదు అమెరికాకు పంపించే వస్తువులను 10 దేశాలకు పంపించుకుని మోడీ సత్తా చాటుతున్నారు. అంతేకాకుండా ట్రంప్ కలుద్దామని మోడీకి ఆరుసార్లు కబురు పెట్టినా కానీ మోడీ కనీసం ఆయనను పట్టించుకోలేదు. అలాగే ట్రంప్ బెదిరింపులకు భయపడకుండా చైనాతో కూర్చొని మాట్లాడి అమెరికాకే చుక్కలు చూపిస్తున్నాడు మోడీ. ట్రంప్ ఆరుసార్లు మోడీని కలవడానికి ప్రయత్నించినా కానీ అవకాశం ఇవ్వకుండా రష్యా అధ్యక్షునికి ఘన స్వాగతం పలికి మరీ కలిసి ట్రంప్ కు చుక్కలు చూపించారు.

ఈ విధంగా మోడీ అమెరికా బెదిరింపులకు ఏమాత్రం భయపడకుండా, భారతదేశం అమెరికాపై ఆధారపడి లేదని నిరూపించుకుంటున్నారు.. ఏది ఏమైనప్పటికీ మోడీ భారతదేశ గౌరవాన్ని ప్రపంచ దేశాలలో అద్భుతమైన స్థానంలో నిలబెడుతున్నారని చెప్పుకోవచ్చు.. అగ్ర రాజ్యాన్ని తలదించుకునేలా చేశారంటే మోడీ పాలన ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

చురకలు





# శంషాబాద్ ఎయిర్‌పోర్టు.. 69 విమానాలు రద్దు

హైదరాబాద్: వరుసగా ఐదో రోజు ఇండిగో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. హైదరాబాద్‌కు రావాల్సిన 26 విమానాలు, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 43 విమానాలను రద్దు చేశారు. సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు 5 నుంచి 10 రోజులు పట్టే అవకాశం ఉంది. ఇండిగో విమాన సేవల అంతరాయాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. మూడు రోజుల్లో పూర్తిస్థాయి పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటామని వెల్లడించింది. విమానాశ్రయాల్లో ఉన్నవారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు రైల్వేశాఖ చర్యలు చేపట్టింది. 37 రైళ్లకు 116 కోచ్‌లు అదనంగా జోడించాలని నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు అదనపు బోగీలతో నడుస్తున్నాయి.
**విశాఖ నుంచి 9 సర్వీసులు రద్దు..** విశాఖ విమానాశ్రయం నుంచి 9 ఇండిగో విమాన సర్వీసులు రద్దు చేశారు. వీటిలో చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, హైదరాబాద్‌కు వెళ్లేవి ఉన్నాయి. ఈ ఎయిర్‌పోర్టు నుంచి 11 విమాన సర్వీసులు రాకపోకలు సాగిస్తున్నాయి.



# సుప్రీంకు చేరిన ఇండిగో సంక్షోభం

దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో తీవ్ర అంతరాయం వల్ల ప్రయాణికులు ఎయిర్‌పోర్టులో పడిగాపులు కాస్తున్నారు. ఇప్పుడు ఈ సంక్షోభం సుప్రీంకోర్టుకు చేరింది. విమాన సర్వీసుల రద్దుపై అత్యున్నత న్యాయస్థానంలో పిల్ దాఖలైంది. దీనిపై తక్షణమే విచారణ జరపాలని పిటిషనర్ కోరారు. స్టేటస్ రిపోర్ట్ సమర్పించేలా పౌరవిమానయాన మంత్రిత్వశాఖ, డీజీసీఏను ఆదేశించాలని అభ్యర్థించారు. ఈ పిటిషన్‌ను సుప్రీం పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గత ఐదు రోజులుగా ఇండిగో విమానాల్లో అంతరాయం కొనసాగుతోంది. శనివారం కూడా పలు ఎయిర్‌పోర్టుల్లో దాదాపు 500కు పైగా దేశీయ విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఈ నేపథ్యంలో దిల్లీ ఎయిర్‌పోర్టు ప్రకటన విడుదల చేసింది. సర్వీసుల పునరుద్ధరణ జరుగుతోందని, అయితే కొన్ని సరీసులపై ప్రభావం కొనసాగుతోందని వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు రైల్వే కూడా రంగంలోకి దిగింది. సాధ్యమైనంత త్వరగా ప్రయాణికులను గమ్యస్థానానికి చేర్చేందుకు 37 రైళ్లకు 116 బోగీలను జోడించింది. పరిస్థితిని సాధారణ స్థితికి తీసుకురావడమే తమ తక్షణ కర్తవ్యమని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్ నిబంధనలు, షెడ్యూలింగ్ నెట్‌వర్క్‌ను తాము నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. అన్ని విమానయాన సంస్థలు నిబంధనలు సరిగా పాటిస్తున్నాయో, లేదో నిర్ధరిస్తామని తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో ఎక్కడ, ఎలా తప్పు జరిగిందో తెలుసుకోవడానికి ఒక విచారణ కమిటీని ఏర్పాటుచేశామని, పిల్లలు, వృద్ధులు, పాలిచ్చే తల్లులు, వికలాంగులకు విమానయానంలో ప్రాధాన్యం ఇవ్వాలని అన్ని ఎయిర్‌పోర్ట్, ఎయిర్‌లైన్ ఆపరేటర్లను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

# మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తాం: భట్టి విక్రమార్క



హైదరాబాద్: గ్లోబల్ సమిట్.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్‌కు సంబంధించింది, మా విజన్ డాక్యుమెంట్ ద్వారా ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తామని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమిట్ వివరాలను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మీడియాకు వివరించారు. "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్‌లో 27 సెషన్లు ఉంటాయి. వివిధ రంగాలకు చెందిన నిపుణులు, నిష్ణాతులను సమిట్‌కు ఆహ్వానించాం. ఎయిర్‌లైన్స్ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. సమిట్‌కు వివిధ దేశాల ప్రతినిధులు భారీ సంఖ్యలో వస్తారు. ముఖ్యఅతిథులకు సమస్య వస్తే ప్రత్యేక విమానం ఏర్పాటు చేస్తాం. ఇలాంటి సమిట్ గతంలో ఎప్పుడూ జరగలేదు" అని భట్టి విక్రమార్క తెలిపారు.

# కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి: ఈటల



కమలాపూర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లయినా సర్పంచులు చేసిన పనులకు పెండింగ్ బిల్లులు చెల్లించలేదని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు.

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని కమలాపూర్, భీంపల్లి, కన్నూరు, గుండెడు గ్రామాల్లో భాజపా బలపరిచిన స్థానిక ఎన్నికల అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించి మాట్లాడారు. "గ్రామాల్లో కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులతోనే అభివృద్ధి జరుగుతోంది. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా కేంద్రం నిధులతోనే నిర్మిస్తున్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు ఇవ్వడానికి కూడా రాష్ట్రం దగ్గర డబ్బులు లేవు. ఎన్నికల్లో కొంతమంది డబ్బులిచ్చి ఓట్లను కొంటాం అంటున్నారట.

మనుషుల ఆత్మగౌరవానికి వెలకట్టలేరు. ఈటల పేదల పక్షాన కొట్లాడే బిడ్డ. అధికారం ఉన్నా లేకున్నా మీకు కావాల్సినవి అందించే భాధ్యత నాది" అని ఈటల రాజేందర్ అన్నారు.



# భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఎవరికీ లేదు

ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశాంగ మంత్రి జై శంకర్ అన్నారు. భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా.. భారత్- రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జైశంకర్ మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రష్యాతో బంధం కారణంగానే అమెరికా- భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా? అని విలేకరి ప్రశ్నించారు. దీనికి విదేశాంగ మంత్రి బదులిస్తూ.. 'వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం. ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలని ఎంపిక చేసుకునే స్వేచ్ఛ ఉంది. గత 70-80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది. కానీ, భారత్-రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతుంది' అని అన్నారు. దౌత్యం అంటే మరొకరిని సంతోషపెట్టడం కాదు అని వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుందన్నారు. భారత ప్రయోజనాలకు అనుగుణంగానే ఇది ఉంటుందని తెలిపారు. తమ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు.
**పాక్ ఆర్మీ నుంచే మనకు సమస్యలు..** ఇక, ఈ కార్యక్రమంలో పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురయ్యింది. దీనికి జైశంకర్ బదులిస్తూ.. పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని నిజస్వరూపం మనకు తెలుసని.. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో శాంతి కోసం భారత్- చైనా సంబంధాలు కీలకమన్నారు. ఇటీవల ఇరుదేశాల సంబంధాలు బలపడిన విషయాన్ని ప్రస్తావించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్వదేశంలో మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. హసీనా అప్పగింతపై ఆయన మాట్లాడుతూ.. భారత్‌లో ఉండటం ఆమె వ్యక్తిగత విషయమన్నారు.

# సోనియా ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును రాష్ట్ర ప్రభుత్వం ఎలా అమలు చేస్తుంది?



హైదరాబ్బాద్: తెలంగాణ భవన్‌లో కార్మిక సంఘాల రౌండ్ టేబుల్ మీటింగ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలోనే అత్యంత కుబేరులు భారతదేశంలో ఉన్నారని, అలాగే అత్యంత పేదరికం కూడా ఉందని అన్నారు. 'ప్రపంచమే కుగ్రామం' అనే పేరుతో అమెరికా, ఐరోపాలో తెచ్చిన చట్టాలను ఇక్కడ తెస్తే కుదరదని హెచ్చరించారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్లలో భాగంగా కొత్త సంస్కరణలు తెస్తున్నారని, అయితే.. సామాజిక స్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఏ చట్టాలు తెచ్చినా వాటిపై తిరగబడాల్సిందేనని కేటీఆర్ కామెంట్స్ చేశారు. దేశంలో 92శాతం మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు.
**పదేళ్లలో రూ. 3500 కోట్లు..** సిరిసిల్ల చేనేత కార్మికులను ఆదుకునేందుకు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.3,500 కోట్ల మేర బతుకమ్మ చీరల తయారీకి కేసీఆర్ ఆర్డర్ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, కొందరు పిచ్చోళ్లు తెలియక ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. తాము ప్రతిపక్షంలో ఉన్నా నేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకుంటే కేసీఆర్ చలించిపోయి పార్టీ తరఫున ఆర్థిక సాయం చేశారన్నారు. కనీసం పాలకుల్లో చలనమైనా వస్తుందని కేసీఆర్ ఈ సాయం చేశారని చెప్పుకొచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం చైనా జీడీపీ మనకన్నా తక్కువగా ఉండేదని, ఇప్పుడు మనది నాలుగు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ అయితే, చైనాది అరవై ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థని కేటీఆర్ తెలిపారు. చైనా ఎప్పటికప్పుడు ప్రజలకు అనుగుణంగా నూతన విధానాలు తీసుకురాబట్టే ఫలితాలు సాధించిందన్నారు. అన్నింటికీ ముందు.. పోరాడే పార్టీకి పార్లమెంట్‌లో తగిన సీట్లు ఇవ్వడమే కారణమన్నారు.
**ఏకాధిపత్యం వల్ల అనర్థం...** లోక్‌సభలో బీఆర్ఎస్‌కు ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల కాంగ్రెస్, బీజేపీలు కలిసి ఇలాంటి చట్టాలను తెస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోనోపోలీ (ఏకాధిపత్యం) వల్ల ఎలాంటి అనర్థం జరుగుతుందోనన్నారు. ఇండిగో విమానయాన సంస్థ వల్ల ప్రయాణికులకు ఐదు రోజులుగా జరిగిన అసౌకర్యం ప్రత్యక్ష ఉదాహరణ అని పేర్కొన్నారు. ఐదు రోజుల్లో వెయ్యి విమానాలు రద్దయ్యాయన్నారు. కేంద్ర ప్రభుత్వం.. పోర్టులు, ఎయిర్ పోర్టులు, ఇతర మౌలిక సదుపాయాల సంస్థలు కొంతమంది చేతుల్లో పెట్టడం వల్ల ఇలాంటి ఉపద్రవాలు వస్తున్నాయని అన్నారు. శ్రమదోపిడీ వల్లే ఇదంతా జరిగిందని మండిపడ్డారు. ఇండిగో ఒత్తిడికి కేంద్రమే తలొగ్గింది తప్ప, ఇండిగో తగ్గలేదన్నారు.
**ఎలా అమలు చేస్తుంది?..** కేంద్రం ఐదు రోజుల తర్వాత స్పందించడం వల్ల ఎయిర్ పోర్టులు బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లుగా మారాయన్నారు. కొత్త లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే ఇండిగో వల్ల జరిగిన అసౌకర్యం మిగతా రంగాలకు విస్తరిస్తుందని, ఇప్పుడు ఏ ఎన్నికలు లేవని, బీఆర్టీయూ ఎవరితోనైనా పని చేయొచ్చని వివరించారు.

లేబర్ కోడ్‌లు రాష్ట్రంలో అమలు చేయకుండా అడ్డుకుంటే దేశానికి దిక్సూచి అవుతుం దన్నారు. సోనియా ఢిల్లీలో వ్యతిరేకించిన బిల్లును, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎలా అమలు చేస్తుంది? అని ప్రశ్నించారు. ఢిల్లీలో కేంద్ర కార్మిక మంత్రిని, పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సభ్యులను కలుద్దామని, లేబర్ కోడ్‌ల అమలు ఆపేదాకా అసెంబ్లీ, మండలి సమావేశాలు స్తంభింపజేస్తామని పిలుపునిచ్చారు. వరంగల్‌లో తదుపరి రౌండ్ టేబుల్ మీటింగ్ నిర్వహిస్తామని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు.

# గాంధీ, నెహ్రూలపై బీజేపీ విష ప్రచారం.. జగ్గారెడ్డి ఫైర్



హైదరాబాద్, డిసెంబరు 6 : మహాత్మాగాంధీ, జవహర్ లాల్ నెహ్రూ టార్గెట్‌గా బీజేపీ నేతలు విష ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గాంధీ, నెహ్రూలపై విష ప్రచారం చేయాలని మొదటి నుంచి ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. గాంధీపై బీజేపీ నాయకులు విషప్రచారం చేస్తుంటే బీజేపీ నేతలపై ప్రజలు తిరగబడుతున్నారని.. దీంతో గాంధీనీ కాకుండా ఇప్పుడు నెహ్రూపై విష ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ప్రజల్లోకి బ్యాంక్ సేవలు తీసుకువచ్చిందే ఇందిరాగాంధీ అని గుర్తు చేశారు. చరిత్రను రూపుమాపాలని బీజేపీ నాయకులు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇవాళ (శనివారం) గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు జగ్గారెడ్డి.
**శాంతియుత పోరాటం చేశారు...** 'నెహ్రూ కుటుంబం ఎప్పుడూ కుట్రా రాజకీయాలు చేయలేదు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడం కోసమే నెహ్రూ కుటుంబం పని చేసింది. దేశ ప్రజలు స్వేచ్ఛగా ఉండాలని నెహ్రూ కుటుంబం శాంతియుత పోరాటం చేసి స్వాతంత్ర్యం తీసుకువచ్చారు. స్వాతంత్ర్యం తీసుకువచ్చింది గాంధీనే.. ఇది చరిత్ర.. దీనిని ఎవరూ మార్చలేరు. అప్పుడు బీజేపీ లేదు కదా అందుకే నెహ్రూ కుటుంబంపై విమర్శలు చేస్తున్నారు.

నెహ్రూ ప్రధాని కావాలని స్వాతంత్ర్యం పోరాటం చేయలేదు. నెహ్రూ ప్రధానిగా ఉండాలని ప్రజలు కోరుకున్నారు. ఆయన ప్రధాని అయిన తర్వాత ప్రణాళిక బద్ధంగా ఆర్థిక పురోగతికి ప్రాధాన్యం ఇచ్చారు' అని జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు.
**రాహుల్ గాంధీ కుటుంబంపై చెడు ప్రచారం...** 'లౌకిక వాదాన్ని నెహ్రూ విశ్వసించేవారని.. వారి త్యాగాలను మరిపించడానికి బీజేపీ నేతలు చెడు ప్రచారం చేస్తున్నారు. రాహుల్ గాంధీ కుటుంబంపై కావాలని బీజేపీ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానిగా దేశంలో నెహ్రూ ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారు. అప్పుడు ప్రజలు ఏక తీర్మానంతో నెహ్రూను ప్రధానిగా ఉండాలని చెప్పారు. ఇప్పుడు రెండు పర్యాయాలు ఓటింగ్ మిషన్‌లు తమంతట తాము ఓటు వేసుకున్నాయి. అందుకే బీజేపీ అధికారంలోకి వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన రోజుల్లో నెహ్రూ హయాంలో ఆకలి చావులు లేకుండా చేశారు. తాగు, సాగు నీరు ప్రజలకు అందించడం కోసం దేశవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులను నెహ్రూ నిర్మించారు' అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.



# వణుకు పుట్టిస్తున్న చలి..

ఆదిలాబాద్: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోయి చలి తీవ్రత ప్రజలకు వణుకు పుట్టిస్తుంది. ఇప్పుడే చలి తీవ్రత ఇలా ఉంటే.. రాబోయే జనవరి మాసంలో ఎలా ఉండబోతుందోనని జనం బెంబేలెత్తిపోతున్నారు. గత పక్షం రోజులుగా జిల్లా వాతావరణంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మధ్యాహ్నం ఉష్ణోగ్రతలు పెరిగిపోయి రాత్రి వేళల్లో చలి తీవ్రత కనిపిస్తుంది. జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 28.0 డిగ్రీల సెల్సియస్ కాగా కనిష్ఠ ఉష్ణోగ్రత 11.5గా నమోదైంది. ఆదిలాబాద్ రూరల్ పిప్పల్‌ధరిలో 11.1, తలమడుగులో 11.2, బేల మండలం చప్రాలలో 11.7, మావల మండలంలో 11.8, గాదిగూడలో కారికెలో 12.0, తాంసిలో 12.3, ఇంద్రవెల్లిలో 12.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మారుమూల గిరిజన గ్రామాలను దట్టమైన పొగమంచు కప్పేస్తుంది. ఉదయం 9గంటల వరకు బయటకు వెళ్లేందుకే ప్రజలు భయపడుతున్నారు. సాయంత్రం 5వరకే పనులను ముగించుకుని ఇళ్లలోకి వెళ్లి పోతున్నారు. రాత్రీపగలు అనే తేడా లేకుండా వెచ్చని దుస్తులను ధరిస్తున్నారు. చలి తీవ్రతకు చలి మంటలు వేసుకుంటు వెచ్చదనం పొందుతున్నారు.



# భారత్‌కు త్వరలో.. 40వేల ఇజ్రాయెల్ 'లైట్ మెషిన్ గన్స్'

వచ్చే ఏడాది ఆరంభంలో దాదాపు 40వేల లైట్ మెషిన్ గన్స్‌ను భారత్‌కు సరఫరా చేయనున్నట్లు ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణ పరికరాల సంస్థ ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ వెల్లడించింది. వీటితోపాటు దాదాపు 1.70లక్షల కార్బైన్‌లకు సంబంధించిన ఒప్పందం ఖరారు చివరి దశలో ఉందని తెలిపింది. పిస్టల్స్, రైఫిల్స్, మెషిన్ గన్స్ సహా ఇతర రక్షణ ఉత్పత్తులను మార్కెట్ చేసుకునేందుకు భారత హోంశాఖలోని వివిధ ఏజెన్సీలతో సంప్రదింపులు చేస్తున్నట్లు పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐడబ్ల్యూఐ సీఈవో షుకి స్క్వార్ట్జ్ పేర్కొన్నారు. "గతేడాది చేసుకున్న ఒప్పందం ప్రకారం 40 వేల లైట్ మెషిన్ గన్స్‌ను తొలుత అందించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే పరీక్షలు, తనిఖీలు పూర్తికాగా.. ఉత్పత్తి కోసం లైసెన్స్ పొందాము. వచ్చే ఏడాది ప్రారంభంలో తొలి బ్యాచ్‌ను అందించాలని ప్రయత్నిస్తున్నాం. క్లోజ్ క్వార్టర్స్ బ్యాటిల్ (సీక్యూబీ) కార్బైన్స్ టెండర్‌లో భారత్ ఫోర్జ్ ప్రైమరీ బిడ్డర్ కాగా.. తమ సంస్థ రెండో బిడ్డర్.

ఈ ఒప్పందంపై సంతకాలు చేసే దశలో ఉన్నాం. ఈ ఏడాది చివరి లేదా వచ్చే ఏడాది ప్రారంభం నాటికి ఖరారు అవుతుందని ఆశిస్తున్నాం" అని ఐడబ్ల్యూఐ సీఈవో వెల్లడించారు. కార్బైన్స్‌కు సంబంధించి 60శాతం ఆయుధాలను భారత్ ఫోర్జ్ నుంచి, మిగతా నలభై శాతం (1.70లక్షల ఆయుధాలను) అదానీ గ్రూపు అనుబంధ సంస్థ పీఎల్ఆర్ సిస్టమ్స్ సరఫరా చేయనుంది. ఇక ప్రపంచంలోనే తొలి కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ అర్బెల్ టెక్నాలజీని భారత్‌కు అందించేందుకు సంబంధిత ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నామని షుకి స్క్వార్ట్జ్ పేర్కొన్నారు. యుద్ధభూమిలో సైనికులు అత్యంత కచ్చితత్వంతో, చురుగ్గా వ్యవహరించేందుకు ఇదెంతో ఉపకరిస్తుందన్నారు. ఒప్పందం పూర్తికాగానే ఇజ్రాయెల్‌తోపాటు భారత్‌లోనూ వీటి తయారీ చేపడతామన్నారు. అర్బెల్ టెక్నాలజీలో అధునాతన సెన్సర్లు ఉంటాయి. రియల్ టైమ్ బాలిస్టిక్ కంప్యూటేషన్, లక్ష్య సముపార్జన సామర్థ్యం ద్వారా సైనికులు లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించగలరు. దానిలో వాడే మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్ అల్గారిథం ద్వారా ఆయుధం సరిగా లక్ష్యాన్ని ఛేదించగలదా లేదా..? అని మిల్లీసెకన్లలో అంచనా వేస్తుంది. మొదటి షాట్ తర్వాత షూటర్ ట్రిగ్గర్‌పై వేలు అలాగే ఉంచితే.. షూటర్ ప్రవర్తనను విశ్లేషించి తదుపరి రౌండ్లను కూడా విడుదల చేస్తుంది.

# త్యాగమూర్తుల సేవలను గుర్తెరగాలి

## విధివంచితులకు చేయూత అందించాలి - డిసెంబర్ 7... సాయుధ దళాల పతాక దినోత్సవం




దేశ మాతృ గౌరవాన్ని కాపాడటానికి, దేశ రక్షణక కోసం, ప్రాణాలను ఫణంగా పెడుతూ, ధైర్యంగా పోరాట బాటలో పయనిస్తున్న సాయుధ యువత, అలాగే అమరవీరుల త్యాగాలను ఎలా విస్మరించగలం. విధి నిర్వహణలో అసువులు బాసిన వారి కుటుంబాలకు, యుద్ధ భూమిలో క్షతగాత్రులకు ఏ మిచ్చి రుణం తీర్చుకోగలం. భారతదేశం స్వాతంత్ర్యం సాధించిన వెంటనే, ప్రభుత్వం తన రక్షణ సిబ్బంది సంక్షేమాన్ని నిర్వహించాల్సిన అవసరాన్ని గుర్తించింది. ఆగష్టు 28, 1949 న, రక్షణ మంత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒక కమిటీ ప్రతి సంవత్సరం డిసెంబర్ 7 న ఒక జెండా దినోత్సవాన్ని జరుపు కోవాలని నిర్ణయించింది. 1993 లో, భారత రక్షణ మంత్రిత్వ శాఖ సంబంధిత సంక్షేమ నిధులను ఒకే సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి (ఫ్లాగ్ డే ఫండ్)గా ఏకీకృతం చేసిం జెండా దినోత్సవాన్ని పాటించడం ద్వారా పౌరులకు చిన్న జెండాలను పంపిణీ చేయడం, విరాళాలు సేకరించడం. దేశం కోసం పోరాడే సాయుధ దళాల సిబ్బంది సంబంధిత కుటుంబాలను, ఆధార పడిన వారిని జాగ్రత్తగా చూసుకోవడం భారత దేశ పౌర బాధ్యత అని భావించి నందున పతాక దినోత్సవం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. వివిధ యుద్ధాలలో, సరిహద్దు రక్షణ, ఉగ్రవాదం, తిరుగు బాటును ఎదుర్కోవడంలో, మన సాయుధ దళాలు వివిధ సందర్భాలలో విలువైన ప్రాణాలను కోల్పోతూనే ఉన్నాయి. ఆ సందర్భాలలో కొద్దిమంది వికలాంగులు కావడం కూడా జరుగుతున్నది. అలాంటి కుటుంబం అనుభవించే బాధలు వర్ణనాతీతం. గాయపడినవారికి పునరావాసము, కల్పించడం, మాజీ సైనికోద్యోగులు, వారి కుటుంబీకుల సంక్షేమము, పునర్నివాసము, కల్పించడం, సర్వీసులో గల సిబ్బంది, వారి కుటుంబీకుల సంక్షేమము ఈ దినోత్సవ ప్రధాన లక్ష్యం. వారి సంరక్షణ, సంక్షేమం, పునరావాసం జాతి బాధ్యత. అలాగే తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న మాజీ సైనికులు చికిత్స కోసం అధిక వ్యయాన్ని భరించలేని వారు ఉన్నారు. అందువల్ల, వారి సంక్షేమం గురించి కూడా ఆలోచించాల్సిన అవసరం అనివార్యం. వారిపై ఆధారపడే వారిని చూసుకోవాల్సిన బాధ్యతను ఫ్లాగ్ డే తెరపైకి తెస్తుంది. అట్టి అవసరమైన వారికి సహాయాన్ని అందించడానికి కేంద్ర, రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ చర్యలు సరిపోవు. అందువల్ల, ప్రతి పౌరుడు వారి సంరక్షణ, మద్దతు, పునరావాసం కోసం ఆర్థిక సహాయాన్ని అందించడంలో స్వచ్ఛంద సహకారాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. అందుకే ఈరోజు సాయుధ దళాల జెండా దినోత్సవాన్ని పాటించడం ద్వారా ఆర్మీ, నేవీ, వైమానిక దళం చేసిన సేవలు గుర్తుకు తెచ్చుకుని, అమరవీరుల, వికలాంగ సిబ్బందిపై ఆధారపడిన వారి పునరావాసం, సంక్షేమాన్ని పట్టించు కోవడం ప్రతి పౌరుడి విధి. రక్షణ మంత్రిత్వ శాఖలో భాగమైన కేంద్రీయ సైనిక్ బోర్డు స్థానిక అధికారుల ద్వారా ఈ నిధుల సేకరణను దేశ.వ్యాప్తంగా నిర్వహిస్తారు. సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ పరిపాలనకు కేంద్రీయ సైనిక్ బోర్డు బాధ్యత వహిస్తుంది. దీనిని మేనేజింగ్ కమిటీ నిర్వహిస్తుంది. కేంద్రంలో రక్షణ మంత్రి నేతృత్వంలో, రాష్ట్ర / కేంద్రం పాలితాలలో గవర్నర్ / లెఫ్టినెంట్ గవర్నర్ ఆధ్వర్యం వహిస్తారు. భారత ప్రభుత్వ అత్యున్నత సంస్థ అయిన కేంద్రీయ సైనిక్ బోర్డ్ 32 మంది సైనిక్ బోర్డులు, 392 జిల్లా సైనిక్ బోర్డుల ఆద్వర్యంలో దేశవ్యాప్తంగా సంక్షేమ పథకాలకు సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ నుండి నిధులు సమ కూరుతాయి. కేంద్రంలోని కేంద్రీయ సైనిక్ బోర్డు మాదిరిగానే రాష్ట్ర, జిల్లా సైనిక బోర్డుకు... మాజీ సైనికులు, వితంతువులు మరియు ఆయా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు, జిల్లాల్లో నివసిస్తున్న వారిపై పునరావాసం, సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ఆయా సైనిక్ బోర్డులు బాధ్యత వహిస్తాయి. భారత సాయుధ త్రివిధ దళాల...భారత సైన్యం , భారత వైమానిక దళం, భారత నావికాదళం మూడు సేవలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఎరుపు, లోతైన నీలం, లేత నీలం రంగులలో చిన్న జెండాలు విరాళాలకు బదులుగా పంపిణీ చేయ బడతాయి. సేకరణ స్వచ్ఛంద సంస్థల ద్వారా అధికారిక, అనధికారిక మార్గాల ద్వారా నిర్వహించ బడుతుంది. దేశ ప్రజల ధన, ప్రాణ, మాన రక్షణకై అంకిత భావంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తి స్తూ, విధి వంచితులుగా మారిన త్యాగ మూర్తులకు, వారిపై ఆధార పడిన కుటుంబీకులకు చేయూత అందించాల్సిన అవసరాన్ని, బాధ్యతను దేశ వాసులుగా అందరూ గుర్తించాలి. **రామ కిష్టయ్య సంగనభట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# క్యారక్టర్ ఆర్టిస్టు ధర్మవరపు - డిసెంబర్ 7.. ధర్మవరపు సుబ్రహ్మణ్యం వర్ధంతి



ధర్మవరపు సుబ్రహ్మణ్యం (సెప్టెంబర్ 20, 1954 – డిసెంబర్ 7, 2013) తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రముఖ హాస్యనటుడు కమ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్. అయన సినిమా స్టార్ మాత్రమే కాదు, సీరియల్ ఆర్టిస్ట్ కూడా. టీవీ రంగం నుండి సినిమా రంగంలోకి ప్రవేశించాడు. 23 ఏళ్లలో వందలాది చిత్రాల్లో నటించాడు. వామపక్ష భావాలు కలిగిన సుబ్రహ్మణ్యం గతంలో ప్రజా నాట్యమండలి తరపున ఎన్నో నాటకాలు, ప్రదర్శనలు ఇచ్చాడు. దూరదర్శన్ లో ప్రసారమైన ప్రముఖ రచయిత యర్రంశెట్టి సాయి రచించిన ఆనందో బ్రహ్మ ద్వారా గుర్తింపు పొందాడు. తద్వారా చిత్రరంగంలో ప్రవేశించి హాస్యపాత్రలో తనదైన ముద్ర వేశాడు. అంతేకాక దర్శకునిగా (తోకలేని పిట్ట) కూడా కొంత ప్రయత్నం చేశాడు. ఆయన 2004 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ పార్టీ విజయానికి తన వంతు కృషి చేశాడు. 2004 నుండి 2013 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శిగా కొనసాగాడు. ధర్మవరపు సుబ్రహ్మణ్యం 1954 సెప్టెంబర్ 20 న ప్రకాశం జిల్లా లోని బల్లికురవ మండలం కొమ్మినేనివారి పాలెంలో ఓ వ్యవసాయ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పుడే తండ్రి చనిపోతే నలుగురు పిల్లలను ఆయన తల్లే పెంచి పెద్ద చేసింది. ఉన్నత పాఠశాల విద్యను అద్దంకిలోనూ, ఇంటర్ ఒంగోలు సి.ఎస్.ఆర్ శర్మ కళాశాలలోనూ చదివాడు. ఆ దశలోనే ఆయనకు ప్రజానాట్య మండలితో పరిచయం ఏర్పడింది. నాటకాల మీదే ఎక్కువ దృష్టి పెట్టడంతో ఇంటర్లో ఉత్తీర్ణులు కాలేదు. అమ్మ బాధ చూసి మళ్ళీ పట్టుదలగా సప్లిమెంటరీ పరీక్ష రాసి ఉత్తీర్ణుడయ్యాడు. తరువాత బీకాంలో చేరినా ఆయన మనసు సినిమాల వైపే ఉండేది. ఇంట్లో చెప్పకుండా మద్రాసు వెళ్ళి పోయాడు. అక్కడ అవకాశాలు రాకపోవడంతో మళ్ళీ సొంత ఊరుకు తిరిగి వచ్చాడు. మద్రాసు నుండి తిరిగి వచ్చి కొన్నాళ్ళు వ్యవసాయ పనుల్లో ఉండగా కొందరు మిత్రుల సలహా మేరకు పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షలు రాశాడు. అందులో ఉత్తీర్ణుడవడంతో హైదరాబాద్ లోని పంచాయితీ రాజ్ శాఖలో అధికారిగా ఉద్యోగం వచ్చింది. అక్కడ కొద్ది కాలం కుదుట పడ్డాక ఆయన దృష్టి మళ్ళీ నాటకాల వైపు మళ్ళింది. తరువాత ఆకాశవాణి కోసం కొన్ని రేడియో నాటకాలు రాశాడు. తరువాత దూరదర్శన్ లో తొలి తెలుగు ధారావాహిక అనగనగా ఒక శోభను ప్రారంభించారు. ఆ తరువాత మనసు గుర్రం లేదు కళ్ళెం, పరమానందయ్య శిష్యుల కథ ఆయనకు మంచి పేరు తెచ్చి పెట్టాయి. దూరదర్శన్ లోని పాపులర్ సీరియల్ ఆనందో బ్రహ్మ ఆయనకు సినిమా పరిశ్రమలోకి రావడానికి మార్గం సుగమం చేసింది. ఈ సీరియల్ 1980 వ సంవత్సరంలో ప్రసారం చేయ బడింది. తద్వారా ఆయన తెలుగువారందరికీ చిరపరిచితుడయ్యాడు. దూరదర్శన్ లో ఉండగానే ఆయనకు జంధ్యాల సినిమా జయమ్ము నిశ్చయమ్మురాలో అవకాశం వచ్చింది. నటనలో తలమునకలై ఉండగానే తోక లేని పిట్ట అనే సినిమాకు దర్శకత్వం, సంగీత దర్శకత్వం వహించాడు. అయితే ఆ సినిమా ఆశించనంతగా ఆడక పోవడంతో మళ్ళీ దర్శకత్వ బాధ్యతల జోలికి పోలేదు. నువ్వు నేను, ధైర్యం చిత్రాల మొదలుకొని చాలా చిత్రాల్లో అధ్యాపక పాత్ర వేసి నవ్వించారు. అయితే ఆ పాత్రలను కించ పరిచే విధంగా మలుస్తూ ఉండటంతో క్రమంగా ఆ పాత్రలకు స్వస్తి పలికాడు. ఆయన నట ప్రస్థానంలో ఒక్కడు సినిమాలో చేసిన పాస్‌పోర్ట్ ఆఫీసర్ పాత్ర, వర్షం సినిమాలో వాతావరణ వార్తలు చదివే గాలి గన్నారావు, రెడీ సినిమాలో హ్యాపీ రెడ్డి అలియాస్ సంతోష్ రెడ్డి మొదలైన పాత్రలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఆలస్యం అమృతం సినిమాకు ఉత్తమ హాస్యనటుడిగా ,"నంది అవార్డు" అందుకున్నారు. ఆయన నటించిన చివరి సినిమా ప్రేమాగీమా జాంతానై విడుదల కాక ముందే తనువు చాలించాడు. అప్పటికే అనారోగ్యంగా ఉన్నప్పటికీ ముందుగా కుదుర్చుకున్న ఒప్పందం మేరకు వికారాబాద్‌లో జరిగిన షూటింగ్‌కు హాజరైనాడు. అతను 2011 నుండి సాక్షి టివిలో రాజకీయ వ్యంగ్య కార్యక్రమం మరియు 'డింగ్ డాంగ్' ను నిర్వహించాడు. ఆరు నెలలుగా కాలేయ కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన డిసెంబర్ 7, 2013 శనివారం రాత్రి 10.30 గంటలకు చైతన్యపురిలోని గీతా ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# మాల ధారణం... నియమాల తోరణం



మంచు కురిసే శీతాకాలం ప్రారంభమయిందంటే స్వామియే శరణం అయ్యప్పా అని భక్తాగ్రేస రుల భజనలు పల్లె, పట్టణం తేడా లేకుండా ప్రతిధ్వనిస్తాయి. గతంలో పట్టణాలకు మాత్రమే పరిమిత మైన ఈ దీక్షలు, నేడు మారుమూల గ్రామాలకు సైతం విస్తరించి, భక్తజనం నానాటికీ పెరుగుతు న్నది. కార్తీక మాసం ప్రారంభం నుండి వివిధ సమయాలలో ఆచరించే అయ్యప్ప స్వామి దీక్షలు భక్తి శ్రద్ధలకు, పవిత్రతకు, నియమాలకు ప్రతీకలు.

**అయ్యప్ప అవతారము...** ప్రతి యుగంలోనూ ధర్మసంస్థాపనార్థం శ్రీమహా విష్ణువు అవతారాలెత్తుతూ సనాతన ధర్మాన్ని సంరక్షిస్తాడు. కాని దత్తాత్రేయుడు భక్తజనోద్ధరణ కొరకు శాశ్వత అవతార పురుషుడుగా భూమి యందు అవతారాలు ఎత్తుతూ 'చతుర్యుగ అవతార మూర్తి'గా ఖ్యాతినొందాడు. త్రిమూర్తుల అంశాలుగా జన్మించిన దత్తాత్రేయుని అవతారాల్లో ఒకటి అయ్యప్పస్వామి, మోహిని రూపంలో ఉన్న హరికి, శివునికీ కలిగిన పుత్రుడైనందున 'హరిహర సుతుడని' ధర్మశాస్త్రా, భూతనాధుడు, అయ్యప్ప అని కీర్తించ బడుతున్నాడు. మహావిష్ణువుచే మణి హారమును మెడలో వేయబడి నందున 'మణికంఠుడని' సార్ధక నామధేయుడైనాడు. పాండ్య దేశ రాజైన రాజశేఖరుడు, మహారాణి పేరిందేవి, ప్రేమతో అయ్య, అప్ప' అని పిలిచినందున 'అయ్యప్ప'గా పిలువబడు తున్నాడు. రాజశేఖర మహారాజు, అగస్త్య మహాముని' ఆదేశానుసారం 'ఎరుమేలి వద్ద ధర్మశాస్తా దేవాలయంను నిర్మించెను. శబరి తపస్సు చేసిన స్థలంలో విశ్వకర్మ అయ్యప్ప దేవాల యమును, ఎడమ వైపు మాలికాపురత్తమ్మ ఆలయాన్ని, అయ్యప్ప ఆలయానికి తూర్పున 18 మెట్లు, వాటికిరువైపుల కరుప్ప, కడుత్త దేవాలయాలు నిర్మించెను. పవిత్రమైన మకర సంక్రాంతి రోజు శనివారం కృష్ణ పంచమి, ఉత్తరా నక్షత్రాన పరుశురాముడు అయ్యప్ప విగ్రహాన్ని ప్రతిష్టించెను.

**మాల ధారణం...** 18సార్లు శబరిమల పదునెట్టాంబడిని అధిరోహించి, దైవ సాక్షాత్కారం కలిగిన గురుస్వామి మంత్రోచ్ఛారణలతో మాలధారణ చేస్తాడు. దీక్షా నియమాలు త్రికరణ శుద్ధిగా పాటిస్తామని ప్రతిజ్ఞ చేయిస్తాడు. ఏకాగ్రతతో అత్మ సాక్షాత్కారార్థమై పాపములు తొలుగుటకు, లౌకిక విషయాలపై వ్యామోహం తగ్గుటకు, కోపతాపాలు ఉపశమించేందుకు ఉదయం, సాయంత్రం 108 సార్లు శరణు ఘోష చేస్తూ, 41 రోజులకు తక్కువ కాకుండా దేవుడిని పూజిస్తూ సాధన చేయడం సాంప్రదాయం. నల్ల దుస్తులు ధరించుట, నుదుటిపై విభూతి చందన, కుంకుమలు ధరించుట, తులసి, రుద్రాక్ష మాల ధారణం, బ్రహ్మచర్యం, సాత్వికాహారం, భజన, అన్నదానం, పవిత్ర స్నానాలు, వైరాగ్య సంకే తాలైన గడ్డం, గోళ్లు పెంచుట దీక్షలో ప్రధానాంశాలు. కొబ్బరికాయ మూడు కన్నులలో ఒక కన్నుకు రంధ్రం చేసి, నీటిని తొలిగించి పరిశుద్ధ మైన నెయ్యితో నింపి, ఇరుముడిలో ఒక ముడిలో కడుతూ, రెండవ ముడిలో యాత్రకు కావలిసిన ఆహార పదార్థాలు కడతారు. ఇరుముడిని తలపైకి ఎత్తుకున్నాక వెనక్కు తిరిగి చూడక బయలుదేరు తారు. ప్రయాణంలో ఎరుమేలి, కాళికట్టి, అశుదా నది, కలిడంకుంద్రం, కరిమల, పంపానది, నీలి మలై, శరంగుత్తియాల్, శబరిపీఠం, సన్నిదానం చేరుకుంటారు. 41రోజులకు తక్కువ గాకుండా గురుస్వామి ద్వారా 108 పూసలు గల తులసి లేదా రుద్రాక్ష మాలధారణ, ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం విభూతి, చందనం, కుంకుమ ధరించి 108 సార్లు అయ్యప్ప శరణు ఘోష పలకడం, కర్పూర హారతి, ఫలాదిక సమర్పణం దుస్తులు ధరించడం, రోజుకొక్క సారైన దేవాలయ సందర్శనం చేస్తారు. ఇవే కాకుండా పాదరక్షలు తొడగక పోవడం, ధూమపానం మత్తు పదార్థాలు, తాంబూలం, మాంసాహార నిషేధం, ఒక్కసారి భోజనం, అల్పాహారం, క్షవరం, గోళ్ళు తీయడం నిషేధం. మంచంపైగాక చాపపై మాత్రమే నిద్రించడం, పగలు నిద్రించక పోవడం, దీక్షాకాలంలో బ్రహ్మచర్యం పాటించడం, వినోద కార్యక్రమాలు చూడక పోవడం, స్నానం చేసే వరకు మంచినీరు త్రాగక పోవడం, కుల మత ధనిక పేద భేదం లేక అయ్యప్పలకు నమస్కారం చేయడం, ఆధ్యాత్మిక పుస్తక పఠనం, సత్సంగం, విధిగా భజనలో పాల్గొనడం, కనీసం మూడు సార్లయినా ఇతరుల యింటికి భిక్షకు వెళ్ళడం, అన్న దానం చేయడం అయ్యప్ప దీక్షా సమయంలో విధిగా పాటించాల్సిన నియమాలు. మొదటిసారి దీక్షను తీసుకున్న కన్నెస్వాములు మకర సంక్రాంతి సమయంలో కనిపించే మకర జ్యోతిని సందర్శించు కుంటారు. చాలా వరకు స్వయంపాకాన్నే భుజిస్తూ ఒకపూట భోజనం, ఒకపూట అల్పాహారం మితంగా భుజిస్తూ, దీక్షను స్వీకరించేవారు దైవభక్తి, ఆత్మ సంయమనంతో పాటు, ఆరోగ్యవంతులుగా ఉండ గలరనేది నిర్వివాదాంశం. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**




# రూపాయి పతనం.. నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు

భారత రూపాయి మారకం విలువ అమెరికన్ డాలర్‌తో పోలిస్తే జీవనకాల కనిష్ఠాలకు పతనమవుతోంది. రూపాయి విలువ 90.70–91 మార్క్‌ను తాకనుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలమేమీ కాదని, ఇలాంటి పరిస్థితులు ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని వెల్లడించారు. ఈ మేరకు హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో మాట్లాడారు. ఆర్థిక వ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని మంత్రి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కంటే.. ఇప్పుడు ఆర్థికవ్యవస్థ పనితీరు మెరుగ్గా ఉందని వెల్లడించారు.

ఆర్థిక వ్యవస్థ ప్రాథమిక అంశాలను క్రమబద్ధీకరించామన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా రూపాయిపై చర్చ జరగాలని అభిప్రాయపడ్డారు. "రూపాయి విలువ తగ్గినప్పుడు.. మన ఎగుమతిదారులు దానిని సద్వినియోగం చేసుకుంటున్నారని నేను కచ్చితంగా చెప్పగలను. మన ఉత్పత్తులపై సుంకాల వేళ.. ఇదికాస్త సానుకూలమే. రూపాయి కదలికలతో పాటు ఆర్థిక వ్యవస్థ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కరెన్సీ హెచ్చుతగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరును నిర్ణయించలేవు" అని అన్నారు.

**రుణగ్రహీతలకు ఊరట...** కుటుంబాల్లో పొదుపు తగ్గుతోందన్న ఆందోళనలను మంత్రి తోసిపుచ్చారు. పొదుపు, పెట్టుబడులు పెరుగుతున్నాయని వెల్లడించారు. సంప్రదాయ పొదుపు మార్గాల్లో మార్పులు వస్తుండటంతో అలా అనిపిస్తుందని, కానీ వాస్తవంగా పొదుపు తగ్గడం లేదన్నారు. పైగా ఆస్తులు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ క్రమంలో బ్యాంకు రుణాలు ఉపకరిస్తున్నాయని చెప్పారు. కాగా.. భారత్–అమెరికా డీల్‌పై అనిశ్చితులు, విదేశీ పెట్టుబడులు తరలిపోవడం వంటి కారణాలతో కొన్ని రోజులుగా రూపాయి మారకం విలువ పతనమవుతోంది. వస్తువులకు చెల్లింపులు చేసేందుకు దిగుమతిదారులు భారీగా డాలర్లను కొనుగోలు చేస్తుండటం రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతోంది.




చెన్నై : తమిళనాడులోని రామేశ్వరంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన అయ్యప్ప భక్తులు కారు ఆపి నిద్రిస్తుండగా డీఎంకే నేతకు చెందిన మరో కారు వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో కారులో ఉన్న ముగ్గురు అయ్యప్ప భక్తులు, డీఎంకే కారు డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని తీవ్రంగా గాయపడిన ఎనిమిది మందిని చికిత్స నిమిత్తం రామనాథపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరో అయ్యప్ప భక్తుడు మృతి చెందాడు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. వీరంతా శబరిమలకు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుల్లో ముగ్గురిని ఏపీలోని విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస వాసులుగా గుర్తించారు. మరొకరిని గజపతినగరం మండలం మరుపల్లివాసిగా గుర్తించారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన హోంమంత్రి అనిత..** రోడ్డు ప్రమాదంలో విజయనగరం వాసుల మృతి పట్ల హోంమంత్రి అనిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతదేహాలను త్వరితగతిన కుటుంబ సభ్యులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా వాసుల మృతి పట్ల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగివస్తుండగా ప్రమాదం జరగడం విచారకరమన్నారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.

చురకలు

## సంపాదకీయం

# కాంగ్రెస్ అంటే శశిధరూర్... ఇదే ఎన్డీయే తీరు

కేంద్రంలో మూడో సారి అధికారంలోకి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం విపక్షాల విషయంలో తనదైన వ్యూహంలో ముందుకు సాగుతోంది. అదే సమయంలో కాంగ్రెస్ పట్ల మరింతగా పదునైన చాణక్య రాజకీయాన్ని అమలు చేస్తోంది అని అంటున్నారు. ఇక ఈ ఏణ్ణర్థం కాలంలో మోడీ నాయకత్వంలో బీజేపీ దేశంలో వరసగా అన్ని రాష్ట్రాలని గెలుచుకుని వస్తోంది. దాంతో ధీమా కూడా పెరుగుతోంది. అలాగే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ నాయకత్వం కూడా జనం మెప్పు పొందలేకపోతోంది అన్న భావనతో కూడా కమలం పార్టీ పెద్దలు ఉన్నట్లు కనిపిస్తోంది. దాంతో రాహుల్ గాంధీ విషయంలో లైట్ తీసుకుంటున్నట్లుగా కనిపిస్తోంది అని అంటున్నారు.

**ప్రోటోకాల్ అంటూ :** ఇక ఒక విదేశీ అధినేత దేశానికి వచ్చినపుడు ఆయనతో ప్రధాని అలాగే ప్రతిపక్ష నేత కూడా సమావేశం కావడం ఒక ఆచారంగా ప్రోటోకాల్ లో భాగంగా వస్తోంది అని అంటున్నారు. అయితే రష్యా అధినేత పుతిన్ భారత్ పర్యటనలో ఎక్కడా లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కానీ రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కానీ కనిపించక పోవడం విశేషం అంటున్నారు. పూర్తిగా విపక్ష నేతలను పక్కన పెట్టేశారని కాంగ్రెస్ దీని మీద ఆరోపిస్తోంది. రాహుల్ గాంధీ అయితే దీని మీద హాట్ కామెంట్స్ చేశారు. ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించే సంప్రదాయాన్ని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉల్లంఘించిందని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**కాంగ్రెస్ ఎంపీకి :** రాహుల్ ఈ విషయం మీద పెద్ద ఎత్తున చర్చకు పెట్టి మరీ మోడీ ప్రభుత్వం మీద విమర్శలు చేసిన నేపథ్యంలో లోకసభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే ఇద్దరినీ ఆహ్వానించలేదని అంటున్నారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు వారిని ఆహ్వానించలేదని అంటున్నారు. అదే సమయంలో చాలా ఆసక్తికరంగా కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్‌ను ఆహ్వానించినట్లుగా కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

**అదేమీ లేదంటూనే :** పుతిన్ భారత పర్యటన కాదు కానీ ఈ ప్రోటోకాల్ వివాదం ఒక వైపు కొనసాగింది. అయితే దీని మీద ప్రభుత్వ వర్గాలు కూడా వివరణ ఇచ్చాయి. గతంలో అంటే 2024 జూన్ 9న అప్పటి బంగ్లాదేశ్ ప్రధానమంత్రి షేక్ హసీనాతో సహా కనీసం నలుగురు పర్యాటక దేశాధినేతలను రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి హోదాలోనే కలిశారని గుర్తు చేశారు. ఇక విదేశీ అధినేతలను ఎవరినైనా కలవాలా వద్దా అని నిర్ణయించేది విదేశాంగ మంత్రిత్వ శాఖ కాదని అలా ఈ దేశాన్ని సందర్శించే విదేశీ ప్రతినిధి బృందం అని కూడా ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మొత్తం మీద చూస్తే పుతిన్ టూర్ లో రాహుల్ ఎక్కడా కనిపించలేదు, మరి దానికి కారణాలు అయితే తెలియదు, ప్రభుత్వం మాత్రం వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది.

# విధి నిర్వహణ సరేసరి... హక్కుల మాటేమిటి మరి”

## కనీస హక్కులకు నోచుకోని పోలీసు వ్యవస్థ - డిసెంబర్ 7... ఈస్ట్ ఇండియా కంపెనీ పోలీస్ వ్యవస్థను ప్రవేశ పెట్టిన దినం



1792లో డిసెంబర్ 7వ తేదీన భారత దేశంలో పోలీసు వ్యవస్థను ఈస్ట్ ఇండియా కంపెనీ ప్రవేశ పెట్టింది. 1857 తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం,17 ఆగష్టు 1860 నాడు పోలీస్ కమీషన్ ఏర్పాటు చేసింది. పోలీస్ కమీషన్ తన, నివేదికను 3 అక్టోబర్ 1860, నాడు సమర్పించింది. భారతదేశం లోని పోలీసు సంస్థల గురించిన వివరాలను సేకరించడం, పోలీసు వ్యవస్థలో కొన్ని సంస్కరణలను చేయటం, ఉన్న వాటిని అభివృద్ధి చేయటం గురించి సలహాలు ఇవ్వటము ఈ పోలీసు కమీషన్ విధులు. 22వ మార్చి, 1861న పోలీసు నియంత్రణ కోసం ఒక చట్టం అలా ఏర్పడింది. దీని ఆధారంగానే, నేటికీ అమలులో ఉన్న పోలీస్ చట్టము 1861 ఏర్పడింది. శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు, ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరక్కుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ పోలీసు వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్న సత్యం.. అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్ళు కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటిష్ పరిపాలన అంతమై డెబ్బది ఏడు వసంతాలు దాటినా , వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, అధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలిక మార్పులు చోటు చేసుకోక పోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్ళుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాత కూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు, వ్యయ ప్రయాసల కోర్చి అదనపు పని గంటలలో శక్తికి మించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించకపోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులవలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు, పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుల్లు మరియు హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధార పడి ఉంటుందనేది నగ్నసత్యం. విధి నిర్వహణలో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండేది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతిఘటనలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాలో, తెలియని స్థితిలో, ఎక్కడికి వెళ్ళాలో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యులకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అనుక్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పని దినాలు ఈ శాఖ ఉద్యోగులకు ఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతులతో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట అంధకారంలో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్య కృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజుల ముందే ఆ ప్రాంతానికి వెళ్ళి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్ళే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్టతో , కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల అగ్రహానికి గురి కాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం. ఇవన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ స్వంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో, అంకితభావంతో విధులను నిర్వర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయనేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో “ధర్మవీర కమిషన్” సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. “సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్ట పరిరక్షణే ధ్యేయంగా”, ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు “స్వీయ రక్షణే” నేటి పరిస్థితుల్లో కరువు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధినిర్వహణలో మమేకమవుతున్నారు.

**“పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కృషి”......** గత తెలంగాణ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కొంత కృషి చేసింది. తాజా మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350 కోట్ల రూపాయల నిధులను కేటాయించగా, పోలీసు స్టేషన్లకు పెద్దమొత్తంలో కొత్త వాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతి పోలీసు స్టేషన్ కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశ్యంతోనే మొత్తం 600 టాటా సుమోలు, 1600 ఇన్నోవాకార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలు తో పాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషను 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషను 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేల చొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్టం పరిచారు. ఇటీవల ‘హోంగార్డు’లకు జీతభత్యాలను కూడా పెంచింది. పోలీసులకు, వారాంతరపు సెలవులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆచరణపై దృష్టి సారించ లేక పోయింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే పోలీస్ రిక్రూట్మెంట్ చేపట్టింది. ప్రధానంగా “మీ వెంటే మేమున్నాం” అంటూ వారికి అన్ని విధాలా అభయహస్తం అందిస్తూ, “మీ సంక్షేమమే మాకు ముఖ్యం” అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా నూతన రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగనభట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# మరో ప్రపంచ యుద్ధాన్ని ఐ.రా.స నివారించ గలదా!? డిసెంబర్ 7...ఐక్యరాజ్య సమితి అధికారిక చిహ్నం ఆమోద దినం




ఐక్యరాజ్య సమితి ప్రపంచ శాంతి, భద్రత, అభివృద్ధి, మానవ హక్కుల పరిరక్షణ వంటి ప్రధాన లక్ష్యాలను చేరుకోవడానికి ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ. 1945లో స్థాపించ బడిన ఈ సంస్థకు ప్రస్తుతం 193 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఈ సంస్థ చిహ్నం ఆమోదం పొందిన డిసెంబర్ 7, 1946, ముఖ్యమైన తేదీగా నిలిచింది.

**చిహ్నం రూపకల్పన...** 1945లో సాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన సమావేశంలో ఐక్యరాజ్య సమితి చిహ్నం రూపకల్పనపై చర్చించ బడింది. ప్రపంచానికి శాంతి సందేశం పంపేలా ఒక చిహ్నం రూపకల్పన అవసరం ఉందని భావించారు. నిపుణుల బృందం ఈ చిహ్నాన్ని రూపొందించింది.

**చిహ్నం ముఖ్య లక్షణాలు:** ప్రపంచ పటం: మిడిల్ మెర్కేటర్ ప్రొజెక్షన్ (అక్షాంశం యొక్క అన్ని సమాంతరాలు భూమధ్యరేఖకు సమానమైన పొడవును కలిగి ఉండే విధంగా సిలిండర్‌పై ప్రపంచ మ్యాప్ (ప్రొజెక్షన్) విధానంలో రూపొందించిన ప్రపంచ పటం, ఐక్యరాజ్య సమితి గ్లోబల్ ఐక్యతను సూచిస్తుంది. ఒలివ్ కొమ్మలు: చిహ్నంలో ఉన్న రెండు ఒలివ్ కొమ్మలు శాంతికి చిహ్నం. రంగులు: నీలం మరియు తెలుపు రంగులు శాంతి, విశ్వాసాన్ని ప్రతిబింబిస్తాయి.

**చిహ్నం ఆమోదం...** డిసెంబర్ 7, 1946న ఐక్యరాజ్య సమితి అసెంబ్లీ చిహ్నాన్ని అధికారికంగా ఆమోదించింది. ఆ రోజునుంచి ఈ చిహ్నం ఐక్యరాజ్య సమితి లక్ష్యాలను ప్రతిబింబించే శాశ్వత గుర్తుగా మారింది.

**చిహ్నం ప్రాముఖ్యత...** శాంతి, భద్రత: చిహ్నం ప్రపంచంలో శాంతి పరిరక్షణకు ఐక్యరాజ్యసమితి చేస్తున్న కృషిని ప్రతిబింబిస్తుంది. ఐక్యత: అన్ని దేశాలు ఐక్యంగా ఉండే భావనకు చిహ్నం ప్రాతినిధ్యం వహిస్తుంది. అంతర్జాతీయ చట్టం: ఐక్యరాజ్యసమితి ఒప్పందాలు, సమావేశాలు, పత్రికల్లో ఈ చిహ్నం ఉపయోగించ బడుతుంది.

**ఐక్యరాజ్యసమితి స్థాపన – ఒక చారిత్రక పరిణామం...** రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం, 1945లో శాన్ ఫ్రాన్సిస్కో సమావేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్యరాజ్య సమితి ఛార్టర్ పై సంతకాలు చేశారు. అక్టోబర్ 24, 1945న ఐక్యరాజ్య సమితి అధికారికంగా ఆవిర్భవించింది. ప్రతి సంవత్సరం అక్టోబర్ 24ను ఐక్యరాజ్యసమితి దినోత్సవంగా జరుపుకుంటారు.

**ప్రధాన లక్ష్యాలు:** యుద్ధ నివారణ: ప్రపంచ యుద్ధాలు జరగకుండా చూడటం. శాంతి స్థాపన: అంతర్జాతీయ తగాదాలను శాంతియుతంగా పరిష్కరించడం. సాంఘిక, ఆర్థిక అభివృద్ధి: ప్రపంచ దేశాల అభివృద్ధి కోసం సహకారం. మానవ హక్కుల పరిరక్షణ: ప్రజల హక్కులను గౌరవించేందుకు చర్యలు.

**ఐక్యరాజ్య సమితి అంగాలు:** సర్వప్రతినిధి సభ: అన్ని సభ్య దేశాలు ప్రాతినిధ్యం పొందే ప్రధాన సభ. భద్రతా మండలి: 15 దేశాలతో కూడిన ఈ మండలి ప్రపంచ భద్రత, శాంతి కోసం కృషి చేస్తుంది. శాశ్వత సభ్య దేశాలు: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్. సచివాలయం: ఐక్యరాజ్యసమితి కార్యనిర్వాహక విభాగం. ఆర్థిక, సాంఘిక మండలి: ప్రపంచ ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం కృషి. అంతర్జాతీయ న్యాయస్థానం: న్యాయపరమైన వివాదాలను పరిష్కరించేందుకు హేగ్‌లో ఉన్న న్యాయస్థానం. ధర్మకర్తృత్వ మండలి: పూర్వపు వలస ప్రాంతాలకు స్వాతంత్ర్యం అందించడంలో సహకారం.

**ప్రస్తుత ప్రాధాన్యత:** ఐక్యరాజ్య సమితి ప్రపంచ శాంతి, భద్రత కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, తీవ్రవాదం, శరణార్థుల సమస్య, యుద్ధాలు వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. ఐక్యరాజ్యసమితి విధానాల్లో సరిచర్యలు చేపట్టి మరింత సమర్థవంతంగా పని చేయాల్సిన అవసరం ఉంది. డిసెంబర్ 7న ఐక్యరాజ్య సమితి చిహ్నం ఆమోదం పొందిన రోజును గుర్తు చేసుకోవడం ద్వారా, శాంతి, ఐక్యతకు ప్రపంచం ప్రాధాన్యం ఇస్తున్నదనేది స్పష్టమవుతుంది. భవిష్యత్తులో, మరో ప్రపంచ యుద్ధాన్ని నివారించేందుకు ఐక్యరాజ్యసమితి కీలక పాత్ర పోషించగలదని ఆశిద్దాం.

**రామ కిష్టయ్య సంగనభట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# డిసెంబర్ 7... ప్రపంచ పౌర విమానయాన దినం




ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న ప్రపంచ దేశాలన్నీ అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం జరుపుకుంటాయి. ఈ రోజున ప్రపంచ దేశాల్లో పౌర విమానయాన రంగం, విమాన రవాణా, ప్రపంచ అభివృద్ధిలో విమాన రంగం పాత్ర వంటి అంశాలపై అవగాహనా కార్యక్రమాలు జరుపుతారు. ఐతే... చాలా మందికి ఇలాంటి రోజు ఒకటి ఉంటుందని తెలియదు. ముఖ్యంగా భారత్ లాంటి వర్ధమాన దేశాల్లో పౌర విమానయాన దినంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అంతంత మాత్రమే. విద్యార్థులు, ప్రజలకు ఈ రోజుకు చరిత్రలో ఉన్న ప్రాధాన్యం ఎందుకే తెలిసే అవకాశం ఉండడం లేదు. అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవాన్ని ఏటా డిసెంబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, ఆర్థికాభివృద్ధి కొరకు పౌర విమాన యానం యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేయాలనే లక్ష్యంతో జరుపుకుంటారు. వాయు రవాణా భద్రత, సమర్థతను ప్రోత్సహించడానికి, వాయు రవాణాలో అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ యొక్క పాత్రగురించి అవగాహన కల్పించడానికి అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం జరుపుకుంటారు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ (ఐసిఏఓ) ఇంటర్నేషనల్ ఫర్ ఏవియేషన్ సేఫ్టీ ప్రమాణాలను అభివృద్ధి చేసే బాధ్యత ఐక్యరాజ్య సమితిపై ఉంది. పౌర విమానయానంలో అంతర్జాతీయ సహకారం, ఏకరూప తను సాధించడానికి అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ 1947 ఏప్రిల్ 4 న ఏర్పాటైంది. దీని ప్రధాన కార్యాలయం కెనడా లో ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ కన్నా ముందు ఇంటర్నేషనల్ కమిషన్ ఫర్ ఎయిర్ నావిగేషన్ ఉండేది. దీని మొదటి సదస్సు 1903లో జర్మని దేశ రాజదాని బెర్లిన్లో జరిగింది. ఆ సమావేశానికి కేవలం 8 దేశాలు మాత్రమే హాజరయ్యాయి. హాజరైన ఎనిమిది దేశాలలో ఎటువంటి ఒప్పందాలు కుదర లేదు. 1906లో బెర్లిన్‌లో జరిగిన రెండవ సదస్సులో 27 దేశాలు హాజరయ్యాయి. 1912లో లండన్‌లో జరిగిన మూడవ సదస్సులో విమానాల ఉపయోగం కోసం మొదటి రేడియో కాల్ సైన్ లను కేటాయించింది. 1944 డిసెంబర్ 7 న చికాగోలో జరిగిన సదస్సులో అంతర్జాతీయ పౌర విమానయాన ఒప్పందం కుదిరి, చికాగో సదస్సు ఒప్పందంపై 52 దేశాలు సంతకం చేశాయి. 26వ దేశం 1947 మార్చి 5 న సదస్సును ఆమోదించింది. దీని ఫలితంగా PICAO స్థానంలో 1947 ఏప్రిల్ 4 న ICAO శాశ్వత సంస్థగా స్థాపించబడింది. 26 దేశాలు ఈ సమావేశాన్ని ఆమోదించి నప్పుడు శాశ్వత సంస్థ ఏర్పడుతుందనే ఒప్పందం ప్రకారం 1945 జూన్ 6 న ICAN స్థానంలో PICAO పని చేయడం ప్రారంభిం చింది. 1994లో తొలిసారిగా అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం జరిపారు. అంతర్జా తీయ పౌర విమానయాన సంస్థ (ICAO, ఐసిఎఒ ), 50వ వార్షికో త్సవ కార్యక్రమాల్లో భాగంగా ఈ దినోత్సవాన్ని ప్రారంభించారు. వైమానిక భద్రత విషయంలో ఐసిఎఒ నాయకత్వ పాత్ర పోషిస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా వైమానిక భద్రతను పెంపొందించడం ఈ సంస్థ పూర్తి స్థాయి లక్ష్యం. అంతర్జాతీయ పౌర విమానయాన సంస్థ ప్రపంచ వాతావరణ సంస్థ, ఇంటర్నేషనల్ టెలికమ్యూనికేషన్స్ యూనియన్, యూనివర్సల్ పోస్టల్ యూనియన్, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మరియు ఇంటర్నేషనల్ మారిటైమ్ ఆర్గనైజేషన్ తో సహా ఇతర యుఎన్ సభ్యులతో కలిసి పని చేస్తుంది. 2020నుండి 2023 వరకు: ప్రపంచ పౌర విమానయాన రంగ అభివృద్ధికి సరికొత్త కల్పనను జోడించడం ప్రధాన థీమ్ గా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రపంచ దేశాలన్నీ విమాన రంగం, విమాన రవాణా వల్ల కలుగుతున్న సేవల్ని గుర్తుచేసుకుంటూ, విమాన రంగ అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలను తీర్మానించు కుంటాయి. విమాన యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధానంగా మొదటి విమానం ఎగిరినప్పటి నుంచి విమాన రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పులపై విద్యా ర్థులకు అవగాహన కలిగించే కార్యక్రమాలు చేపట్టాలి. విద్యా ర్థులకు వైమానిక రంగంపై ఆసక్తిని కలిగించాలి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో చేరుట, విమాన పైలెట్, ఎయిర్ హోస్టెస్ కావడం, క్యాబిన్ క్రూ, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీర్స్, ఏరోనాటికల్ ఇంజినీర్స్ వంటి అనేకరకాల ఉద్యోగాలను పొందే అవకాశాల వంటి ఆలోచనలు పెంపొందించే, అవగాహన విద్యార్థులకు కలిగించాలి.

**రామ కిష్టయ్య సంగనభట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్ – 9440595494**

# పాల వెల్లువ

ఖమ్మం : ప్రభుత్వరంగ సంస్థ విజయ డెయిరీలో పాల సేకరణ గణనీయంగా పెరిగింది. నవంబర్ మొదటి వారంలో రోజుకు కేవలం 2వేల లీటర్ల సేకరించగా ఇప్పుడు 11,800 లీటర్లకు పైగా పెరగటం విశేషం. డెయిరీ అధికారులు చొరవ తీసుకుని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో కొత్తగా 30కి పైగా పాలసేకరణ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధిర ఇందిరా డెయిరీ నుంచి మొదటి విడతలో 250 ముర్రాజాతి పాడి గేదెలను ప్రభుత్వం కేటాయించింది. వీటి ద్వారా అదనంగా పాల సేకరణ జరుగుతోంది. దీనికి తోడు ఇప్పుడు పాల సీజన్ కావటం మరో కారణం. ఇప్పటి నుంచి మార్చి వరకు పాల సేకరణ బాగుంటుంది. ప్రైవేట్ డెయిరీల కంటే విజయ డెయిరీ అత్యధిక ధర చెల్లిస్తోంది. లీటరు గేదె పాలకు అత్యధికంగా రూ.85 ఇస్తోంది. ఏడాది క్రితం వరకు పాడి రైతులకు చెల్లించాల్సిన పాల బిల్లులు రెండు, మూడునెలల పాటు పెండింగ్‌లో ఉండేవి. ప్రస్తుతం ప్రతి పక్షం రోజులకోసారి చెల్లించటం వల్ల డెయిరీకి పాలు పోసే రైతుల సంఖ్య పెరుగుతోంది.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పాల సేకరణ కేంద్రాలు-233, పాల సహకార సంఘాలు- 87 ఉన్నాయి. విజయ డెయిరీకి 3,050 మంది రైతులు పాలు విక్రయిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని ప్రభుత్వ



సంస్థలకు 5,510 లీటర్లు, సివిల్ మార్కెట్లలో 563.5 లీటర్ల పాలను రోజువారీగా విజయ డెయిరీ విక్రయిస్తోంది. సూర్యాపేట జిల్లాలోని ప్రభుత్వ సంస్థలకు 2,033 లీటర్లు అమ్ముతోంది. మిగతా పాలను హైదరాబాద్‌కు తరలిస్తోంది.

బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ రోజుకు పాలసేకరణ (లీటర్లలో)

ఖమ్మం 5,901.5
ఎర్రుపాలెం 1,223.0
కామేపల్లి 535.5
కల్లూరు 1,060.0
కొత్తగూడెం 2,246.0
ఇల్లెందు 880.0

విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సుమారు 12వేల లీటర్ల పాలు సేకరిస్తున్నాం. 20వేల లీటర్లను సేకరించాలని లక్ష్యం నిర్దేశించుకున్నాం. ఈనెలాఖరు వరకు లక్ష్యాన్ని అధిగమిస్తాం. ప్రధానంగా ఎక్కువ ధర కల్పించే విషయంపై రైతులకు అవగాహన కల్పిస్తాం. మినరల్ మిక్చర్, దాణాను రాయితీపై అందిస్తాం. వివిధ బ్యాంకుల ద్వారా పాడి రైతులకు ముద్రా రుణాలు అందించేలా ఏర్పాట్లు చేస్తాం. కె.రవికుమార్, ఉప సంచాలకుడు, విజయడెయిరీ

# పల్లె.. సమస్యల ముల్లె!

ఆదిలాబాద్ : పల్లెటూరు.. పచ్చని పొలాలు.. ఉట్టిపడే మానవ సంబంధాలు.. ఆత్మీయ పలకరింపులు.. కష్టనష్టాలను భరిస్తూ.. జీవితాలు గడుపుతుంటారు 1964లో మొదటిసారి ఎన్నికలు జరిగాయి. అప్పటి నుంచి ఎంతో మంది సర్పంచులుగా పనిచేశారు.. కొన్ని గ్రామాలు ప్రగతి పథంలో పయనిస్తుంటే.. మరికొన్ని అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి.. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో పంచాయతీల ప్రగతిపై కథనం..

**గూడులేనివి 679**

జిల్లాలోని అనేక గ్రామాలకు గత ప్రభుత్వం పంచాయతీ హోదా కల్పించింది.. అయితే, జిల్లాలోని 679 పంచాయతీలకు ఇంకా సొంత గూడు లేదు.. అద్దె భవనాలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో పంచాయతీని నిర్వహిస్తున్నారు.

**బస్సు ఎరగని గ్రామాలు 2,206**

ఉమ్మడి జిల్లాలో పంచాయతీలు, అనుబంధ గ్రామాలు 3,701 ఉన్నాయి.. ఆర్టీసీ కేవలం 1,496 గ్రామాలకు బస్సులు నడుపుతోంది.. చాలా గ్రామాలకు బస్సు అంటే తెలియదు.. ఆదాయం రాకపోవడం, రహదారులు బాగాలేక మరికొన్ని గ్రామాలకు బస్సులు రావడం లేదు.

**రేషన్ దుకాణాలు లేనివి 149**

జిల్లాలోని రేషన్‌కార్డుదారులకు ఉచితంగా సన్నబియ్యం ఇస్తోంది.. వాటిని తీసుకునేందుకు కొన్ని గ్రామాల ప్రజలు కాలినడకన, మరికొన్ని గ్రామాల ప్రజలు ఎడ్లబళ్లపై లేదా ఆటోలు తీసుకొని సరకులు తెచ్చుకోవాల్సి వస్తోంది.

**విద్యకు దూరంగా.. 812**

ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలంటే బడిఈడు పిల్లలు పది మందికి పైగా ఉండాలి. పాఠశాల లేని గ్రామాల్లో సమీప పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. అయినా కొంతమంది పిల్లలు విద్యకు దూరంగానే ఉన్నారు.

**సంకేతాలు ఉండవు..464**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇంకా కొన్ని గ్రామాల ప్రజలు ఆధునిక సాంకేతికతకు దూరంగా ఉన్నారు. ఉపాధి హామీ, ఇందిరమ్మ బిల్లులు, పింఛన్లు తదితర ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందాలంటే.. సెల్ సిగ్నల్స్ కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి..

**బ్యాంకు సేవలు భారం 1,200**

518 గ్రామాల్లో పోస్టల్ సేవలు అందుబాటులో ఉన్నాయి.. మరో 318 గ్రామాల్లో బ్యాంకులు ఉన్నాయి.. మిగిలిన గ్రామాలు సమీపంలో ఉండే బ్యాంకు లేదా తపాలా కార్యాలయానికి వెళ్లాల్సి వస్తోంది. ఇటీవల సీఎస్‌ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో బ్యాంకులు అందించే సేవలు అందుబాటులోకి వచ్చాయి. **దారి లేనివి 512** ఉమ్మడి జిల్లాలో అనేక గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం లేదు. కొన్ని గ్రామాలకు కాలినడకన వెళ్లాల్సిన పరిస్థితి. మరికొన్ని గ్రామాలకు మట్టి రోడ్లు ఉండటంతో ఆటోలు, మోటారు సైకిళ్లు వెళ్లడానికి వీలుంది.

# ఉన్నవి మరాడిస్తేనే.. కొత్త వాటికి స్థలం



భగత్‌నగర్: విత్తు మొలకెత్తింది మొదలు.. పండిన పంట విక్రయించటం వరకు రైతులకు తలనొప్పిగా మారింది. నానా కష్టాలు పడి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి తూకం వేయగా.. మిల్లులకు తరలింపులో జాప్యం జరుగుతోంది. దీంతో అన్నదాతలకు ఆందోళన తప్పడం లేదు. రోజుల తరబడి కళ్లాల వద్దే కాపు కాయాల్సి వస్తోంది. వానాకాలం, యాసంగి సీజన్ల, కొన్ని మిల్లుల్లో యాక్షన్ ప్యాడీ నిల్వలు అలాగే ఉండటంతో స్థల కొరత సమస్యగా మారింది. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం దించుకోవటానికి మిల్లుల యజమానులు ససేమిరా అంటున్నారు.

**56 మిల్లులకు కేటాయింపులు లేవు**

జిల్లాలో 127 ధాన్యం మిల్లులు ఉండగా.. 97 మిల్లుల్లో యాక్షన్ ప్యాడీ 93,844 మెట్రిక్ టన్నులు ఉన్నాయి. 2024-25 వానాకాలానికి చెందిన 4,352 మె.ట, యాసంగికి చెందిన 80,769 మె.ట సీఎంఆర్ ధాన్యం నిల్వలు పేరుకుపోయాయి. 56 మిల్లులు సీఎంఆర్ బకాయిదారులుగా మిగిలిపోయాయి.

సదరు మిల్లులకు ప్రస్తుత సీజన్‌లో ధాన్యం కేటాయించటం లేదు. మిగతా మిల్లుల్లో స్థలభావంతో 2025-26 వానాకాలం ధాన్యం దించుకొని నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. అక్టోబరులో కురిసిన వర్షాలకు నిల్వ రాశులు తడవటంతో మిల్లింగ్ సమయంలో నూకగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**ప్రభుత్వ నిర్ణయాల్లో ఆలస్యం**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాల్లో ఆలస్యం మిల్లర్లు, రైతులకు ఇబ్బంది కలిగిస్తోంది. యాక్షన్ ప్యాడీపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోకపోవడంతో మిల్లుల్లో ధాన్యం ముక్కిపోతోంది. కేంద్ర ప్రభుత్వం 2024-25 రబీ సీఎంఆర్‌కు అనుమతి ఇచ్చిన బాయిల్డ్, రా రైస్ లక్ష్యంపై స్పష్టత ఇవ్వకపోవటంతో ధాన్యం మర ఆడించే పరిస్థితి లేదు.

**బాయిల్డ్ రైస్ లక్ష్యం.. ప్రకటనతో మిల్లింగ్**

ఉత్తర తెలంగాణలో యాసంగి పంట బాయిల్డ్ తప్ప రా రైస్ తీసే పరిస్థితి లేదు. అక్టోబరులో కురిసిన వర్షాలకు వానాకాలం వడ్లు తడిసిపోయాయి. మిల్లింగ్‌తో నూకలవుతాయి. వీటిని పరిగణనలోకి తీసుకొని యాసంగి, వానాకాలం ధాన్యం బాయిల్డ్‌కు అవకాశం ఇవ్వాలి. అనుమతిస్తే మిల్లింగ్ ప్రారంభిస్తాం. దీంతో కొత్త ధాన్యం తీసుకునే అవకాశం ఉంది.
గిరిధర్, రైస్ మిల్లర్, మానకొండూర్

# సమస్యల తిష్ఠ.. నిధులు వృథా



పెద్దపల్లి : గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ కలవరపెడుతోంది. గతంలో పల్లె ప్రగతిలో నిర్మించిన శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణాలు అలంకారప్రాయంగా మిగిలాయి. దీంతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైంది. ఏళ్ల తరబడి ప్రధాన సమస్యలు పేరుకుపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్యం లోపించడంతో రోగాలతో సతమతమవుతున్నారు.

**ఇదీ పరిస్థితి**

ఉమ్మడి జిల్లాలో 1229 పంచాయతీలున్నాయి. పల్లెల్లో ప్రధానంగా అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. చిరు జల్లులకే చిత్తడవుతున్నాయి. వీధి దీపాలు లేక చీకట్లో మగ్గుతున్నారు.

ఉపాధిహామీలో ఏటా రూ.200 కోట్లతో శాశ్వత రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినప్పటికి ఆచరణ సాధ్యం కావడంలేదు. అక్కడక్కడ నిర్మించిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో సిమెంట్ రోడ్లు పగుళ్ల బారిన పడుతున్నాయి.

మిషన్ భగీరథ నిర్వహణ ప్రజలకు శాపంగా మారింది. నాసిరకంగా పైపులైన్లు నిర్మించడంతో తరుచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. గేట్‌వాల్వ్ చెడిపోవడంతో తాగునీటి కష్టాలు తీరడంలేదు. రోజుల తరబడి సరఫరా నిలిచిపోతుంది. మురుగు కాలువలు లేక దుర్గంధం వెదజల్లుతోంది. జనావాసాల్లో మురుగు కూపాలతో వ్యాధులు ప్రబలుతున్నాయి. వైద్య ఖర్చులకు రూ.వేలు వెచ్చించాల్సి వస్తోంది.

భారీగా వెచ్చించి.. వృథాగా వదిలేసి

వైకుంఠధామాల కష్టాలు తీర్చేందుకు పల్లె ప్రగతిలో భాగంగా ప్రతి గ్రామంలో రూ.12 లక్షలతో నిర్మించిన శ్మశానవాటికలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్నిచోట్ల బోరు నిర్మించి మోటారు బిగించలేదు. మరికొన్నింటిలో మోటార్లు లేకపోవడంతో ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. భారీ వర్షాలకు దెబ్బతిన్న వాటికి మరమ్మతు కరవైంది. ఉమ్మడి జిల్లాలో రూ.147.48 కోట్లతో నిర్మించిన శ్మశానవాటికలు, ఆటలతో ఆహ్లాదం నింపేందుకు రూ.43.01 కోట్ల క్రీడా ప్రాంగణాలు నామరూపాలు కోల్పోతున్నాయి. గుట్టలు, చెరువు శిఖం, ఆటలు ఆడేందుకు అనువుగాని స్థలాల్లో క్రీడా ప్రాంగణాలు నిర్మించడంతో వృథాగా మారాయి.

వీటిపై దృష్టి పెడితేనే..
వీధి దీపాల నిర్వహణ
మురుగు కాలువల శుభ్రత
మౌలిక వసతుల కల్పన
దెబ్బతిన్న శ్మశాన వాటికల నిర్మాణం
క్రీడా ప్రాంగణాల వినియోగం

జిల్లాల వారీగా పంచాయతీలు
జగిత్యాల: 383
కరీంనగర్: 323
పెద్దపల్లి: 263
సిరిసిల్ల: 260

# 100 ఏళ్ల వైభవం

వైరా : వేల ఎకరాలకు సాగునీరు, వందలాది గ్రామాలకు తాగునీరందించే మధ్యతరహా జలాశయాన్ని కేవలం రూ.35లక్షలతో నిర్మించారంటే నమ్ముతారా? కానీ ఇది నిజమే. వందేళ్ల క్రితం నిజాం నవాబుల హయాంలో వైరా జలాశయాన్ని తక్కువ ఖర్చుతో పటిష్ఠంగా నిర్మించారు. తదనంతరం ప్రాజెక్ట్ పరిధిలో ఆధునికీకరణ పనులకు ప్రభుత్వాలు రూ.100కోట్లకు పైగా కేటాయించాయి. 2010లో జపాన్ నిధులతో మొదటి దశ ఆధునికీకరణ పనులకు రూ.60కోట్లు మంజూరయ్యాయి. ఏటా వరద ఉద్ధృతి పెరుగుతుండటంతో రక్షణ నిమిత్తం ఐదో అలుగుతో పాటు కాల్వలకు గైడ్‌వాల్స్ నిర్మించారు. రెండో దశ ఆధునికీకరణ పనులకు ఈఏడాది రూ.42కోట్లు కేటాయించగా మిగిలిన గైడ్‌వాల్ పనులు పూర్తిచేశారు. ఆయకట్టు విస్తీర్ణం 25వేల ఎకరాలకు పెరిగినా సాగునీటిని సమృద్ధిగా అందిస్తున్నారు. జలాశయం గుట్టల వద్ద మిషన్ భగీరథకు చెందిన భారీ ఇన్‌టేక్‌వెల్ నిర్మించారు. దీనిద్వారా పదకొండు మండలాల్లోని 470 గ్రామాలకు నిత్యం 10కోట్ల లీటర్ల తాగునీటిని సరఫరా చేస్తున్నారు. దాదాపు 2వేల మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తోంది. ఇక్కడి రొయ్యలు దేశవిదేశాలకు ఎగుమతి అవుతుంటాయి. పర్యాటక ప్రాంతంగానూ శోభిల్లుతోంది. ఇంతటి విశిష్టమైన ప్రాజెక్టుకు 2006లో భారీ వర్షాలతో నీటిప్రవాహం 26.50 అడుగులకు (పూర్తిస్థాయి సామర్థ్యం 18.30 అడుగులు మాత్రమే) చేరింది.

ఒక్కరోజే 95వేల క్యూసెక్కుల ప్రవాహం ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో ఉన్నా తట్టుకుని నిలిచింది. ప్రతికూల పరిస్థితుల్లో సాగర్ జలాలు అందించవచ్చు.

గోదావరి జలాలు వైరా జలాశయానికి చేరేలా రూ.100కోట్లతో నిర్మించిన లింక్‌కెనాల్ సఫలమైంది. ఈ ఏడాది అధిక వర్షాలతో జలాశయం నిండి రోజుల తరబడి అలుగు పోయటంతో సుమారు 12 టీఎంసీలు సముద్రం పాలయ్యాయి.

వైరా జలాశయం విస్తీర్ణం 4,800 ఎకరాలు. దీనికి 1.7కిలోమీటర్ల



పొడవు గల ఆనకట్ట ఉంది. కుడికాల్వ 24 కిలోమీటర్లు., ఎడమకాల్వ 16 కిలోమీటర్లు ఉండగా ఆయకట్టును అప్పట్లో 17,390 ఎకరాలుగా స్థిరీకరించారు.

1924లో నిర్మాణం మొదలు

నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ వైరా జలాశయం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి ఇంజినీర్ నవాబ్ జంగ్ బహదూర్ పర్యవేక్షణలో 1924లో పనులు మొదలుపెట్టగా 1930 నాటికి పూర్తయ్యాయి. అదే ఏడాది ఆయకట్టుకు సాగునీరందించారు.

భారీ వరదలొచ్చినా జలాశయం చెక్కు చెదరలేదు.

ఆనకట్ట సుమారు 88 అడుగుల ఎత్తు ఉంటుంది. నీటి సామర్థ్యం 18.30 అడుగులు. పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 2.52 టీఎంసీలు.

ఇల్లెందు, కారేపల్లి, కామేపల్లి, కొణిజర్ల, ఏన్కూరు, తల్లాడ మండలాల అటవీప్రాంతాల్లో ఎక్కడ వర్షం కురిసినా వైరా జలాశయంలోకి పారేలా అప్పట్లోనే డిజైన్ రూపొందించటం విశేషం.

వైరానది పొడవు సుమారు 40 కిలోమీటర్లు.

జలాశయం పూర్తిగా నిండినప్పుడు అలుగుల నుంచి పారే నీరే వైరా నదిగా అవతరించింది.

# ఇక పక్కాగా.. చెత్త లెక్క!

కాగజ్‌నగర్ : స్వచ్ఛ సర్వేక్షణ్ దిశగా జిల్లాలోని పురపాలికలు అడుగులు వేస్తున్నాయి. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు పాటించేలా అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది. ఇళ్లనుంచి సేకరించే చెత్తతోపాటు దుకాణాల ద్వారా ఉత్పత్తి అవుతున్న వ్యర్థాలకు పక్కాగా లెక్క ఉండేలా చర్యలు చేపట్టనున్నారు. చెత్త పరిమాణం ఆధారంగా వ్యాపార కేంద్రాలను విభాగాలుగా వర్గీకరించనున్నారు. ప్రాంతాన్నిబట్టి చెత్త ఉత్పత్తిని లెక్కించి దుకాణాలకు రుసుము విధించి అదనపు ఆదాయం రాబట్టే విధానానికి శ్రీకారం చుట్టనున్నారు.

**జియో ట్యాగింగ్‌తో అమలు**

గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఆసిఫాబాద్ పట్టణం గతేడాది మున్సిపాలిటీగా ఏర్పాటైంది. ఇక్కడ 20 వార్డులు ఉండగా దాదాపు 23వేల వరకు జనాభా ఉంది. కాగజ్‌నగర్ పురపాలికలో 30 వార్డులు ఉండగా.. 1538 గృహాలు, 1188 వ్యాపార సముదాయాలు ఉన్నాయి. సుమారు 70 వేల వరకు జనాభా ఉంది. దీంతోపాటు 1188 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఈ రెండు పురపాలికల్లోని వ్యాపార ప్రాంతాల్లో చెత్త సేకరణకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. చెత్త సేకరణపై పురపాలిక సిబ్బంది దుకాణాల వద్దకు వెళ్లి యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతోపాటు రహదారికి ఆనుకుని ఉన్న ప్రతి దుకాణాన్ని



జియోట్యాగింగ్ చేయనున్నారు. క్యూఆర్ కోడ్‌తో కూడిన నెంబరును కేటాయించి స్థానికత ఆధారంగా మ్యాపింగ్ చేయాల్సి ఉంది. ప్రైవేటు సంస్థలు, దుకాణాలు, ఆసుపత్రులు, సూపర్ మార్కెట్లు, ఆలయాలు, చర్చీలు, మసీదులు, హోటళ్లు, రెస్టారెంట్లు, మాంసం విక్రయ దుకాణాలను జియోట్యాగింగ్ చేయనున్నారు. ఏయే దుకాణానికి ఎంత చెత్త వస్తోందో లెక్కలు తీయనున్నారు.

**స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 7,534 స్కోర్**

దేశంలోని పట్టణాల మధ్య స్వచ్ఛతలో పోటీతత్వాన్ని పెంచేందుకు కేంద్రం ఏటా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. నగరాలు, పట్టణాల్లో జనాభా ఆధారంగా వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తోంది. కాగజ్‌నగర్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం.. 57,583 మంది జనాభా ఉన్నారు. 50 వేల నుంచి 3 లక్షలలోపు జనాభా కేటగిరీలో పోటీ పడింది. ఈ ఏడాది మొత్తం 12,500 మార్కులకు పోటీ నిర్వహించగా.. బల్దియాకు 7,534 స్కోరు లభించింది. ఇంటింటా చెత్త సేకరణలో 43 శాతం, చెత్త విభజనలో 6 శాతం, చెత్త ప్రాసెసింగ్‌లో 98 శాతం, నివాస గృహాల కాలనీల్లో శుభ్రత 88 శాతం, మార్కెట్ల శుభ్రతలో 80 శాతం అమలు చేస్తున్నట్లు నివేదికలో వెల్లడించారు.

పురపాలికల్లో రోజూ వెలువడే చెత్త (మెట్రిక్ టన్నుల్లో)
కాగజ్‌నగర్ : 23
ఆసిఫాబాద్ : 11

# పల్లె ఓటు.. ఎంతో దూరం

దండేపల్లి మండలం మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని ఉట్ల గ్రామంలో 50 మందికి పైగా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఓటు హక్కు వినియోగించుకోవాలంటే దాదాపు ఆరు కిలోమీటర్ల దూరమున్న మామిడిపల్లికి రావాలి

వెంకటాపూర్ పంచాయతీ పరిధిలో అరేడిపల్లి గ్రామంలో 100కు పైచిలుకు ఓటర్లు ఉన్నారు. ఈ పల్లె నుంచి పంచాయతీ కార్యాలయానికి రావాలంటే 10 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. గత అసెంబ్లీ ఎన్నికలో దూరాన్ని దృష్టిలో పెట్టుకొని అక్కడే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. పంచాయతీ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలను ఒకే దగ్గర ఏర్పాటు చేస్తుండగా పది కిలోమీటర్ల దూరమున్న పంచాయతీకి రావాలి.

న్యూస్‌టుడే, కాసిపేట : పంచాయతీల్లో స్థానిక పోరు రసవత్తరంగా మారుతోంది. మరోవైపు ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రావాలంటే కొన్ని చోట్ల భయపడుతున్నారు. దూరాభారమే వారికి శాపంగా మారింది. పంచాయతీ కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉండటమే ఇందుకు కారణం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే పల్లె పోరులో ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంటుంది. కానీ కొన్ని చోట్ల పల్లె ఓటర్లు పంచాయతీ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకోవాలంటే పదుల కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోంది.

వేమనపల్లి : వేమనపల్లి మండలం చామనపల్లి గ్రామ పంచాయతీలోని బద్దెంపల్లి, బొమ్మెన గిరిజన గ్రామస్థులకు ఏ ఎన్నికలు వచ్చినా 4 కి.మీ దూరంలోని చామనపల్లి గ్రామానికి కాలినడకన వెళ్లి ఓటు హక్కును వినియోగించుకుంటారు. వర్షాకాలంలో ఎన్నికలు వస్తే మాత్రం చుట్టూ 50 కి.మీ తిరుగుతూ చామనపల్లికి వెళ్లి ఓటు హక్కును



వినియోగించుకుంటారు. చామనపల్లి గ్రామ పంచాయతీలో మొత్తం 864 ఓట్లు ఉన్నాయి. ఇందులో బద్దంపల్లిలో 243 మంది ఓటర్లు, బొమ్మెన గ్రామంలో 200 మంది వరకు ఓటర్లు ఉన్నారు. బద్దంపల్లి గ్రామానికి చెందిన ఓటర్లు కాలినడకన నడుస్తూ చామనపల్లి పెద్దవాగును దాటుతూ పోలింగ్ కేంద్రానికి వెళ్లాలి. బొమ్మెన గ్రామానికి చెందిన గిరిజన ఓటర్లు కాలినడకన అటవీమార్గంలో నడుస్తూ చామనపల్లికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలి.

**30 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..**

హాజీపూర్ మండలం చిన్నగోపాల్‌పూర్ పంచాయతీ పరిధిలోని కొత్తగఢ్‌పూర్ పల్లె పంచాయతీ కార్యాలయానికి 30 కిలోమీటర్ల దూరముంటుంది. ఈ గ్రామం కాసిపేట మండలంలోని మాద్దిమాడ పంచాయతీ అటవీ ప్రాంతానికి ఆనుకొని ఉంటుంది. ఇక్కడ 60 మంది ఓటర్లు ఉండగా వీరు ఓటు వేయాలంటే చిన్నగోపాల్‌పూర్ పంచాయతీకి వెళ్లాలి. అటవీ దారి మీదుగా వస్తే 10 కిలోమీటర్ల మేర నడుచుకుంటూ వెళ్లాలి. వాహనాల్లో వెళితే 30 కిలోమీటర్లు ప్రయాణం చేయాలి.

చురకలు



# ఆరంభంలోనే హడావుడి!

హైదరాబాద్: విద్యార్థులను తీసుకెళ్తుండగా స్టీరింగ్ రాడ్డు విరిగింది. ఈ ఘటనతో డ్రైవర్ నిర్ఘాంతపోయాడు. బస్సు నిలిచి ఎవరికీ గాయాలు కాకపోవటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇలాంటివి తరచూ చోటు చేసుకుంటున్నాయి.

రవాణా శాఖ అధికారులు పాఠశాలల ప్రారంభానికి ముందు బస్సులను తనిఖీలు చేసి ఆ తర్వాత పట్టించుకోవడంలేదు. నామమాత్రంగా అక్కడక్కడా కేసులు పెట్టి వదిలేస్తున్నారు. ఆయా వాహనాలు యథేచ్ఛగా రహదారులపై చక్కర్లు కొడుతున్నాయి. ఫలితంగా విద్యార్థుల ప్రాణాల



భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

**పరిశీలించాల్సినవి 33..**

బస్సు కండీషన్‌లో ఉందా? లేదా? అని తేల్చేవి సామర్థ్య ధ్రువీకరణ పరీక్షలు. డ్రైవర్ అర్హత నుంచి వాహన ఫిట్‌నెస్ వరకు 33 అంశాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారు. విద్యాసంస్థల యాజమాన్యాలు అధికారుల్ని ఎలాగోలా ఒప్పించి అనుమతులు సాధిస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి.

# విలువైన స్థలాలు.. వినియోగిస్తే కాసులు

హైదరాబాద్: నగరంలో అత్యంత కీలకమైన ప్రాంతాల్లో విలువైన ఖాళీ స్థలాలు ఉన్నా.. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) వాటి గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పటికే కొందరు స్థానిక చోటామోటా నేతల కళ్లు ఆయా స్థలాలపై పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అసలే హెచ్ఎండీఏ పరిధి నుంచి 27 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు బల్దియా పరిధిలో చేరడంతో.. ఆ మేరకు భవిష్యత్తులో ఆదాయం తగ్గనుంది. ఈ తరుణంలో ఇలాంటి విలువైన భూములను ఆదాయ వనరుగా మార్చుకునే అవకాశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా ప్రాంతాల్లో హెచ్ఎండీఏకు స్థలాలున్నాయి. ఐమాక్స్, నెక్లెస్ రోడ్డు, అంబేద్కర్ మ్యూజియం, ట్యాంక్‌బండ్ సందర్శనకు నిత్యం వందల్లో పర్యాటకులు వస్తుండగా.. వారాంతాలు, సెలవుదినాల్లో వారి సంఖ్య మరింత పెరుగుతుంది. ఈ పరిసరాల్లో ఉన్న స్థలాలను గేమింగ్‌జోన్లు, రెస్టారెంట్లు తదితర వ్యాపార, వాణిజ్య కార్యకలాపాలకు కేటాయించినా..



లీజుకిచ్చినా హెచ్ఎండీఏకు రూ.కోట్లలో ఆదాయం సమకూరుతుంది.

**ప్రైవేటు వాహనాలతో డంపింగ్ యార్డుగా..**

నెక్లెస్ రోడ్డులోని పీపుల్స్ ప్లాజా ఎదుట స్థలం కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. ఇందులో కొంతభాగాన్ని గేమింగ్ కార్యకలాపాలకు లీజుకు ఇవ్వగా అద్దె వస్తోంది. మిగతా స్థలంలో స్థానికులు వాహనాలను రోజులపాటు నిలుపుతుండటంతో.. పరిసరాలన్నీ డంపింగ్‌యార్డును తలపిస్తున్నాయి. రాత్రుళ్లు మందుబాబులకు, గంజాయి తాగేవారికి అడ్డాగా మారుతోంది. దీన్ని ఆదాయవనరుగా మార్చుకోవడం ద్వారా అసాంఘిక శక్తులను అడ్డుకునే వీలుంది.

# పొదుపును 'ఆర్పీ'సింది..!

నల్గొండ : నల్గొండ పురపాలిక సంఘం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మహిళా సంఘాలకు అండగా ఉండాల్సిన రిసోర్స్ పర్సన్(ఆర్పీ).. వారి పొదుపు డబ్బులు రూ.1.50 కోట్లు కాజేయడం కలకలం సృష్టించింది. 12 సంఘాల్లోనే రూ.కోటిన్నర ఆర్థిక మోసం జరిగిందంటే ఇలాంటి సంఘాలు ఇంకా రెండు వేలకు పైగా ఉన్నాయి.

**అసలేం జరిగిందంటే!**

జిల్లా కేంద్రంలోని మూడో వార్డులో 12 మహిళా సంఘాలు ఉండగా.. ఆర్పీగా లింగంపల్లి వాహిని పనిచేస్తున్నారు. ప్రభుత్వం ఆమెకు నెలకు రూ.6వేల గౌరవ వేతనం చెల్లిస్తోంది. ఒక్కో సంఘంలో గరిష్ఠంగా 10 మంది వరకు ఉన్నారు. ఏడాది క్రితం ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున రుణం ఇవ్వగా.. అందరూ సక్రమంగా కిస్తీలు కట్టారు. ఈ ఆర్థిక సంవత్సరానికి వారికి రూ.కోటిన్నర రుణాలు వచ్చాయి. దీంతో ఆర్పీకి దుర్బుద్ధి పుట్టింది. సభ్యులందరి ఆధార్, బ్యాంకు ఖాతా నెంబర్, ఇతరత్రా ఆధారాల నకలు పత్రాలపై సంతకాలు తీసుకుని, ఫోర్జరీ చేసి భారీ మోసానికి తెరతీసింది. జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంకులో రూ.కోటిన్నరను తన వ్యక్తిగత ఖాతాకు బదిలీ చేసుకుంది. వ్యక్తిగత ఖాతా నుంచి రూ.100 డిపాజిట్ చేయాలన్నా, తీయాలన్నా సవాలక్ష సందేహాలతో ఉక్కిరిబిక్కిరి చేసే బ్యాంకు అధికారులు ఇంత తేలిగ్గా.. రూ.కోటిన్నరను ఎలా అలా ఆమె ఖాతాలోకి జమ చేశారనేది ప్రశ్నార్థకంగా మారింది.

**వెలుగులోకి ఇలా..**

9 నెలలుగా 12 సంఘాలకు చెందిన రూ.కోటిన్నరకు కిస్తీలను ఆర్పీ వాహిని తన ఖాతా నుంచే చెల్లిస్తుంది. మూడు నెలల నుంచి చెల్లించడం మానివేసింది. దీంతో బ్యాంకు అధికారులు సంబంధిత గ్రూపు సభ్యుల ఇంటికి నోటీసులు పంపించడంతో వాహిని మోసం బయటపడింది. దీంతో సంఘాల సభ్యులు ఆందోళనకు దిగి పుర కమిషనర్‌కి, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ విషయమై మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసన్‌తో మాట్లాడగా.. ఆర్పీ వాహినిపై ఆర్థిక మోసం కింద క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. ఆమె నుంచి నగదు రికవరీ చేసేందుకు సమయం ఇచ్చామని.. సమగ్ర విచారణ జరుగుతుందని పేర్కొన్నారు.

# నాటిన చేతులే 'నరికేస్తున్నాయ్'



జగిత్యాల : తగ్గిన దిగుబడులు, పెరిగిన చీడపీడలు, పడిపోయిన ధరలు.. ఇవన్నీ ఉమ్మడి జిల్లాలో మామిడి తోటల విస్తీర్ణం తగ్గడానికి కారణమవుతున్నాయి. ఎర్ర నేలల్లో పొటాష్ సమతూకం, వేసవిలో గాలిలో తేమ శాతం తక్కువుండే పొడి వాతావరణం, సాగునీటి లభ్యత తదితర కారణాలతో ఇక్కడి మామిడి కాయలకు దేశవ్యాప్తంగా గిరాకీ ఉండేది. ఏడేళ్లుగా అన్ని ప్రాంతాల్లోనూ నీటి నిల్వ, సాగునీటి వసతితో వరి సాగు పెరగడంతో గాలిలో తేమ శాతం వేసవిలోనూ అధికంగా ఉంటోంది. ఫలితంగా తామర పురుగులు, బూడిద తెగులు తదితర చీడపీడలు తీవ్రంగా ఆశించడంతో కాయల నాణ్యత, దిగుబడి, ధర తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గతంతో ఒకసారి కూడా మందు పిచికారీ చేయనివారు ప్రస్తుతం ఆరేడు సార్లు మందులు కొట్టాల్సి వస్తోంది.

చిత్రంలోని రైతు జగిత్యాల రూరల్ మండలం అంతర్గాంకు చెందిన కస్తూరి లక్ష్మణ్. సాగు గిట్టుబాటు కాకపోవడంతో 16 ఎకరాల్లోని మామిడి చెట్లను తొలగించి ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. లక్ష్మణ్ మాదిరిగానే ఉమ్మడి జిల్లాలోని చాలా మంది రైతులు పెద్దఎత్తున మామిడి తోటలు తొలగించి ఇతర పంటలకు మళ్లుతుండటం ఫలరాజం దీనస్థితిని కళ్లకు కడుతోంది.

**తేమ శాతం పెరిగి..**

మామిడి చెట్ల వేర్ల వద్ద నీటి లభ్యత లేకుంటే ఒక సంవత్సరం వచ్చిన చిగుర్లకు మరుసటి ఏడాది పూత వస్తుంది.

సగటు భూగర్భ జలమట్టం పెరిగి మామిడి వేర్లకు నీరందడంతో పూతకు బదులుగా ఏటా చిగుర్లే ఎక్కువగా వచ్చి పూత, కాత గణనీయంగా తగ్గుతోంది.

పూత నుంచి కాత వరకు గాలివానలు, వడగళ్లు మామిడికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. గతంలో అమలు చేసిన వాతావరణ ఆధారిత బీమాను నిలిపివేయడం, పంట నష్ట పరిహారాన్ని ఇవ్వకపోవడంతో రైతులకు ఆర్థిక ఆసరా కొరవడింది.

ఎఫ్‌పీవో(రైతు ఉత్పత్తిదారుల సంస్థ)లు, స్వశక్తి సంఘాలు, అపెడ, ఉద్యానశాఖల ద్వారా మామిడిని కొనుగోలు చేసి మాల్స్‌కు, రసాల కంపెనీలకు పంపించాలి.

జిల్లాలో కాయల ప్యాకింగ్ యూనిట్లు ఏర్పాటు చేసి ఇతర దేశవిదేశాలకు ఎగుమతి చేస్తే ధరలో స్థిరత్వం ఉంటుంది.

**వేలం విధానమే మేలు**

ఏటా సీజన్ ఆరంభంలో అధిక ధర పలుకుతుండగా అనంతరం ఢిల్లీ మార్కెట్ మాయాజాలం, వ్యాపారుల గుత్తాధిపత్యంతో అమాంతం తగ్గిస్తున్నారు. దీంతో కాయలను తెంపే కూలీ కూడా రైతు చేతికందడం లేదు. ఈ-నామ్ ద్వారా దేశవ్యాప్త వ్యాపారులు చల్‌గల్ తదితర మార్కెట్ల నుంచి మామిడిని కొనేలా చర్యలు తీసుకుంటే మేలు జరుగుతుంది. ట్రేడింగ్ విధానంలో వ్యాపారి చెప్పిన ధరకే రైతులు అమ్మాల్సి ఉంటుంది. నాగ్‌పూర్ మాదిరిగా కాయలకు బహిరంగ వేలం నిర్వహిస్తే ధరలు పెరుగుతాయి. జగిత్యాలలో కొందరు వ్యాపారులు మాత్రమే అనుసరిస్తున్న ఈ విధానాన్ని అన్ని చోట్లా అమలు చేయాలి.

ఉమ్మడి జిల్లాలో మామిడి తోటల విస్తీర్ణం (ఎకరాల్లో)

నాలుగేళ్ల కిందట: 74,565

పూర్తిగా తొలగించిన విస్తీర్ణం: 6,211

ఇటీవల కొత్తగా నాటినవి: 803

ప్రస్తుతం తోటలు: 69,157

పునరుద్ధరణ కోసం కొమ్మలు నరికినవి: 7,946

సాధారణ దిగుబడి: 1.87 లక్షల మె.ట.

నాలుగేళ్లుగా సగటు దిగుబడి: 77 వేల మె.ట

# శునకాలకు సంరక్షణ కేంద్రం



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో కుక్కల బెడద ఎక్కువైంది. ఏ వీధిలో చూసినా గుంపులుగా కనిపిస్తుండటం, రాకపోకలు సాగించే వారిని వెంబడిస్తుండటంతో పిల్లలు, పెద్దలు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో వీటి సంరక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల నగర వీధుల్లో పలు చోట్ల పలువురి వెంటపడి దాడి చేయగా తీవ్ర గాయాలపాలై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ఘటనలున్నాయి. వీటిని పట్టుకోవాలని, నియంత్రణ చర్యలు చేపట్టాలని నగరవ్యాప్తంగా ఫిర్యాదులు వస్తుండగా క్షేత్రస్థాయిలో న్యాయపరమైన ఇబ్బందులు తప్పడం లేదు. నగరవ్యాప్తంగా సుమారు ఎనిమిది వేల కుక్కలు ఉన్నట్లు సమాచారం. గతేడాది నుంచి వీటిని పట్టుకోవడం మానేశారు.

**ఏబీసీ నిబంధనలతో..**ఎనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటుకు రామగుండం బైపాస్ రోడ్డులో మూడేళ్ల కిందట ఒక ఎకరం రెండు గుంటల స్థలం కేటాయించారు. ఎనిమల్ బర్త్ కంట్రోల్(ఏబీసీ) ప్రోగ్రాం కుక్కల నిబంధనలు-2001 ప్రకారం జంతు సంరక్షణ బోర్డు ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్మాణ పనులు ప్రారంభించారు. రూ.43 లక్షలతో భవనం, ఆపరేషన్ థియేటర్, 60 గదులతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు. ఇప్పటి వరకు ముకరంపురలోని పశు వైద్యశాల వెనకాల ఉన్న కేంద్రంపై స్థానికులు అభ్యంతరం తెలిపారు. వీధుల్లోంచి పట్టుకొచ్చిన కుక్కలను నాలుగైదు రోజులు అక్కడే ఉంచడంతో రాత్రివేళ అరుస్తున్నాయని, శస్త్రచికిత్సల తర్వాత వీటికి సరైన సౌకర్యాలు లేవనే కారణాలతో ఆపేశారు.

**నెల రోజుల్లో నియంత్రణ ప్రారంభం**

ఈ ఏడాది జూన్‌లో 2 వేల కుక్కలను పట్టుకోవడానికి టెండర్లు నిర్వహించారు. వీటికి సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్స చేయించడం, ఆ సమయంలో జాగ్రత్తలు తీసుకోవడం, మందులు, విశ్రాంతి ఇచ్చి తిరిగి అదే ప్రాంతంలో వదిలిపెట్టడానికి ఒక్కో శునకానికి రూ.1,650 సదరు ఏజెన్సీకి చెల్లించనున్నారు.

కుక్కలను పట్టుకొని శస్త్ర చికిత్సలు చేసే సమయంలో జంతు సంరక్షణ బోర్డుకు ఫిర్యాదు వెళ్లింది. దీనిపై న్యాయపరంగా సమస్యలు రావడంతో ఆ ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కాగా కోర్టు ఆదేశాల మేరకు ఏబీసీ కేంద్రం నిర్మిస్తున్నారు. నెల రోజుల్లో పనులన్నీ పూర్తి చేసి యథావిధిగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కార్యాలయ సంబంధిత అధికారి తెలిపారు.

# ఓఆర్ఆర్ వరకు స్కాడా విస్తరణ

హైదరాబాద్: ఓఆర్ఆర్ వరకు గ్రేటర్‌లో విలీనం కావడంతో విద్యుత్తు పంపిణీ సంస్థ.. స్కాడా (సూపర్‌వైజరీ కంట్రోల్ అండ్ డేటా అక్విజిషన్) పరిధిని విస్తరిస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలోని 33/11కేవీ ఉపకేంద్రాలు 222 మాత్రమే ప్రస్తుతం స్కాడా పరిధిలో ఉన్నాయి. వచ్చే మార్చి నాటికి ఓఆర్ఆర్ లోపల ఉన్న మిగిలిన 146 ఉపకేంద్రాలను స్కాడా పరిధిలోకి తీసుకురాబోతోంది. దీంతో ఎర్రగడ్డలోని స్కాడా కార్యాలయం నుంచే వీటి పర్యవేక్షణ, నియంత్రణ, డేటా సేకరణ ద్వారా అంతరాయాల నివారణను పకడ్బందీగా నిర్వహించవచ్చని అధికారులు చెబుతున్నారు. స్కాడా కార్యాలయంలో ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థలు ఏర్పాటు చేశారు. ఎక్కడో ఉన్న ఉపకేంద్రంలో విద్యు త్తు అంతరాయం ఏర్పడితే ఇక్కడి కంప్యూటర్‌లో తెలుస్తుంది. క్షేత్రస్థాయి సిబ్బంది ఇష్టారీతిన ఎల్‌సీ (లైన్‌క్లియర్) వంటివి తీసుకోకుండా.. గంటలపాటు సరఫరా నిల్చిపోతే ఉన్నతాధికారులకు తమ మొబైల్‌లోనే తెలుసుకునే అవకాశం ఉండటంతో నిర్వహణ లోపాలు చాలావరకు తగ్గిపోయాయని అధికారులు చెప్పారు.

రియల్ టైమ్ డేటా మానిటరింగ్, వోల్టేజ్, లోడ్, ఫ్రీక్వెన్సీ వంటి పరిమితులను ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు.

సబ్‌స్టేషన్‌లోని బ్రేకర్లను మూయడం, తెరవడం లాంటివి కార్యాలయం నుంచే ఒక మీటతో ఆపరేట్ చేయవచ్చు. ఫీడర్ నియంత్రణ, ఫాల్ట్‌లను



త్వరగా గుర్తించడం, లైన్ ట్రిప్‌లు, ఓవర్‌లోడ్, పరికరాల్లో లోపాలు గుర్తించడం, ఆటోమేషన్‌కు స్కాడా ఉపయుక్తంగా ఉంటుంది.


డేటా సేకరణతో విద్యుత్తు నష్టాలు, ఎన్నిసార్లు అంతరాయాలు ఏర్పడ్డాయనే సమాచారంతో ముందు సమస్యలు తగ్గేలా నిర్వహణ ప్రణాళికల రూపకల్పనకు ఉపయోగపడుతుంది.

# వచ్చివాలింది.. వైజాగ్‌కాలనీ

దేవరకొండ : వారంతా నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి విశాఖపట్నం నుంచి పొట్టచేతపట్టుకొని వలసొచ్చిన కూలీ కుటుంబాల వారసులు. మొదట్లో డ్యాం పరిసరాల్లో నివసించగా.. ఆ ప్రాంతం ముంపునకు గురికావడంతో కొన్ని కుటుంబాలు ఉమ్మడి చందంపేట మండలంలో, మరికొన్ని నాగార్జునసాగర్ పరిసర ప్రాంతాల్లో స్థిరపడ్డాయి. కానీ నివాసాలు లేకపోవడంతో పగలంతా చేపలవేటకు వెళ్లి రాత్రివేళ పుట్టి(నాటు పడవ)ని తిరగేసి వాటి కింద జీవనం సాగించేవారు. అప్పటి నల్గొండ జిల్లా కలెక్టర్ నీలం సాహ్ని ఈ ప్రాంతాన్ని సందర్శించి వారి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. వారి సొంత ప్రాంతం చిరకాలం గుర్తుండేలా దీనికి 'వైజాగ్‌కాలనీ' అని పేరు పెట్టుకున్నారు.

**ఇతర రాష్ట్రాలకు సరఫరా..**

మంచినీటి చేపలకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. బొచ్చ, రవ్వ, ముళ్లజెల్ల, పాంప్లెంట్ వంటి చేపలను నెలకు మూడు ప్రైవేటు వాహనాల ద్వారా ఇతర రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. వీటి ద్వారా ట్రిప్పునకు రూ.15-20 వేల లాభం వస్తున్నట్లు మత్స్యకారులు చెబుతున్నారు. సాగర్‌కు వచ్చే పర్యాటకులు ఇక్కడి




చేపలను రుచి చూడకుండా వెళ్లరు. మహిళలు చేపల వంటకాలను తయారు చేసి ఉపాధి పొందుతున్నారు.

**చేపల వేటే జీవనధారం..**

నాటు పడవల్లో ప్రాజెక్ట్ చివరి నుంచి నిత్యం 50 కి.మీ. వరకు వెళ్లి వలలు వేసి చేపలను పట్టుకొని వస్తుంటారు. ఈ క్రమంలో ఎదురయ్యే ఆటంకాలను అధిగమిస్తూ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వేటను కొనసాగిస్తారు. సాగర్ వెనక జలాల్లో పూర్తిస్థాయిలో నీరు చేరితే వేట సాగదు. ఆ సమయంలో ఆయా కుటుంబాల్లోని యువకులు బెంగళూరు, చెన్నై, కోల్‌కతా, వంటి ప్రాంతాలకు గృహ నిర్మాణ కూలీలుగా వెళ్తున్నారు.

**నిత్యం జీవన పోరాటం**

-బావోజీ, వైజాగ్ కాలనీ, మాజీ సర్పంచి

మూడు దశాబ్దాల క్రితం బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చాం. వైజాగ్ కాలనీలో నిత్యం తెల్లవారుజాము నుంచి రాత్రి పడుకునే దాకా చేపల వేటకెళ్లి జీవనం సాగిస్తున్నాం.

# ఆశల 'బుగ్గవాగు'కు ఊపిరి

రఘునాథపాలెం : వ్యవసాయ ఆధారిత మండలాలైన కామేపల్లి, రఘునాథపాలెం మండలాల్లో చెరువులకు నీటిని చేర్చేందుకు ప్రతిపాదించిన బుగ్గవాగు ప్రాజెక్టు తిరిగి ఊపిరి పోసుకుంది. ఎలాంటి సాగునీటి ప్రాజెక్టులు లేకపోవటంతో వర్షం, చెరువులు, బావులు, బోర్లపై ఆధారపడి పంటలు సాగు చేసే ఈ మండలాల్లో ఏటా వేసవిలో నీటి ఎద్దడి సర్వసాధారణం. తాగు, సాగునీటి సమస్య పరిష్కారంలో బుగ్గవాగు నీటిని నింపాలని ప్రతిపాదన ఉంది. ప్రస్తుతం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అధికారులు తిరిగి అంచనాలు వేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు.

**రూ. 110 కోట్లతో అంచనాలు..:** బుగ్గవాగు ప్రాజెక్టుకి గతంలో కాల్వ నిర్మించాలని ప్రతిపాదించారు. దీనికి భూసేకరణ చేయాల్సి ఉంటుంది. ఇది రిస్కుతో కూడుకున్న పని. కానీ ప్రస్తుత రీఎస్టిమేషన్‌లో భూమి లోపల నుంచి పైపులైన్ వేయాలని ప్రతిపాదించారు. దీంతో ఎలాంటి ఇబ్బంది ఉండదు. పైపులైను నిర్మాణానికి రూ.110 కోట్లతో తిరిగి అంచనాలు రూపొందించారు. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే వచ్చే ఏడాది వర్షాలు ప్రారంభమయ్యే నాటికి పనులు పూర్తి చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించినట్లు తెలుస్తోంది.

**ఆయకట్టుకు సాగునీరు..:** కారేపల్లి మండలం పింజరమడుగు గ్రామం వద్ద బుగ్గవాగుపై చెక్‌డ్యాం నిర్మించి కాలువల ద్వారా వర్షపు నీటిని కామేపల్లి, రఘునాథపాలెం మండలాల చెరువులకు తరలించాలనేది ప్రాజెక్టు లక్ష్యం. 2010లో ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టు చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.6.14 కోట్లు, భూసేకరణ, కాలువ నిర్మాణం కోసం రూ.37.18 కోట్లు కేటాయించారు. ఇందుకు మొత్తం 21.7కిమీ దూరం కాలువ నిర్మించాల్సి ఉంది. దీని ద్వారా కామేపల్లిలోని 21, రఘునాథపాలెం మండలంలోని 10 మొత్తం 31 చెరువులకు భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి గ్రావటీ ఆధారంగా నీరు చేరుతుంది. దీంతో సుమారు 5.5వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు



అందుతోంది.

**యుద్ధ ప్రాతిపదికన..**

రఘునాథపాలెం మండల సాగునీటి కష్టాలు తీర్చేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని మంత్రి తుమ్మల ఆదేశాలతో ఈ ఏడాది యుద్ధ ప్రాతిపదికన నిర్మించారు. వి.వెంకటాయపాలెం వద్ద సాగర్ ప్రధాన కాల్వపై నిర్మించిన దీని ద్వారా విద్యుత్తు ఉపయోగించి నీరు చెరువులకు ఎత్తిపోస్తున్నారు. దీంతో భారీగా విద్యుత్తు ఖర్చు వస్తోంది. కానీ బుగ్గవాగు ప్రాజెక్టుతో ఎటువంటి ఖర్చు ఉండదు. బుగ్గవాగు ప్రాజెక్టుతో రఘునాథపాలెం మండలంలోని బూడిదంపాడు, మంచుకొండ, చిమ్మపూడి, శివాయిగూడెం, కోయచలక, కోటపాడు, పాపటపల్లి, ఖమ్మం గ్రామీణ మండలం దారేడు గ్రామాల పరిధిలోని గొలుసు చెరువులకు నీరు అందుతోంది. దీంతో సుమారు 1,500 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. ఎప్పుడు భారీ వర్షం కురిసినా వాగుకు వరద వస్తే ఈ కాలువ ద్వారా ఈ చెరువులకు నీరు చేరుతుంది.

# భవితకు భరోసా

ముస్తాబాద్ : ఎవరో ఒకరు తోడుంటే కానీ అడుగు కూడా వేయలేరు. సొంత అవసరాలు కూడా తీర్చుకోలేరు. ఇలా ప్రత్యేకావసరాలు కలిగిన శారీరక, మానసిక, వైకల్యం ఉన్న దివ్యాంగ చిన్నారులకు భరోసా కల్పించడం కోసం.. విద్యా, వైద్య సేవలు అందించేందుకు భవిత కేంద్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వైకల్యంతో పుట్టిన చిన్నారుల భవితవ్యం తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తూ వారిలో ఆత్మవిశ్వాసం నింపుతున్నాయి.

**మండలానికో కేంద్రం..**

ప్రభుత్వం ప్రతి మండల కేంద్రంలో ఒక భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. జిల్లాలో 13 భవిత కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో కలిపి 988 మంది ప్రత్యేకావసరాల పిల్లలు ఉన్నారు.

ఒక్కో కేంద్రంలో ఇద్దరు టీచర్లు, ఒక ఫిజియోథెరపిస్ట్, ఒక ఆయా ఉండాలి. కానీ.. జిల్లాలోని 13 కేంద్రాల్లో 10 కేంద్రాల్లో ఉపాధ్యాయులు (ఐఆర్‌పీలు).. ముగ్గురు ఫిజియోథెరపిస్టులు ఉన్నారు.

సిరిసిల్ల, వేములవాడ, గంభీరావుపేట కేజీటూ పీజీలో పక్కా ప్రత్యేక భవిత కేంద్రం భవనాలు ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, రుద్రంగి మండలాల్లో ఐఆర్‌పీలులేక ఇన్‌ఛార్జిలతో కొనసాగుతున్నాయి.

ప్రతి వారంలో రెండు రోజులు ఫిజియోథెరపీ నిర్వహిస్తారు. కేంద్రాలకు రాని పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యాబోధన సేవలందిస్తున్నారు.

కేంద్రాలకు వచ్చే బాలికలకు రూ.700, బాలురకు రూ.500 రవాణా భత్యం కూడా ఇస్తున్నారు. పాఠశాలల్లో వారికి ఐఆర్‌పీలు విద్యాబోధన



చేస్తున్నారు.

**21 రకాల సేవలు**

విద్యార్థుల మానసిక, శారీరక పరిస్థితి అనుగుణంగా శిక్షణ, విద్యాబోధన ఉంటుంది. 5 నుంచి 18 ఏళ్ల మధ్య వయసుగల వారు 21 వైకల్యాలలో ఏదైనా ఒకదానితో బాధపడినా ఈ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులు. వినికిడి లోపం ఉన్నవారికి సైగలు, ఆటిజంతో బాధపడేవారికి స్పర్శ, సంగీతం, మాటలురానివారికి ధ్వనితో తమ పనులు తాము చేసుకునేలా సేవలు అందుతున్నాయి.

**పిల్లలు పాఠశాలకు వచ్చేలా చర్యలు**

ముందుగా గ్రామాల్లో ప్రత్యేకావసరాల పిల్లలను గుర్తిస్తాం. పాఠశాలకు (భవిత) కేంద్రానికి వచ్చేందుకు సంసిద్ధులుగా (స్కూల్ రెడీనెస్ ప్రోగ్రాం) నిర్వహిస్తాం. పాఠశాలకు వచ్చేలా చూస్తాం. ఫిజియోథెరపీ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. సదరం లేని పిల్లలను గుర్తించి సదరం క్యాంపునకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి శనివారం భవిత కేంద్రానికి రాలేని పిల్లలను గుర్తించి వారి ఇంటి వద్దకే వెళ్లి విద్యను అందిస్తున్నాం.

గౌతమి, ఐఆర్‌పీ, ముస్తాబాద్


**ఫిజియోథెరపీతో మార్పు** ప్రత్యేకావసరాల పిల్లలకు ప్రతి శుక్ర, శనివారాల్లో ఫిజియోథెరపీ చేస్తున్నాం. సానుకూల ఫలితాలు వస్తున్నాయి. పిల్లల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించి మండల కేంద్రంలో రెండు రోజుల పాటు నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను తప్పనిసరిగా వినియోగించుకోవాలి. పిల్లల్లో సానుకూల మార్పు కోరుకోవాలి. అర్హులందరూ సద్వినియోగం చేసుకుంటే సత్ఫలితం ఉంటుంది.బొగన్నగారి రాజేశ్, ఫిజియోథెరపిస్ట్

# అందని శ్వాస.. చలితో గజగజ

పెద్దపల్లి : వాతావరణంలో మార్పులు, కాలుష్య కారకాలతో పిల్లలు, వృద్ధులు నిమోనియా బారినపడుతున్నారు. వైరస్, బ్యాక్టీరియా లక్షణాలు సోకి ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. పుట్టిన బిడ్డకూ లక్షణాలు సోకడం ఆందోళన కలిగిస్తోంది. చలి నేపథ్యంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా మారుతోంది. నేడు 'ప్రపంచ నిమోనియా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

**15 శాతం మందికి..**

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే ప్రతీ వంద మంది పిల్లలు, వృద్ధుల్లో పదిహేను శాతం మందికి నిమోనియా లక్షణాలు ఉన్నట్లు వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. చలికాలంలో చిన్నారులు, వృద్ధుల్లో శ్వాసకోశ సంబంధ వ్యాధుల తీవ్రత పెరగనుంది. రెండేళ్లలోపు పిల్లల్లో అధికంగా సమస్య ఉంటుంది. బరువు తక్కువగా పుట్టిన, పోషకాహారలోపం ఉన్న ఏడాదిలోపువారు అస్వస్థతకు గురవుతుంటారు. చలితో ఊపిరితిత్తులు బిగుసుకుపోతుంటాయి. శ్వాసతీసుకోవడానికి ఇబ్బంది పడుతుంటారు. చలికి దూరంగా ఉంచడం, వెచ్చదానికి మాస్కులు ధరించేలా చూస్తే కాస్త ఉపశమనం పొందొచ్చు.. కారణాలు ఇవి సిగరెట్, తంబాకు, బీడీ, మద్యపానం తాగడం.వాయు కాలుష్యం, పరిశ్రమల పొగ, భరించలేని దుమ్ము,



ధూళి సూక్ష్మ కారకాలు.

వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, బలహీనులు.

తల్లి నుంచి పుట్టిన బిడ్డకు సోకే అవకాశం ఉంటుంది.

**లక్షణాలు ఇలా..**

వైరల్, బ్యాక్టీరియా, ఫంగస్ ఇలా మూడు రకాలుగా ఊపిరితిత్తులకు సోకుతుంది.తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు, దగ్గు, జలుబు, గొంతు నొప్పి.చెమట, తీవ్రత ఎక్కువైన వారిలో ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది.సకాలంలో వైద్యులను సంప్రదించాలి

ఊపిరితిత్తులకు వైరస్, బ్యాక్టీరియా సోకి శ్వాస తీసుకోవడం ఇబ్బంది అవుతుంది. పిల్లలు, వృద్ధుల్లో సమస్య తీవ్రంగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతున్న వారిలో ఇది అధికం. దీనికి అత్యాధునిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. సకాలంలో చికిత్స చేస్తే నయం కానుంది.

డాక్టర్ వినయ్ కుమార్, పల్మనాలజిస్టు, కరీంగర్

సొంత వైద్యం వద్దు

ఏడాదిలోపు బరువు తక్కువగా ఉన్న పిల్లలు, పోషకాహారలోపం ఉన్న వారిలో ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి. పాలు తాగకపోవడం, వేగంగా శ్వాస తీసుకోకపోవడం, దగ్గుతో ఇబ్బంది పడుతుంటారు. సొంత వైద్యం తీసుకోకుండా ఆసుపత్రిలో సంప్రదించాలి.

# ఆదాయమెంత.. ఆమోదమెంత?



హైదరాబాద్: ప్రతిపాదనలు రావడమే ఆలస్యం.. జీహెచ్‌ఎంసీ కమిషనర్ కార్యాలయం పచ్చజెండా ఊపేస్తోంది. గతంలో ఏడాది పొడవునా రూ.1,100కోట్ల నిర్వహణ పనులకు ఆమోదించే వారు. గడిచిన ఆరు నెలల్లోనే జీహెచ్‌ఎంసీ ఆ రికార్డును పూర్తి చేసింది. కమిషనర్ కార్యాలయం తీసుకుంటున్న దూకుడు నిర్ణయాలపై జోనల్ కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీకి వస్తోన్న ఆదాయం, తక్షణం చేపట్టాల్సిన ప్రాజెక్టులు, అధ్వానంగా మారిన రహదారుల గురించి పట్టించుకోకుండా.. జరుగుతాయో, లేదో తెలియని పనులను వందల సంఖ్యలో ఆమోదించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**చార్మినార్‌కు రూ.500 కోట్లపైనే..**

జీహెచ్‌ఎంసీలో 6 జోన్లు ఉన్నాయి. రహదారులు, వరద నీటి కాలువలు, కాలిబాటలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, పార్కుల అభివృద్ధి, చెరువుల సుందరీకరణ, నాలాల నిర్వహణ, ఇతరత్రా పనులను జోన్లవారీగా చేపట్టాల్సి ఉంటుంది. ప్రతిపాదనలను జడ్సీ, ఇంజినీర్లు కేంద్ర కార్యాలయానికి పంపిస్తే కమిషనర్లు తనిఖీ చేయించేవారు. పనులు పూర్తయ్యాక కొత్త వాటిని ఆమోదిస్తామని ప్రజాప్రతినిధులకు నచ్చజెప్పేవారు. ఇప్పుడు మెజార్టీ ప్రతిపాదనలు నేరుగా ఆమోదం పొందుతున్నాయి. 6 నెలల్లో చార్మినార్ జోన్ రూ.500 కోట్లకుపైగా ఆమోదాలతో మొదటిస్థానంలో ఉంది. రూ.200 కోట్లతో శేరిలింగంపల్లి, ఖైరతాబాద్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, సికింద్రాబాద్ నామమాత్రమే.

**పని చేయకుండానే..**

ఎక్కువ పనులను ఆమోదించుకోవడం, టెండర్లు పిలిచి, గుత్తేదారులకు పనులు అప్పగించడంపైనే ప్రజాప్రతినిధులు దృష్టి పెడుతున్నారు. పనులు చేయించడంపై ఆసక్తి చూపట్లేదనే విమర్శలున్నాయి. పనులు చేయకుండా బిల్లులు తీసుకున్న ఏజెన్సీలు, బిల్లులు ఇచ్చిన ఇంజినీర్ల విషయమై ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఇటీవల కమిషనర్‌కు లేఖ రాశారు. పని చేయకుండానే సింగరేణికాలనీలో సీసీ రోడ్డు, ఓ కమ్యూనిటీహాల్, వరద నాలా నిర్మించినట్టు బిల్లులు తీసుకున్న గుత్తేదారు, ఆమోదించిన ఇంజినీర్ల అవినీతిని సైదాబాద్ కార్పొరేటర్ వెలుగులోకి తెచ్చారు. ఇలాగే కొనసాగితే 2025-26 ఆర్థిక సంవత్సరం ఆమోదాల విలువ రూ.2 వేల కోట్లకు చేరుకుంటుందని, ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సి ఉంది.

అప్పుల కుప్ప..జీహెచ్‌ఎంసీ వార్షిక ఆదాయం రూ.4,500 కోట్లు

అప్పులు రూ.5,000 కోట్లు

ఉద్యోగుల జీతాలు, పింఛన్లు రూ.120 కోట్లు

ప్రతినెలా అప్పులకు చెల్లించే కిస్తీ రూ.320 కోట్లు (ఎస్సార్డీపీ ప్రాజెక్టు, ట్రైడ్స్ కార్యక్రమం)

# ఆరోగ్య పరీక్ష.. అతివకు రక్ష



సంగారెడ్డి : ఇంటి పనులు, పిల్లల పోషణ, ఇతరత్రా బాధ్యతలతో గృహిణులు నిత్యం తీరిక లేకుండా ఉంటున్నారు. మరికొందరు ఇంటి బాధ్యతలతో పాటు ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం తదితర పనులతో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. వీరు వేళకు తినకపోవడం, సరిపడా నిద్ర లేకపోవడం తదితర కారణాలతో అనారోగ్యానికి గురవుతున్నారు. సకాలంలో వైద్యం చేయించుకోక పోవడం వల్ల ఒక్కోసారి ప్రాణాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో మహిళలకు బాసటగా నిలవాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రుల్లో 'ఆరోగ్య మహిళ' పేరిట ఉచితంగా ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే జిల్లా ఆసుపత్రికి.. లేదంటే హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. సకాలంలో వైద్యం అందేలా కృషి చేస్తున్నారు.

**జిల్లాలోని 13 పీహెచ్‌సీల్లో..**

జిల్లాలోని 13 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. బిలాల్‌పూర్, బొల్లారం, హత్నూర, ఝరాసంగం, జిన్నారం, కల్హేర్, కంది, కంగ్టి, కానుకుంట, కొండాపూర్, మునిపల్లి, న్యాల్‌కల్, రామచంద్రాపురంలోని పీహెచ్‌సీల్లో ఈ కార్యక్రమం పేరిటి ప్రతి మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా వివిధ రకాల క్యాన్సర్ల అనుమానితులు, థైరాయిడ్ సమస్య, సూక్ష్మ పోషక లోపాలు, రక్తహీనత తదితరాలపై దృష్టి సారిస్తున్నారు. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రత ఆధారంగా ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారు. క్యాన్సర్ రోగుల కోసం ఇప్పటికే సంగారెడ్డిలో 20 పడకల ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు.

**'ఆరోగ్య మహిళ' పరీక్షలు ఇలా..**

(ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబరు వరకు)

ఎంపిక చేసిన ఆరోగ్య కేంద్రాలు: 13

పేర్లు నమోదు చేసుకున్నవారు: 22,582

క్యాన్సర్ కేసులు: 19

మూత్రాశయ సమస్యలు: 1971

పోషక లోపం: 2399

థైరాయిడ్ సమస్యలు: 3608


రక్తహీనత: 5905

పీహెచ్‌సీల నుంచి పై ఆసుపత్రులకు తరలించిన రోగులు: 976

జాగ్రత్తలు పాటించాలి

మహిళలు పనుల్లో తీరిక లేకుండా ఉంటున్నప్పటికీ ఆహారం, ఆరోగ్యానికి తప్పనిసరిగా కొంత సమయాన్ని కేటాయించాలి. సమతుల ఆహారం తీసుకోవాలి. కనీసం 6-8 గంటలు నిద్రపోవాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వయసుకు తగిన బరువు ఉండేలా చూసుకోవాలి. తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు తినాలి. శరీరంలో అనారోగ్య మార్పులు గమనిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.నాగనిర్మల, జిల్లా ఇన్‌ఛార్జి వైద్యాధికారిణి

# వసతులు భ్రాంతి.. రైతుకేదీ విశ్రాంతి?



హైదరాబాద్:నగరంలో పెద్దదైన బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో గతంలో ఏర్పాటు చేసిన రైతుల విశ్రాంతి భవనం నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు తీసుకొచ్చే రైతులు సేదదీరేందుకు పరిపాలన భవనం పక్కనే ఉన్న క్యాంటీన్ పైఅంతస్తులో దీనిని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు కూరగాయలు, ఇతర పంటల విక్రయాలు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లేందుకు కొన్ని రోజులు ఇక్కడ ఉండాల్సి ఉంటుంది. దీంతో వారు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలో తొలుత అన్ని వసతులు కల్పించారు. అనంతరం దీని నిర్వహణను మార్కెట్ కమిటీ అధికారులు, ప్రతినిధులు పట్టించుకోక పోవడంతో అధ్వానంగా తయారైంది.

**నిత్యం వేలాది మంది రైతుల రాక**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2002లో 174 దుకాణాలు, మార్కెట్ కమిటీ కార్యాలయం, క్యాంటీన్, రైతులు, హమాలీల విశ్రాంతి భవనాలతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇరు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులు నిత్యం ఈ మార్కెట్‌కు 30 వేల నుంచి 35 వేల క్వింటాళ్ల కూరగాయలు తీసుకొస్తుంటారు. వీరు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటు చేసిన భవనంలోని ఫ్యాన్లు దెబ్బతిన్నాయి. మంచాలు శిథిలావస్థకు చేరాయి. భవనంలో అపరిశుభ్రత నెలకొంది. తాగునీటి వసతి లేదు.మరుగుదొడ్ల పరిస్థితి దయనీయంగా మారింది.

**వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నా**

పల్లీల విక్రయం కోసం వారం కిందట మార్కెట్‌కు వచ్చా. అప్పటి నుంచి దుకాణం వద్దే ఉంటున్నా. గతంలో ఇక్కడి రైతు విశ్రాంతి భవనం ఎంతో బాగుండేది. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం.

నారాయణప్ప, అనంతపురం జిల్లా శింగనమల

రూ.10 లక్షలతో ప్రతిపాదనలు

శిథిలావస్థకు చేరిన రైతు విశ్రాంతి భవనాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలతో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపాం. అప్పటి వరకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు సేదదీరేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.రాగిరి ఆనంద్‌బాబుగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్

# కామర్స్‌కే మొగ్గు..

కరీంనగర్ : ఇంటర్ పూర్తయిన తరువాత చాలా మంది విద్యార్థులు డిగ్రీలో ఉపాధి లభించే కోర్సులను ఎంపిక చేసుకోవడానికి మొగ్గు చూపుతున్నారు. విపణిలో త్వరగా ఉపాధి లభిస్తుందని కామర్స్ కోర్సు తీసుకుంటున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో గల డిగ్రీ కళాశాలల్లో గత మూడేళ్లలో బీకాం కోర్సులో చేరిన విద్యార్థుల సంఖ్యే అధికంగా ఉంది. దీన్ని బట్టి ఈ కోర్సు ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు.

**ఏ గ్రూపు వారైనా చేరవచ్చు**

శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలో బీకాంలో కంప్యూటర్ అప్లికేషన్, ఫైనాన్స్, బిజినెస్ అకౌంటెన్సీ, రిటెయిల్ ఆపరేషన్స్ కోర్సులున్నాయి. ఇవి పూర్తి చేసినవారికి విపణిలో.. ముఖ్యంగా వ్యాపార రంగంలో అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. విద్యుత్తు శాఖలో జేఏఓగా ఈ కోర్సు చదివిన విద్యార్థులే 60 శాతం మంది ఉద్యోగాలు సాధిస్తున్నారు. అలాగే కార్పొరేట్ సంస్థల్లో, టాక్స్ కన్సల్టెంట్ వద్ద అకౌంటెంట్‌గా



చేరిపోవచ్చు. ఎంకాం పూర్తి చేసిన విద్యార్థులు బోధన రంగం వైపు వెళ్లవచ్చు. ఎంబీఏ చేస్తే మరింత మెరుగైన ఉద్యోగావకాశాలను పొందడానికి అవకాశం ఉంటుంది. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఆర్ట్స్ గ్రూపుల్లో ఏది పూర్తి చేసిన వారైనా డిగ్రీలో బీకాంలో చేరడానికి అవకాశం ఉంటుంది. ఈ కారణాలతోనే మెజార్టీ విద్యార్థులు ఈ కోర్సులో చేరుతున్నారు.

**అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తా..**

మాది మల్కాపూర్. అమ్మ వ్యవసాయ పనులు చేస్తుంటుంది. నాన్న గతంలోనే మరణించారు. బీకాం పూర్తి కాగానే ఏదైనా సంస్థలో అకౌంటెంట్‌గా చేరి అమ్మకు సాయపడవచ్చని ఈ కోర్సులో చేరా. చాలా మంది నా తోటి విద్యార్థులు కూడా ఇలాగే కోర్సులో చేరినట్టు చెబుతుంటారు. ప్రస్తుతం కరీంనగర్ ఎస్సారార్ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్నా. మరో రెండేళ్లు కష్టపడి ఉద్యోగంలో చేరి కుటుంబానికి అండగా నిలబడతా.

చాట్ల సమత, బీకాం, ఎస్సారార్ డిగ్రీ కళాశాల

**దోస్త్ ప్రవేశాల్లో ప్రథమ స్థానం**

బీకాం కోర్సు వైపే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. దోస్త్ ప్రవేశాలను పరిశీలిస్తే ప్రథమ స్థానం బీకాం కోర్సుకే దక్కుతుంది. ప్రస్తుతం ప్రతి కార్పోరేట్ సంస్థలో తప్పనిసరిగా అకౌంటెంట్ అవసరం ఉంటుంది. దీంతో బీకాం చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కోర్సు పూర్తవగానే చాలా మంది ఉద్యోగాల్లో చేరిపోతుంటారు. టి.రాజయ్య, బీకాం, హెచ్‌ఓడీ, ఎస్సారార్ కళాశాల

# 'భౌ'బోయ్.. బతకలేం..!

సూర్యాపేట: క్రీడా సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, బస్, రైల్వేస్టేషన్లు తదితర జనసందడి, బహిరంగ ప్రదేశాల్లో వీధి శునకాలు సంచరించకుండా చేయండి. ఆయా సంస్థల ప్రాంగణాల్లోకి అవి చొరబడకుండా కంచెలు నిర్మించాలి. క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలి. వీధి కుక్కలను తక్షణమే షెల్టర్లకు తరలించాలి..' - సుప్రీంకోర్టు ఆదేశం సూర్యాపేట 43వ వార్డు నెహ్రూనగర్‌లో ఆదివారం పిచ్చికుక్క ఐదుగురిని తీవ్రంగా గాయపరిచింది. వీటితోపాటు బాతులు, మేకలపై దాడిచేసింది. యువకుడి చేతికి, వృద్ధురాలికి తీవ్రగాయాలయ్యాయి. బాధితులు చికిత్స పొందారు. వీరి పరిస్థితిని చూసైనా అధికారులకు కనువిప్పు కలగాలి.

పిచ్చికుక్కలు కరిస్తేనే తెలుస్తుంది బాధ. వాటి దాడితో మరణించిన కుటుంబాల దయనీయ పరిస్థితి ఎవరికీ తెలియదు. కానీ అధికారులు వీటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇటీవల సుప్రీంకోర్టు కూడా వీధి కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో ఉండకుండా చూడాలని ఆదేశాలు జారీ చేసింది. నేటికీ పురపాలికల్లో చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. కనీసం ఆదేశాల మేరకు నడచుకోవాలనే ఆలోచన కూడా రావడం లేదు. దీంతో వీధుల్లో పిచ్చికుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. బయటకు వెళ్లాలంటేనే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులు ఇంటికి చేరుకొనే వరకు వారి తల్లిదండ్రుల్లో ఆందోళన ఉంటుంది.

**టీకాలు శూన్యం**

వీధి శునకాలకు ఎక్కడా టీకాలు వేయడం లేదు. జూనోసిస్ డే సందర్భంగా ఒక్కరోజు మాత్రమే పదుల సంఖ్యలో వేస్తున్నారు. కానీ అధికారులు మాత్రం అన్నింటికీ టీకాలు వేసినట్లు చెబుతున్నారు. ఒక్కో వార్డులో వందల సంఖ్యలో



సంచరిస్తున్నాయి. కొన్ని పిచ్చి సోకినవీ ఉన్నాయి. వీటిని గుర్తించి చికిత్స చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

కుక్కల నియంత్రణకు త్వరలో చర్యలు తీసుకుంటామని పుర కమిషనర్లు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

**సంరక్షణ కేంద్రాలేవి?** ఉమ్మడి నల్గొండ జిల్లాలో 19 పురపాలికలు ఉన్నాయి. ఒక్క సూర్యాపేట పురపాలికలో మాత్రమే కుక్కల సంరక్షణ కేంద్ర నిర్మాణం చేపట్టారు. ఇక్కడ వార్డుల్లో సంచరిస్తున్న వాటిని పట్టుకొని కు.ని. శస్త్రచికిత్సలు అడపాదడపా చేస్తున్నారు. మిగతా పురపాలికల్లో రెండేళ్ల క్రితం కోర్టు ఆదేశాల మేరకు నిర్మాణాలు చేపట్టాల్సి ఉన్నా నేటికీ ఎలాంటి అతీగతి లేదు. నియంత్రణ కేంద్రాలున్న ప్రాంతాలకు తరలించాలంటే రవాణా భారంతో పాటు ఒక్కో చికిత్సకు రూ.1650 ఖర్చవుతుంది. దీన్ని మోయలేక పురపాలికలు చేతులెత్తేశాయి.

## మంగలేటీ.. 'భూ'తాల లూటీ

నంద్యాల : రెండు కార్ల పంటలకు సాగునీటిని అందించే కాల్వ ఆక్రమణకు గురైంది. ఏళ్లుగా కొద్దికొద్దిగా ఆక్రమణలకు గురవుతూ రావడంతో చివరకు కాల్వ రూపు కోల్పోయే దుస్థితి నెలకొంది. భారీ వర్షం వస్తే కాల్వ పొంగిపొర్లి పొలాలను ముంచడంతోపాటు ఏకంగా గ్రామమే మునిగిపోయే పరిస్థితి ఏర్పడింది.

**200 ఎకరాల ఆక్రమణ**

నారాయణపురం పరిధిలో 605, 606, 608, 612, 614, 615 తదితర సర్వే నంబర్లలో 17 మీటర్ల వెడల్పుతో మంగలేటి కాల్వ ఉంది. 1996 నుంచి వెలుగోడు రిజర్వాయరు ద్వారా తెలుగుగంగ కాల్వలకు నీటి విడుదల ప్రారంభమైంది. దీంతో పంట పొలాలకు 'కళ' వచ్చింది. మంగలేటి కాల్వకు కూడా అప్పటి నుంచే సాగునీటి విడుదల జరగ్గా.. కాల్వ ఆక్రమణకు గురవుతూ వచ్చింది. ప్రస్తుతం కాల్వ వెడల్పు మూడు మీటర్లు మాత్రమే ఉంది. దీంతో నిర్దేశిత పరిమాణంలో నీటిని తీసుకోలేకపోతోంది. 5 కి.మీ.ల పొడవునా కాల్వ వెంట ఆక్రమిత భూమి విస్తీర్ణం 200 ఎకరాల వరకు ఉంటుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

**9 కి.మీ. పొడవునా..**

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి బండిఆత్మకూరు మండలం నారాయణపురం, సంతజూటూరు, చిన్నదేవళాపురం తదితర గ్రామాలకు 'కృష్ణా' వెనుక జలాలను అందించేందుకు 'మంగలేటి కాల్వ' ఉంది. టీజీపీ ప్రధాన కాల్వ నుంచి సంతజూటూరు వరకు 9 కి.మీ. పొడవునా ఈ



కాల్వ ఉంది. ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం గ్రామం వరకు 5 కి.మీ.ల పొడవునా కాల్వ ఆక్రమణకు గురైంది.

**నారాయణపురం జల దిగ్బంధం**

మంగలేటి కాల్వ ఆక్రమణలతో సాగునీరు విడుదల సమయంలో కాల్వ పొంగి పొర్లుతుంది. ఇదే సమయంలో భారీ వర్షం కురిసినా.. తుపాను సమయంలో కాల్వ పోటెత్తి సమీపంలోని పొలాలను ముంచెత్తుతోంది. సమీపంలోని నారాయణపురం గ్రామాన్ని దిగ్బంధం చేస్తుంది. చుట్టుపక్కల ప్రాంతాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. తాగునీరు కలుషితం అవుతుంది. ఇక్కడి ప్రజలు ఇలా ఇబ్బందులు పడడం రెండు దశాబ్దాలుగా సాధారణంగా మారిపోయింది.

**పొలాలకూ దెబ్బ**

తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి నారాయణపురం మీదుగా సంతజూటూరు వరకు 9 కి.మీ.ల పొడవునా మంగలేటి కాల్వ ప్రవాహం ఉంది. నారాయణపురంతోపాటు సమీప గ్రామ పొలాలు దెబ్బతింటున్నాయి. గ్రామానికి చెందిన 300 ఎకరాల పంట పొలాలు భారీ వర్షాల సమయంలో మునిగి రైతులు నష్టపోతున్నారు. గతనెల మొంథా తుపానుతో గ్రామంతోపాటు పొలాలు మునిగాయి.

## జామాయిల్ సాగు.. లాభాలు బాగు

తాళ్లూరు : రైతులు ఎంతో ఆశతో సాగు చేపట్టిన జామాయిల్ పంట ప్రస్తుతం కనక వర్షం కురిపిస్తోంది. నీటి వసతి తక్కువగా ఉండడం, పెట్టుబడులు పెట్టి పంట సాగుకోసం అధిక శ్రమను చేయలేని రైతులు జామాయిల్ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

**జిల్లా పరిధి గ్రామాల రైతులు కూడా..**

తాళ్లూరు, విఠలాపురం, కొత్తపాలెం, బొద్దికూరపాడు, వెలుగువారి పాలెం, తదితర గ్రామాల రైతులతోపాటు జిల్లా పరిధిలోని చీమకుర్తి, మద్దిపాడు, ముండ్లమూరు, దర్శి, టంగుటూరు, జరుగుమల్లి, సంతనూతలపాడు, తదితర మండ లాల పరిధిలో విస్తారంగా సాగులో ఉంది. పెట్టుబడులు చాలా తక్కువగా ఉండడంతో రైతులు పంట సాగు పట్ల అసక్తి చూపుతున్నారు. దీంతో జిల్లా పరిధిలో సుమారు నలభైవేల ఎకరాల్లో సాగవుతోంది. తొలి ఏడాదిలో కేవలం రూ.20వేలు వంతునే పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. తదుపరి రెండేళ్లలో అవసరమైనమేర శ్రమతో పంటను కాపాడుకోవడంతో ప్రస్తుతం కాసులు కురిపిస్తున్నాయి. ఒక్కో ఎకరాలో సాగు ఖర్చులు, కౌలు, ఇతరత్రా పెట్టుబడులన్నీ కలిపి మొత్తం రూ. 50వేలమేరకు రైతులు ఖర్చు చేశారు. గత రెండు, మూడేళ్ల కాలంలో గిట్టుబాటు ధరలు దక్కక రైతులు ఎన్నో విధాలుగా ఇబ్బందులకు గురయ్యారు. ప్రస్తుతం ఊహించిన రీతిలో పుష్కలంగా లాభాలు వస్తుండడంతో ఆనందంగా ఉన్నారు.

**భూముల స్థితిగతుల ఆధారంగా..**


ఒక్కో ఎకరాలో రైతుల భూముల స్థితిగతులు ఆధారంగా 25 నుంచి 40 టన్నుల వరకూ దిగుబడులు వస్తున్నాయి. సరాసరిగా 25 టన్నుల మేరకు అధిక మంది రైతులు దిగుబడులు సాధించ గలిగారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు టన్ను ధర రూ.ఐదువేల వంతున రైతులకు చెల్లిస్తున్నారు. కూలీలకు అవుతున్న ఖర్చులు, వాహనాల బాడుగలు, ఇతరత్రా ఖర్చులు పోగానే ఆమేర ధరలు దక్కుతున్నాయి. దీంతో ఎకరాలో రూ. 1,25,000ల వరకూ వస్తుండగా పెట్టుబడులు పోగా నికరాదాయం రూ. 75 వేలుపైగా దక్కుతోంది. ఇతర పంటలు దెబ్బతిని నష్టాలను చవిచూసి ఆందోళనలో ఉన్న రైతాంగానికి సుబాబుల్ పంట బాగా ఊరటనిస్తోంది.

## బిందు సేద్యం.. మొక్కకు ప్రాణం

కంభం : సాగును ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. అందులో భాగంగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలను రాయితీపై అందజేస్తోంది.

**రాయితీలు ఇలా...**ఎస్సీ, ఎస్టీల్లో 5 ఎకరాల్లోపు ఉన్న చిన్న, సన్నకారు రైతులకు వంద శాతం, ఇతర చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం, 5 నుంచి 10 ఎకరాలు కలిగిన మధ్య తరగతి రైతులు 90 శాతం, 10 నుంచి 12.5 ఎకరాలు కలిగిన పెద్ద రైతులకు 50 శాతం రాయితీతో బిందు సేద్యం పరికరాలు అందిస్తున్నారు. రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించి భూమి పత్రాలు (పాస్ పుస్తకాలు), ఆధార్ కార్డు, పాస్‌పోర్టుసైజు ఫొటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఫోన్ నంబర్‌తో సంప్రదించాలి. రైతు వాటా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. నిర్దేశించిన లక్ష్యం పూర్తి అయినప్పటికీ, అర్హులైన రైతులు ముందుకు వస్తే ఏడాది పొడవునా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు మంజూరు చేస్తామని గిద్దలూరు ఉద్యాన శాఖ అధికారి శ్వేత తెలిపారు. లక్ష్యం... 10 వేల హెక్టార్లు జిల్లా వ్యాప్తంగా 2025-26 ఏడాదికి 10 వేల హెక్టార్లలో బిందు సేద్య పరికరాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. కానీ ఇప్పటి వరకూ సగం లక్ష్యం కూడా పూర్తి చేయలేదు. 4805 హెక్టార్లకు పరిపాలన అనుమతులు మంజూరయ్యాయి. మరో 5194 హెక్టార్లకు బిందు సేద్యం పరికరాలు అందజేయాల్సి ఉంది. నిర్దేశించిన లక్ష్యం కంటే ఎక్కువగా బిందు, తుంపర్ల సేద్యం పరికరాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు.

## తూకాల్లో తేడా.. సరఫరాలోనూ స్వాహా!




పుట్టపర్తి: ధర్మవరం మార్కెట్ ప్రాంతంలో మంగళవారం ఓ మహిళ చౌక దుకాణం నుంచి బియ్యం తీసుకువెళ్లింది. ఇంటికి వెళ్లి తూకం వేయగా.. 15 కిలోలకుగాను 13.50 కిలోలే వచ్చాయి. వెంటనే వెళ్లి డీలర్‌ను ప్రశ్నించారు. ఆయన బియ్యం బస్తాని తూకం చూడగా 47.600 కిలోలు వచ్చింది. జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి. జిల్లాలో చౌకదుకాణాల ద్వారా ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్ బియ్యంలో అవకతవకలు జరుగుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడుతుండటంతో అన్యాయం జరుగుతోందని వాపోతున్నారు. ఈ విషయమై డీలర్లను ప్రశ్నిస్తే.. ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచే తూకాలు తక్కువతో సరఫరా చేస్తున్నారని చెబుతున్నారు. అంటే.. గుత్తేదారులు తమకు తక్కువ ఇస్తుండటంతోనే తామూ లబ్ధిదారులకు సరఫరా చేసే మొత్తంలో కొంత తగ్గించి ఇస్తున్నామని పరోక్షంగా చెబుతున్నారు. ప్రభుత్వం ఉచితంగా ప్రతి లబ్ధిదారుకు నెలకు ఐదు కిలోలు చొప్పున బియ్యం అందిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం కిలోకు రూ.44 వెచ్చిస్తోంది. జిల్లాకు ప్రతి నెలా 87,10,680 కిలోలు సరఫరా చేస్తోంది. అంటే.. నెలకు రూ.38.32 కోట్లకు పైగా వెచ్చిస్తోంది. ఈనేపథ్యంలో బియ్యం తూకాల్లో మోసాలు జరుగుతుండటంతో కార్డుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**నిల్వ కేంద్రాల్లోనూ తక్కువగా..**

జిల్లాకు పశ్చిమగోదావరి నుంచి రేషన్ బియ్యం సరఫరా చేస్తున్నారు. వాటిని బుక్కపట్నం, గాండ్లపెంట, గోరంట్ల, కదిరి, ముదిగుబ్బ, పెనుకొండ, తనకల్లు, ధర్మవరం, మడకశిర, హిందూపురం, సీకే పల్లి, ఓబుళదేవరచెరువులో ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరవేస్తున్నారు. అక్కడి నుంచి వాటి పరిధిలోని డీలర్లకు సరకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడే తూకాల్లో తేడాలొస్తున్నాయని డీలర్లు అంటున్నారు. ఇటీవల ఓ మండలంలో 50 కిలోల బస్తాను తూకం వేయగా 43.060 వచ్చింది. అంటే.. అన్ని బస్తాల్లోనూ ఇదే తూకాలు ఉండవు. సగటున రెండు కిలోలు తక్కువ వస్తున్నాయని, బస్తా బరువు అదనమని డీలర్లు చెబుతున్నారు. నిల్వ కేంద్రాల్లో బియ్యం తీసుకునే సమయంలో డీలర్లు వేలిముద్రలు తప్పక వేయాలి. అలాంటప్పుడు తూకాల్లో తక్కువ వస్తే అక్కడే ఎందుకు అడగటం లేదని అధికారులు ప్రశ్నిస్తున్నారు.

**తనిఖీలు చేస్తున్నాం- వంశీకృష్ణారెడ్డి, పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి**చౌక దుకాణాల్లో డీలర్లు తూకాల్లో మోసాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే తనిఖీలు చేస్తున్నాం. నిల్వ సరకులో తేడాలుంటే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతినెలా 20 వరకు కేసులు నమోదు చేస్తున్నాం. తనిఖీలు మరింత విస్తృతం చేస్తాం.

## ఆకలి తీర్చి.. దప్పిక మరచి..!



చిత్తూరు : ఇది గుడుపల్లెలోని జడ్పీ ఉన్నత పాఠశాల. ఇక్కడ 470 మంది విద్యార్థులు చదువుతున్నారు. బుధవారం 404 మంది హాజరయ్యారు. గతంలో ఇచ్చిన నీటిశుద్ధి యంత్రం పనిచేయడం లేదు. దీంతో విద్యార్థులు ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా దీనికి మరమ్మతులు చేస్తే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. పాఠశాలలకు వచ్చే చిన్నారులు ఆకలితో ఉండకూడదనే ఉద్దేశంతో మధ్యాహ్న భోజన పథకానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దీన్ని మరింత మెరుగుపరిచింది. రోజూ మెనూను సక్రమంగా అమలు చేస్తున్నారు. ఎంఈవో-2లు రోజూ పర్యవేక్షిస్తున్నారు. ఇంతవరకూ బాగానే ఉన్నా అడపాదడపా అన్నం గట్టిగా ఉండటం, ముద్దగా తయారవుతోన్న ఉదంతాలు వెలుగు చూస్తున్నాయి. కొన్నిచోట్ల రక్షిత నీటిశుద్ధి యంత్రాలు లేకపోవడం, మరమ్మతులకు గురవ్వడం, వంట చేసే ప్రదేశాలు శుభ్రంగా లేనందున విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్నిచోట్ల స్థలాభావంతో ఆరుబయటే వండుతున్నారు. ఫలితంగా దుమ్ము, ధూళి చెలరేగి వంటల్లో పడుతున్నాయి. చిత్తూరు జిల్లాలోని పాఠశాలలు: 2,436
విద్యార్థులు: 1,33,917 మంది

మరమ్మతులు చేస్తేనే..చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ప్రధానంగా ఆర్వో ప్లాంట్లు లేకపోవడమే సమస్యగా మారింది. వైకాపా హయాంలో 'నాడు- నేడు' కింద తొలి, రెండో విడత పనులు చేపట్టిన పాఠశాలల్లో వీటిని అమర్చినా నిర్వహణ కరవైంది. దీంతో అవి మూలకు చేరాయి. సంబంధిత ఏజెన్సీలకు ప్రధానోపాధ్యాయులు సమాచారం ఇచ్చినా బాగు చేయడానికి ముందుకు రావడంలేదు. పలుచోట్ల ఉపాధ్యాయులే కొంత మొత్తం వేసుకుని మరమ్మతులు చేయిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అలాగే వదిలేయడంతో విద్యార్థులు బయటి నుంచి నీళు తెచ్చుకుంటున్నారు. పలువురు మధ్యాహ్న సమయంలో పాఠశాలను వదిలి ఇళ్లకు వెళుతున్నారు. కుప్పం, పలమనేరు, శ్రీకాళహస్తి, గూడూరు, సత్యవేడు నియోజకవర్గాల్లో ప్రధానంగా మరమ్మతులు చేయాలి. **వర్షమొస్తే అంతే**

జిల్లాలోని దాదాపు 30 శాతం పాఠశాలలకు సరిపడా వంట గదులు లేవు. దాంతో ఆరుబయటే భోజనాలు వండుతున్నారు. ఇలాంటి చోట వర్షం వచ్చినప్పుడు అవస్థలు ఎదురవుతున్నాయి. పలమనేరు, పుంగనూరు, సత్యవేడు, చంద్రగిరి నియోజకవర్గాల్లో ఈ దుస్థితి అధికంగా ఉంది. వరండాలూ సరిగ్గా లేక చెట్ల కింద తినాల్సి వస్తోంది.

## బండి తీయాలంటే భయం!



అనకాపల్లి : జిల్లాలో వాహనదారులకు ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. అనకాపల్లి, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ వాహనదారులను హడలెత్తిస్తోంది. ముఖ్యమైన కూడళ్లలోనూ ట్రాఫిక్ పోలీసులు లేకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారుతోంది. జిల్లా పోలీసు యంత్రాంగం ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదు. సాయంత్రమైతే కొందరు రోడ్డు మధ్యలో బళ్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో.. సమస్య మరింత జటిలమవుతోంది.

**వాహనాలు నిలిపేందుకు ఇక్కట్లు..**

అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీలు క్రమంగా విస్తరిస్తున్నాయి. ఎక్కడికక్కడ వ్యాపార సముదాయాలు వెలుస్తున్నాయి. కానీ.. పట్టణంలోని ఏ ఒక్క షాపింగ్ మాల్ దగ్గర కూడా పార్కింగ్ సదుపాయాలు లేవు. రోజూ సాయంత్ర వేళల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా.. అటు మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కనీసం పట్టించుకోవడంలేదు. పట్టణంలో ఎక్కడా పార్కింగ్ చేసేందుకు కూడా స్థలం లేదు. ఫలితంగా రోడ్లపైనే వాహనాలు నిలుపుతుండటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది.

అనకాపల్లి పట్టణంలోని ఒన్ రోడ్డు, గాంధీబొమ్మ సెంటర్లు నిత్యం రద్దీగా ఉంటాయి. వారాంతాల్లో అయితే.. చెప్పనక్కర్లేదు. దీంతోపాటు ఈ కూడలి మధ్యలోనే ఆర్టీసీ బస్సులు, ఆటోవాలాలు నిలుపుతున్నారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంటోంది. కనీసం వారాంతాల్లోనూ ట్రాఫిక్ సిబ్బంది ఉండకపోవడంతో ఏ కూడలి దాటాలన్నా 20 నిమిషాలకు పైనే పడుతోంది. ఎలమంచిలి పట్టణంలో పార్కింగ్ స్థలాలు లేవు. దుకాణాల ముందే వాహనాలు నిలపాలి. దిమిలి రోడ్డులో వాహనాలు ఇరువైపులా వాహనాలు నిలుపుతుంటారు. అచ్యుతాపురం నాలుగు రోడ్ల కూడలి మీదుగా నిత్యం వందల వాహనా లు రాకపోకలు సాగిస్తున్నా.. ఒక ట్రాఫిక్ పోలీస్‌తో నెట్టుకొస్తున్నారు.

నర్సీపట్నం శ్రీకన్య కూడలి, అబీద్ కూడలి, ఐదురోడ్ల కూడలిలో ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుంది. అబీద్ కూడలి - కృష్ణదేవిపేట వెళ్లే దారి ఇరుగ్గా ఉండటంతో ఎదురెదురు వాహనాల రాకపోకలకు వీలవడం లేదు. నర్సీపట్నం ప్రధాన రహదారిలో చిన్నచిన్న ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. ఐదురోడ్ల కూడలిలో సిగ్నల్ పెట్టాలని ఎప్పటి నుంచో ప్రతిపాదనలు ఉన్నా.. కార్యరూపం దాల్చలేదు. ఈ కూడలిలో కనీసం ముగ్గురు ట్రాఫిక్ సిబ్బంది అవసరమున్నా.. ఒక్కరితో సరిపెట్టారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తాం: జిల్లాలో ట్రాఫిక్ అధికంగా ఉన్న కూడళ్లను గుర్తిస్తున్నాం. ప్రధాన కూడళ్లలో నిత్యం ట్రాఫిక్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. రద్దీ ప్రాంతాల్లో బారికేడ్లు, ఫ్రీ లెఫ్ట్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. ఇటీవల ఆధునిక సీసీ కెమెరాలు కూడా ప్రధాన కూడళ్లలో పెట్టాం. వాటితో కూడా ట్రాఫిక్ సమస్యను గుర్తించి సమీపంలోని సిబ్బందిని పంపించి సరిచేస్తాం.
తుహిన్ సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

## పసివాళ్లు.. శుద్ధినీరందక వెక్కిళ్లు

ఆళ్లగడ్డ : అంగన్‌వాడీల్లో చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు సురక్షిత జలం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం శుద్ధజల యంత్రాలను(వాటర్ ప్యూరిఫయర్) అందించింది. వీటిలో కొన్ని పనిచేయక పోగా, మరికొన్ని నీటి వనరులు, పైప్‌లైన్ నిర్మాణం, నీటి ట్యాంకులు లేకపోవడంతో వృథాగా మారాయి. 'సక్షం' పథకంలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో సొంత భవనాలున్న 246 అంగన్‌వాడీ కేంద్రాలకు శుద్ధజల యంత్రాలను నాలుగు నెలల క్రితం మంజూరయ్యాయి. మరమ్మతులు, నిర్వహణ లోపించడంతో యంత్రాలు అలంకారప్రాయంగా మారాయి.

**అనారోగ్యం పాలవకుండా..**

కలుషిత తాగునీటితో టైఫాయిడ్, గ్యాస్ట్రోఎంటరైటిస్, కామెర్లు తదితర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నీటిలో ప్రమాదకరమైన క్రిములను, అపరిశుభ్రతను దూరం చేసేందుకు శుద్ధజల యంత్రాలను వినియోగించాల్సి ఉంటుంది. అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులకు బాలింతలు, గర్భిణులు శుద్ధజలం అందించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలపై ఉంది. సక్షం పథకంలో భాగంగా నాణ్యమైన యంత్రాలు ఇచ్చినా నిరుపయోగంగా మారాయి.

**ముగింపు దశకు వచ్చినా..**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సక్షం పథకాన్ని 2021లో అమల్లోకి తీసుకు వచ్చింది. ఈ కార్యక్రమం గడువు వచ్చే ఏడాదితో ముగియనుంది. గడువు ముగింపు దశకు వచ్చినా ఇప్పటికీ కనీసం



80 శాతం కేంద్రాల్లో యంత్రాలు పనిచేయక పోవడం గమనార్హం. దీతో లబ్ధిదారులకు సురక్షిత జలం అందని స్థితి నెలకొంది. సక్షం పరిధిలోని రాని కేంద్రాల్లో శుద్ధజలం ఎండమావిగానే మిగిలింది.

ఆళ్లగడ్డ మండలం జి.జంబులదిన్నెలో కేవలం ఒకటిన్నర సెంటు విస్తీర్ణం ఉన్న శిథిల భవనంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. శుద్ధజల యంత్రం, ఆండ్రాయిడ్ టీవీ, ఆట వస్తువులు మంజూరైనా వసతి సరిగా లేకపోవడతో పక్కన పెట్టేశారు.

ఆళ్లగడ్డ మండలం శాంతినగరం, ఉయ్యాలవాడ మండలం తుడుముల దిన్నె, సర్వాయిపల్లె, అల్లూరు, మాయలూరు కేంద్రాలకు యంత్రాలు మంజూరైనా ట్యాంకులు లేకపోవడం, నీటి గొట్టాల కనెక్షన్ పూర్తి లేకపోవడంతో వీటి సేవలు అందడం లేదు. దొర్నిపాడులో మూడు కేంద్రాలు ఉన్నా తాగు నీటి సేవలు అందడం లేదు.

అంగన్‌వాడీ కేంద్రాలు: 3,558
బాలింతలు, గర్భిణుల సంఖ్య: 70,766
చిన్నారులు: 2,33,921
సక్షం కేంద్రాలు: 246

## వృద్ధులంటే చౌక.. బియ్యం ఇవ్వకుండా ధోకా

కర్నూలు: 65 ఏళ్ల వయో వృద్ధులు.. దివ్యాంగులు.. నడవలేని వారికి రేషన్ సరకులు ఇళ్ల వద్దనే పంపిణీ చేయాలని ప్రభుత్వం చెబుతోంది. నెలనెలా డీలర్లు తమ పరిధిలోని వృద్ధుల ఇంటి వద్దకే వెళ్లి వేలిముద్రలు వేయించుకొని బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలర్ల నిర్లక్ష్యం.. అధికారుల ఉదాసీనత కారణంగా ఇది ఎక్కడా అమలు కావడం లేదు. పండుటాకులకు కష్టాలు తప్పడం లేదు. నవంబరు ముగిసినా వీరిలో సగం మందికే రేషన్ పంపిణీ చేశారు. డిసెంబరు 1 నుంచి సాధారణ రేషన్ పంపిణీ మొదలైనా తమను మాత్రం పట్టించుకోవడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,437 చౌకదుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 65 ఏళ్లు దాటిన వయోవృద్ధులు, దివ్యాంగులైన కార్డుదారులు 1,02,015 మంది ఉన్నారు.

వీరికి ప్రతినెలా 25 నుంచి నెలాఖరు వరకు ఇంటి వద్దే సరకులు పంపిణీ చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో ఇది సవ్యంగా అమలు కావడం లేదు. డిసెంబరు 2వ తేదీ నాటికి ఉమ్మడి జిల్లాలో 58,278 మందికి మాత్రమే రేషన్ పంపిణీ చేశారు. 43,737 మందికి ఇప్పటికీ ఇవ్వలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీంతో గత్యంతరం లేక వృద్ధులే చౌకదుకాణాలకు వెళ్లి సరకులు తెచ్చుకుంటున్నారు.

నగదు అంటగడుతున్నారు



అధికారుల పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో డీలర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నెల గడిచిపోయినా వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ ఇవ్వకుండా.. బియ్యానికి బదులు నగదు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

చాలామంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి బయోమెట్రిక్ తీసుకొని కిలోకు రూ.10 చొప్పున డబ్బులు ఇస్తున్నారు. మాకు డబ్బు వద్దు బియ్యమే కావాలంటే మాత్రం చౌకదుకాణాల వద్దకు రావాలని చెబుతున్నట్లు వృద్ధులు వాపోతున్నారు. కొందరు డీలర్లు ఒకటో తేదీ తర్వాతనే చౌకదుకాణాల వద్ద సరకులు పంపిణీ చేస్తున్నారు. అదీ రెండ్రోజులే. తర్వాత వెళ్తే బియ్యం అయిపోయాయని తిప్పి పంపుతున్నారు. వారికి రాజకీయ నేపథ్యం ఉండటంతో అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. సాయిబాబా సంజీవయ్య నగర్‌కు చెందిన ఈ వృద్ధురాలి పేరు లక్ష్మీదేవమ్మ. రేషన్ కార్డులో ఈమె ఒక్కరే ఉన్నారు. ఒక్కనెల కూడా డీలరు తమ ఇంటి వద్దకు వచ్చి సరకులు ఇచ్చింది లేదని ఈమె చెబుతున్నారు. బియ్యం తెచ్చుకునేందుకు ఈమె అష్టకష్టాలు పడుతూ.. పాత సాయిబాబా థియేటర్ సమీపంలోని 87వ చౌకదుకాణానికి వెళ్లారు. ఈ-పోస్ యంత్రంలో వేలిముద్రలు వేశారు. ఈమెకు 5 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉంది. డీలరు మాత్రం బియ్యం లేవని చెప్పారని.. బియ్యానికి బదులుగా రూ.50 చేతికిచ్చారని ఈమె చెబుతున్నారు. అంతదూరం నుంచి ఉసూరుమంటూ తిరుగుముఖం పట్టారు.

చురకలు



# హస్తకళ గ్రామానికి ఊపిరి

శ్రీకాళహస్తి : హస్తకళలకు కాణాచిగా ప్రసిద్ధి చెందిన శ్రీకాళహస్తి కేంద్రంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హస్తకళ గ్రామం (క్రాఫ్ట్ విలేజ్) ఏర్పాటుకు శ్రీకారం చుట్టాయి. వైకాపా హయాంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కేంద్రం నుంచి నిధులు సమకూరినా, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా ఇవ్వాల్సిన నిధులు ఇవ్వని కారణంగా పనులు ప్రారంభించిన ఏడాదిన్నరకే ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఆగిపోయాయి.శ్రీకాళహస్తి కలంకారీతో పాటు ఇక్కడి కొయ్యబొమ్మలకు గుర్తింపు ఉంది. ఏర్పేడులోని మాధవమాల, పాపానాయుడుపేట, కేవీబీపురంలోని కర్లపూడి, బీఎన్‌కండ్రిగలోని పల్లమాలతో పాటు తిరుపతి గ్రామీణ ప్రాంతాల్లో వెదురుతో చేసే వస్తువులకు డిమాండ్ ఉంది. చేనేత వస్త్రాలకు గుర్తింపు లభిస్తోంది. పర్యాటకుల ఆసక్తికి తగ్గట్టుగా హస్తకళల గ్రామం (క్రాఫ్ట్ విలేజ్) ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**'కూటమి' నిర్ణయంతో ఆశలు:** హస్తకళా గ్రామాన్ని అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించడంతో కళాకారుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్ర హస్తకళాభివృద్ధి సంస్థ ఛైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ ఇటీవల ఇక్కడి పనులు పరిశీలించారు. నిర్ణీత వ్యవధిలోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు చేశారు. 30 రెసిడెన్షియల్



వర్క్‌షాప్‌లు, ఉత్పత్తుల విక్రయాలకు 130 ఎంపోరియాలను అభివృద్ధి చేస్తున్నట్లు కళాకారులకు హామీ ఇచ్చారు. ఆడియో విజువల్ గది, శిక్షణ గదులతో పాటు పర్యాటకులు, హస్తకళాప్రియుల కోసం ఫుడ్‌కోర్టు తదితర వసతులు అందుబాటులోకి తేనున్నట్లు వెల్లడించారు.

ప్రాజెక్టు: హస్తకళ గ్రామం
మంజూరైన నిధులు: రూ.9.25 కోట్లు
భవన నిర్మాణాలకు: రూ.7.55 కోట్లు
తొలి విడత కేటాయింపు: రూ.4.77 కోట్లు
ప్రాజెక్టు పరిధిలోని కళాకారులు: 10 వేల మందికిపైనే

# తూర్పు తీరం.. రక్షణ కవచం

సింధియా : దాయాది దేశం పాకిస్థాన్‌కు చెందిన పీఎన్ఎస్ ఘాజీ (జలాంతర్గామి)పై 1971లో భారత నౌకాదళం వ్యూహాత్మకంగా దాడిచేసి విజయ బావుటాను ఎగరేయడంతో ఏటా డిసెంబరు 4న భారత ప్రభుత్వం 'నౌకాదళ దినోత్సవం' జరుపుకోవడం ఆనవాయితీ.

**విశాఖలో ఉత్సవాలు ఇలా..:** పదేళ్ల కిందటి వరకు ఏటా నవంబరు ఆఖరి గురు, శుక్ర, శని, ఆదివారాల్లో విశాఖలోని పైపులైను జంక్షన్ వద్ద పెద్దఎత్తున 'నేవీ మేళా'ను నిర్వహించేవారు. ఈ మేళాలో యుద్ధనౌకలు, క్షిపణులు, టార్పెడోలు, జలాంతర్గాముల నమూనాలను ప్రదర్శించేవారు. ఐఎన్ఎస్ శాతవాహన మైదానంలో హెలికాప్టర్, తదితర విన్యాసాలు ఉండేవి. అలాగే శుక్ర, శని, ఆదివారాల్లో నేవల్‌డాక్‌యార్డులో జెట్టీల వద్ద యుద్ధనౌకల సందర్శనకు నగర పౌరులను అనుమతించేవారు.

నవంబరు ఆఖరు, డిసెంబరు ఒకటి నుంచి కూడా ఆర్కేబీచ్ వద్ద భారత నేవీ యుద్ధనౌకలు, ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సిబ్బంది కవాతు, విన్యాసాలను మూడు రోజుల పాటు ప్రదర్శించి నాలుగో రోజు (డిసెంబరు 4న) తీరంలో ఎంతో అట్టహాసంగా వేడుక జరిపేవారు. ఈ వేడుకల్లో అతిథులకు సైనిక వందనం చేసేవారు.

కొవిడ్ తర్వాత కొంత విరామం వచ్చింది. గత ఏడాది ఒడిశాలోని



పూరీ తీరాన నేవీ డే వేడుకలు జరపగా.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది కేరళలోని తిరువనంతపురం తీరంలో ఉత్సవాలు జరుపుతుండటం విశేషం. **జాతికి అంకితం:** ప్రపంచస్థాయిలో శత్రుదేశాల నుంచి తలెత్తే ఎలాంటి ముప్పునైనా అలవోకగా ఎదుర్కొనేలా భారత నేవీ తన శక్తి సామర్థ్యాన్ని ఏటికేడాది పెంచుకుంటోంది. ఏడాదికాలంలో 12 యుద్ధనౌకలను జాతికి అంకితం చేసి రక్షణ సేవల్లోకి తీసుకున్నారు. వీటిలో ఉదయగిరి, హిమగిరి వంటి ప్రతిష్ఠాత్మక నౌకలు ఉండటం విశేషం. అలాగే వార్‌షిప్ డిజైన్ బ్యూరో ద్వారా అభివృద్ధి చేసిన నౌకగా ఉదయగిరి పేరుగాంచింది. **రాంబిల్లిలో :** ఇప్పుడు ఉన్న విశాఖ పాత బేస్‌కు అనుసంధానంగా విశాఖపట్నానికి 40 కి.మీ.దూరంలోని రాంబిల్లిలో అత్యంత ఆధునిక భద్రతతో కూడిన ఐ.ఎన్.ఎస్. వర్ష స్థావర నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. త్వరలో సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇది జలాంతర్గాముల స్థావరంగా పనిచేయనుంది.

# నిబంధనలకు పరదా!

అనకాపల్లి : ఎలమంచిలి పట్టణంలో ఏర్పాటు చేసిన రెండో బార్ వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. జిల్లా అధికారులే తెరవెనుక ఉండి మద్యం దుకాణాల యజమానుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేసి ఇక్కడ బార్ పెట్టించారని ఇప్పటికే వివాదం రేగింది. ఈ బార్ ఏర్పాటే కాదు.. నిర్వహిస్తున్న తీరూ వివాదాస్పదంగా ఉంది. నిబంధనలకు నీళ్లొదిలేసి.. చుట్టూ పరదాలు కట్టి, పక్కనే ఉన్న ఓ చిన్న రేకుల షెడ్‌లో నడిపిస్తున్నారు.రాంబిల్లి మండలం నారాయణపురంలో దీనిని తాత్కాలిక లైసెన్స్‌తో సెప్టెంబర్ 27న బార్ పెట్టారు. నవంబరు 8న అక్కడ మూసివేసి నాలుగు రోజుల తరువాత ఎలమంచిలి పాత పెంకులమిల్లు ప్రాంతానికి మార్చారు. అప్పటి నుంచి ఇక్కడ చిన్న షెడ్డులో నడుపుతున్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం.. బార్ నిర్వహణకు 150 చదరపు మీటర్ల విస్తీర్ణంలో పక్కా భవనం ఉండాలి. ఇక్కడ మరుగుదొడ్లు, కూర్చోవడానికి కుర్చీలు బల్లలు ఏర్పాటు చేయాలి. సీసీ కెమెరాలు ఉండాలి. కానీ.. ఇక్కడ ఇవేవీ పాటించడంలేదు. కేవలం చిన్న షెడ్ తప్పితే.. ఎటువంటి వసతులూ లేవు. ఖాళీ ప్రదేశంలో పరదా కట్టి దాన్నే బారుగా చూపిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే చందాన ఇక్కడ పరిస్థితులు ఉన్నాయి. ఆరుబయట తాగుతున్నారని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు అయినా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయమై స్థానిక ఎక్సైజ్ ఇన్‌ఛార్జి సీఐ రాజారావును వివరణ కోరగా తాత్కాలిక లైసెన్స్‌తో ఇక్కడ బార్ పెట్టారన్నారు. దీనికి నిబంధనలు వర్తించవన్నారు.ఈ బార్ ఏర్పాటుకు తమ నుంచి డబ్బులు వసూలు చేశారంటూ వ్యాపారులు ఉన్నతాధికారులకు ఇప్పటికే ఫిర్యాదు చేశారు. ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్, సీఐ జ్ఞానేశ్వరిని విజయవాడ కమిషనర్ కార్యాలయానికి రమ్మని ఆదేశించారు.

# నకిలీ పత్రాలతో.. ఇళ్ల పట్టాలు



గుత్తి : గుత్తిలో నకిలీ ఇళ్ల పట్టాల దందా యథేచ్ఛగా సాగుతోంది. కొందరు నాయకులకు అనుచరులుగా ఉంటూ అక్రమ మార్గంలో సొమ్ము చేసుకుంటున్నారు. నకిలీ సృష్టిస్తూ... ఒక్కో పట్టాకు రూ.10వేల నుంచి 15 వేలు దండుకుంటున్నారు. ఇక్కడ పనిచేసి మరోప్రాంతానికి బదిలీ అయిన అధికారులతోపాటు మృతుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారు. దీంతో రూ.కోట్లు విలువైన ప్రభుత్వ స్థలాలను సొంతం చేసుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఈనేపథ్యంలో నిజమైన పట్టాలు ఉన్నవారితోపాటు నకిలీవి ఉన్నవారు కూడా దరఖాస్తు చేసుకుంటున్నారు. గుత్తిలోనే సుమారు వెయ్యి నకిలీ పట్టాలు ఉన్నట్లు అంచనా. పట్టణానికి చెందిన నలుగురు నకిలీ పట్టాల దందాను నడిపిస్తున్నారు. పట్టణంలోని చెర్లోపల్లికాలనీలో ఓ వైకాపా నాయకుడు రూ.లక్షలు విలువైన సుమారు 10 సెంట్ల స్థలానికి నకిలీ పట్టాలతో ఇళ్ల మంజూరుకు దరఖాస్తు చేసుకున్నాడు.

సర్వే నంబరు 609లో ప్రభుత్వం పదేళ్ల కిందట పేదలకు ఇళ్ల పట్టాలను మంజూరు చేసింది. అనేక మంది స్థలాలను ఆక్రమించి నివాసాలను ఏర్పాటు చేసుకుని పట్టాల కోసం నిరీక్షిస్తుండగా... ఓ నాయకుడు వారి నుంచి డబ్బు వసూలు చేసి నకిలీ పట్టాలు అంటగట్టాడు.

జెండాగేరిలో ఇద్దరు ఓ స్థలం తమదంటే తమదని పోటీపడుతున్నారు. అందులో ఒక దళారీ ద్వారా నకిలీ పట్టాను సృష్టించుకున్నాడు. దీంతో ఇరు వర్గాల వారు పరస్పరం దాడులకు పాల్పడ్డారు.

ఓ ప్రజాప్రతినిధి సమీప బంధువు నేమితాబాదు రోడ్డులో రెండు ఎకరాల అసైన్డ్ భూమిలో ప్లాట్లు వేసి... ప్రజలకు విక్రయించి, నకిలీ పట్టాలు ఇచ్చి సొమ్ము చేసుకున్నాడు.

ఓ మాజీ ప్రజాప్రతినిధి కుమారుడు గుత్తిలోని ధోబీఘాట్ స్థలంలో 80 మందికి నకిలీ పట్టాలు తయారు చేయించి ఇచ్చాడు. పాత ఇళ్లకు పట్టాలు లేకపోవడంతో అనేక మంది దళారుల ద్వారా వాటిని తీసుకున్నారు. నకిలీవని వారికి తెలియదు.

ఇదిలా ఉండగా కొత్తగా ప్రభుత్వం 250 ఇళ్లను మంజూరు చేసింది. గృహ నిర్మాణానికి నకిలీ పట్టాలు పుట్టుకొస్తున్నాయి. పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వాలని గృహనిర్మాణశాఖ అధికారులు చెబుతుండటంతో నకిలీ పట్టాలకు సొమ్ములిచ్చిన వారు లబోదిబోమంటున్నారు. కొందరు రెవెన్యూ ఉద్యోగులు దళారీల అవతారం ఎత్తి కార్యాలయానికి వచ్చే ప్రజలతో సమాచారం సేకరిస్తూ నకిలీ పట్టాలను జారీ చేస్తున్నారు.

**అక్రమంగా రిజిస్ట్రేషన్లు...**

నకిలీ పట్టాలతో చాలా మంది తమ ఆధీనంలో ఉన్న నివేశన స్థలాలు, ఇళ్లను రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఈ వ్యవహారంలో కొందరు వీఆర్వోలు ప్రజల నుంచి రూ.వేలల్లో లంచాలు తీసుకుంటూ స్థల ధ్రువీకరణపత్రాలు జారీ చేస్తున్నారు. వాటిని ఆధారం చేసుకుంటూ అధికారులు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు.

**పొజిషన్ సర్టిఫికెట్లు తీసుకుంటున్నాం**

–సూర్యనారాయణ, ఏఈఈ, గృహనిర్మాణశాఖ

తాము పట్టాలు తీసుకోవడంలేదు. స్థలాలు తమ ఆధీనంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులతో పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని ప్రజలకు సూచిస్తున్నాం. నకిలీ పట్టాల ఆటకట్టించేందుకే ధ్రువీకరణపత్రాలు కోరుతున్నాం. వాస్తవ పట్టాలను పరిశీలించి.. తీసుకుంటున్నాం.

# కొనుగోళ్లు లేక.. వేదన తీరక!



కళ్యాణదుర్గం : ఖరీఫ్‌లో రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టి.. ఆరుగాలం శ్రమించి పండించిన కంది పంట దిగుబడులు తీరా చేతికొచ్చేసరికి తుపాను ప్రభావం అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తోంది. ముసురుతోపాటు చిరుజల్లులు కారణంగా పంటను రక్షించుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ఇప్పటికే చేతికొచ్చిన పంటను కొందరు కల్లాలు.. మరికొందరు రహదారులపైన ఆరబోసుకొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,37,500 ఎకరాల్లో కంది సాగైంది. ఇప్పటికే పలు ప్రాంతాల్లో పంట చేతికొచ్చినా.. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్షకుల పరిస్థితి దయనీయంగా మారింది. చేసేదేమి లేక పంటను దళారులకు అమ్ముకోవాల్సి వస్తోందని, కనీసం పెట్టుబడి వ్యయం కూడా దక్కని దుస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**దళారులకు తెగమ్ముకోవాల్సిందే...**

– చంద్రశేఖర్‌రెడ్డి, బోరంపల్లి

పదకొండు ఎకరాల్లో పంట సాగుకు రూ.1.70 లక్షలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. గతంలో ఎకరాకు ఐదు క్వింటాళ్ల దిగుబడి వచ్చేవి. ప్రస్తుతం రెండు క్వింటాళ్లకు పడిపోయింది. చిరుజల్లులు పడుతున్నాయి. పంటను రక్షించుకోలేకపోతున్నాం. బళ్లారి మార్కెట్‌కు తరలిస్తే దళారి కమీషన్, రవాణా ఖర్చులు పోతే మిగిలేది ఏమీ ఉండదు.

**రోడ్డుపైనే ఆరబోస్తున్నాం**

– చిన్నమారెన్న, గోళ్ల

చేతికొచ్చిన అరకొర పంటను రోజుల తరబడి రోడ్లపైనే ఆరబోస్తున్నాం. ఐదు ఎకరాలు సొంత పొలంలో, ఆరున్నర ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. మొత్తంగా 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేయలేదు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు చేయాలి.

**ఆదేశాలు రాగానే ఏర్పాటు చేస్తాం**

– పెన్నేశ్వరి, మేనేజరు, జిల్లా మార్క్‌ఫెడ్

కంది కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో పంట చేతికొస్తోంది. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే క్వింటాలు ధర రూ.8 వేలకు కొనుగోలు చేస్తాం.

# భూమి పోయింది.. బతుకు వేదనైంది

హిందూపురం : సమస్య పరిశ్రమలొస్తాయి, ఉద్యోగాలొస్తాయి, ఉపాధి లభిస్తుందని కొండంత ఆశలతో తక్కువ ధరకు రైతులు భూములిచ్చారు. దశాబ్దాలు గడిచిపోతున్నా వాటి ఊసేలేదు. సాగు భూములన్నీ బీళ్లుగా మారాయి. భూములు ఇచ్చిన రైతులు ఉపాధి లేక కూలీలుగా వలస బాటపట్టారు.ఎక్కడెక్కడ హిందూపురం నియోజకవర్గం 1984లో 38 మంది రైతుల వద్ద 354 ఎకరాల భూమి, చిలమత్తూరు మండలంలో 2008-09లో 11,352 ఎకరాలు, పరిగి మండలంలో 2006-08లో 2,200 ఎకరాలు.

**అప్పనంగా..** 1984లో ఏపీఐఐసీ తూముకుంట, గోళ్లాపురం, చౌళూరు గ్రామాలకు చెందిన 38 మంది రైతుల వద్ద 354 ఎకరాల భూమిని రూ.45 వేలచొప్పున సేకరించారు. ఆ భూములను అప్పటి ప్రభుత్వం అతి తక్కువ ధరకు రహేజా కంపెనీకి అందజేసింది. 40 ఏళ్లయినా ఒక్క ఇటుక వేసింది లేదు. అప్పనంగా కొనేసి.. ప్రస్తుతం ప్లాట్లుగా మార్చి స్థిరాస్తి వ్యాపారం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.

**ఎన్నో చెప్పారు..**

చిలమత్తూరు మండలం కొడికొండ చెక్‌పోస్టు, గోరంట్ల ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు 2008-09లో 11,352 ఎకరాలు... ఎకరాకు రూ.1.75 లక్షలు చెల్లించి అప్పటి ప్రభుత్వం సేకరించింది. సదరు భూమి లేపాక్షి నాలెడ్జ్‌హబ్‌కు కేటాయించారు. 1.50 లక్షల మందికి ఉపాధి కల్పిస్తామన్నారు. దాని ఊసేలేదు.



పరిగి మండలం శ్రీరంగరాజుపల్లి, పాపిరెడ్డిపల్లి, పరిగి, మడకశిర మండలం కేతేపల్లి, సి కొడిగేపల్లి గ్రామాల్లో రసాయి ప్రాపర్టీస్ వారు భూములిచ్చిన రైతు కుటుంబాల వారికి ఉద్యోగాలు, ఉపాధి కల్పిస్తామని చెప్పి 2006-08లో ఎకరా రూ.30వేల చొప్పున 2,200 ఎకరాలు సేకరించారు. ఇప్పటికీ ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

**గొర్రెల కాపరిగా మారాను**

– నరసింహప్ప, శ్రీరంగరాజపల్లి, పరిగి మండలం

పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి చూపుతామంటే 3.46 ఎకరాల భూమి ఇచ్చాం. 19 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పరిశ్రమలు ఏర్పాటు చేయలేదు. ఉపాధి చూపలేదు. ప్రస్తుతం గొర్రెల కాపరిగా మారి జీవనం సాగిస్తున్నా.

# నర్సీపట్నానికి నాలుగులైన్ల రోడ్డు

నర్సీపట్నం : నర్సీపట్నం పురపాలక సంఘం పరిధిలోని పెదబొడ్డేపల్లి కూడలి నుంచి మాకవరపాలెం మీదుగా కశింకోట మండలం తాళ్లపాలెం వరకు 32 కి.మీ. రోడ్డును జాతీయ రహదారిగా మార్పు చేసి నాలుగు వరసలుగా అభివృద్ధి చేయనున్నారు. దిల్లీకి చెందిన ప్రైవేట్ కన్సల్టెన్సీ బృందం, రోడ్లు భవనాల శాఖ అధికారులు ఇటీవల ఈ రోడ్డును పరిశీలించి వెళ్లారు. సమగ్ర ప్రాజెక్టు నివేదికను త్వరలో కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నారు.

మాకవరపాలెం మండలం పారిశ్రామికంగా విస్తరిస్తోంది. రాచపల్లిలో ఇప్పటికే అల్యూమినియం కర్మాగారం నడుస్తోంది. కాఫీ పరిశ్రమ ఏర్పాటుకు జీసీసీ ఇటీవల భూములు తీసుకుంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు వందల ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. ఎంఎస్ఎంఈ పార్కుకు ఇటీవల సభాపతి అయ్యన్న శంకుస్థాపన చేశారు.

ప్రస్తుతం 7 మీటర్ల వెడల్పు ఉన్న ఈ రోడ్డును 14 మీటర్లకు విస్తరించనున్నారు. 21 చోట్ల కల్వర్టులు నిర్మించాల్సి ఉంటుంది. కొండల అగ్రహారం, తాళ్లపాలెం సంత సమీపంలో వంతెనలను విస్తరిస్తారు.

మాకవరపాలెం మండలం యరకన్నపాలెం నుంచి ఎలమంచిలి మండలాన్ని కలుపుతూ రెండు కొండల మధ్య నుంచి రోడ్డు నిర్మాణానికి



కొద్దిరోజుల కిందట చర్యలు మొదలయ్యాయి. రెవెన్యూ శాఖకు సంబంధించిన భూముల్లో తొలుత పనులు పూర్తి చేసి అనంతరం విస్తరణకు అవసరమైన అటవీ భూమిని సేకరించనున్నారు. ఎలమంచిలి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు సాగించేందుకు ఈ రహదారి ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు విస్తరణ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అల్యూమినియం కర్మాగారం నుంచి తాళ్లపాలెం వరకు రహదారి మరమ్మతుకు కొద్దిరోజుల కిందట పరిశ్రమ యాజమాన్యం రూ.25 లక్షలు కేటాయించింది. కలెక్టర్ నుంచి అనుమతులు రాగానే పనులు ప్రారంభంకానున్నాయి.

# నగరానికే తలమానికం.. హెల్త్ సిటీ!

విశాఖపట్నం: హనుమంతవాక కూడలి నుంచి ముడసర్లోవ రోడ్డు వరకు వరుసగా అన్నీ ఆసుపత్రులే. ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విశాఖ వైద్య విజ్ఞాన సంస్థతోపాటు అనేక ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. అదే చినగదిలి పరిధిలోని హెల్త్ సిటీ. రాష్ట్రంలోనే తొలిసారిగా ఏర్పాటుచేసిన హెల్త్ సిటీ వైద్య పర్యాటకాన్ని ఆకర్షిస్తోంది. రోగులు అత్యాధునిక చికిత్స కోసం బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి నగరాలకు వెళ్లకుండా.. ఇక్కడే అన్నిరకాల శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయి.

వాటిలో ఆర్థోపెడిక్, కీళ్ల మార్పిడి, గుండె, సంతాన సాఫల్య, రోబోటిక్ క్యాన్సర్ సర్జరీలు జరుగుతున్నాయి. ఇక్కడి ఆసుపత్రుల్లో అధునాతన వైద్య పరికరాలతోపాటు అనుభవజ్ఞులైన వైద్య నిపుణులున్నారు.

**2006లో ఏర్పాటు:** ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలందించేందుకు 2006లో చినగదిలిలో హెల్త్‌సిటీ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఐఐసీ) దాదాపు 100 ఎకరాలు కేటాయించింది. ప్రైవేటు ఆసుపత్రులు నెలకొల్పడానికి మార్కెట్ ధర కంటే తక్కువకే స్థలాలు కేటాయించారు.అప్పట్లో ఎకరాకు రూ.2.4 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు తీసుకున్నా రు. ప్రస్తుతం అక్కడ 18 ప్రైవేటు ఆసుపత్రులుండగా.. ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి రోగులు వస్తుంటారు.

**ఫిర్యాదులూ ఉన్నాయ్..**



మెరుగైన వైద్యం అందుతుందనే ఆశతో వెళ్తున్న రోగులను కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు దోచుకుంటున్నాయనే ఫిర్యాదులున్నాయి. శస్త్రచికిత్స చేయించుకుంటే వివిధ రుసుముల పేరిట జేబులు గుల్ల చేస్తున్నాయనే ఆరోపణలున్నాయి. హెల్త్‌సిటీలోని ఆసుపత్రుల్లో మొత్తం ఓపీ సేవల్లో 10 శాతం పేద, దారిద్ర్య రేఖకు దిగువనున్న ప్రజలకు ఉచితంగా సేవలందించాలి.

15 శాతం పడకలు ఉచితంగా పేదలకు చికిత్స అందించేందుకు కేటాయించాలి.ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థులకు ఉచిత చికిత్స అందించాలి. కొన్ని ఆసుపత్రుల్లో ఏపీఐఐసీ విధించిన ఈ నిబంధనలను పట్టించుకోవట్లేదని ఆరోపణలున్నాయి.

# మెదడుకు రక్షణ.. రోగికి సాంత్వన

కర్నూలు : మారిన జీవనశైలి ప్రభావంతో చాలామంది అధిక రక్తపోటు బారినపడుతున్నారు. వీరిలో కొందరికి బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చి మృతి చెందుతున్నారు. మరికొందరు పక్షవాతంతో మంచాన పడుతున్నారు. సకాలంలో వైద్యం అందించగలిగితే వీరిని ప్రాణాపాయం నుంచి రక్షించవచ్చని వైద్యులు చెబుతున్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ ఇస్తే ముప్పు తప్పే అవకాశం ఉంది. రూ.40 వేల విలువైన ఈ సూదిమందును కర్నూలు సర్వజన వైద్యశాలలో ఉచితంగా వేస్తున్నారు. బ్రెయిన్‌స్ట్రోక్ కేసులు పెరుగుతున్న దృష్ట్యా.. జీజీహెచ్‌లో ప్రత్యేకంగా పది పడకలతో న్యూరో ఐసీయూ స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశారు. బ్రెయిన్‌స్ట్రోక్‌తో పక్షవాతం బారినపడిన వారు, మెదడులో కణితులు ఉన్నవారికి ఇక్కడ మెరుగైన చికిత్సలు అందించి ప్రాణాలు కాపాడుతున్నారు.

**4.30 గంటల్లోపు తీసుకొస్తే..**బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిన వారిని వెంటనే సర్వజన వైద్యశాలలోని అత్యవసర విభాగం లేదా న్యూరో ఫిజీషియన్ విభాగంలో చేర్చాలి. వైద్యులు సీటీ స్కాన్ తీస్తారు.మెదడులో రక్తం గడ్డ కట్టి ఉంటే కుటుంబ సభ్యుల అనుమతితో టెనెక్టెప్లేస్ సూదిమందు వేస్తారు. బయట దీని ఖరీదు రూ.40 వేల వరకు ఉంటుంది. స్ట్రోక్ వచ్చిన తర్వాత 4.30 గంటల్లోపు దీన్ని వేయాలి.

చాలామంది బాధితులను మొదట ప్రైవేటు ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారు. అక్కడ రూ.20- 30 వేలు ఖర్చయ్యాక.. ఆపై ఖర్చు భరించలేని పేదలు సర్వజన ఆసుపత్రికి తీసుకొస్తున్నారు. ఆలస్యం కావడం వల్ల టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్ వేయలేని పరిస్థితని వైద్యులు చెబుతున్నారు.**సకాలంలో వస్తేనే**ఉమ్మడి జిల్లా నుంచి జీజీహెచ్‌కు ప్రతినెలా 50 వరకు బ్రెయిన్ స్ట్రోక్స్ కేసులు వస్తున్నాయి. చాలామంది స్ట్రోక్ వచ్చిన చాలా గంటలు గడిచాక.. లేదా మరుసటి రోజు తీసుకొస్తున్నారు. దీంతో ఇంజెక్షన్ అందుబాటులో ఉన్నా వేయలేని పరిస్థితి. టెనెక్టెప్లేస్ సూదిమందును అందరికీ వేయరు. వైద్య పరీక్షలు చేసి.. రోగి దృఢంగా ఉండి.. రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటేనే వేయాల్సి ఉంటుంది.డాక్టర్ శ్రీనివాసులు, న్యూరో విభాగాధిపతి

# బాలికా విద్యాలయాలు.. సమస్యల లోగిళ్లు

కర్నూలు : విద్యా బోధన.. ఫలితాల సాధనలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ముందుంటున్నాయి. దీంతో వీటిలో తమ కుమార్తెలను చేర్పించేందుకు చాలామంది తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. పోటీ పెరగడంతో వీటిలో సీటు కోసం సర్పంచి నుంచి ఎమ్మెల్యే, మంత్రుల వరకు సిఫార్సు చేయిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇంత ప్రాధాన్యమున్న కేజీబీవీల్లో సమస్యలు తిష్టవేశాయి. విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ఉండటంతో పాటు సిబ్బంది మధ్య సఖ్యత లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనికితోడు వసతుల కొరత వేధిస్తోంది. జిల్లా పర్యటనకు వచ్చిన కేజీబీవీ రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి 26 కేజీబీవీల ఎస్వోలతో మంగళవారం సమావేశమయ్యారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను వారు ఆయన ఎదుట ఏకరువుపెట్టారు. కేజీబీవీల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆయన డీఈవో శామ్యూల్‌పాల్, జీసీడీవోను ఆదేశించారు.

**ఎస్వోలు చెప్పిన సమస్యలు**

చాలా మండలాల్లోని కేజీబీవీలకు ప్రహరీలు లేవు. మురుగునీరు బయటికి వెళ్లే మార్గం లేదు. దీంతో విద్యాలయాల ఆవరణలోనే మురుగు నిలిచి దుర్వాసన వస్తోందని ఎస్వోలు డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పంచలింగాల, కోసిగి, కౌతాళం, మద్దికెర, నందవరం, మంత్రాలయం కేజీబీవీల్లో బోరు ఉన్నప్పటికీ సరిపడ నీళ్లు అందడం



లేదు. పంచలింగాల కేజీబీవీకి చెందిన విద్యుత్తు నియంత్రిక నుంచి బయటి వ్యక్తులు కనెక్షన్ తీసుకున్నారు. దీంతో బడిలో ఉన్న ఫ్యాన్లు, బల్బులు తరచూ పాడవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్ సమస్యలు తలెత్తుతున్నాయి. కోసిగి కేజీబీవీలోనూ విద్యుత్తు సమస్య నెలకొంది. కోడుమూరు, కృష్ణగిరి కేజీబీవీలకు ఏఎన్ఎం లేక బయట ఉన్న వైద్యులను సంప్రదించాల్సి వస్తోంది.

జిల్లాలోని 26 కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది పూర్తిస్థాయిలో లేరు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎస్వోలు వివరించారు.

**ఆటలకు చోటేదీ..?** విద్యార్థినులను చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం చెబుతోంది. కస్తూర్బా విద్యాలయాలకు క్రీడా మైదానాలు లేక బాలికలు ఇబ్బందులు పడుతున్నారు. కేజీబీవీలో ఉన్న హాల్‌లోనే క్రీడల్లో శిక్షణ తీసుకుంటున్నారు. అరకొర వసతుల మధ్య తీసుకున్న శిక్షణతోనే రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. వీరికి క్రీడా ప్రాంగణాలు అందుబాటులోకి తేవడంతో పాటు అవసరమైన పరికరాలు సమకూర్చాల్సిన అవసరం ఉంది.

# చెమ్మగించేను

కోవెలకుంట్ల: రబీ సీజన్ ప్రారంభమై నెల రోజులైనా శనగ సాగు అంతంతమాత్రంగానే ఉంది. భారీ వర్షాలు కురవడం.. భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండటంతో విత్తు వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఈనెల 15వ తేదీతో గడువు ముగియనుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో రైతులు శనగ ఎక్కువగా సాగు చేస్తుంటారు. సాధారణ విస్తీర్ణం 1.55 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది 1,28,137 ఎకరాల్లో వేశారు. ఈ ఏడాది 1,43,247 ఎకరాలు సాగవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇందులో భాగంగా రాయితీపై 12 వేల క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. ఒక్క కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో లక్ష ఎకరాల్లో శనగ సాగవుతుందని అంచనా వేశారు. ఇందులో భాగంగా 7,900 క్వింటాళ్ల విత్తనం అందించారు.

**సీజన్ ప్రారంభం నుంచి..**

ఈ ఏడాది రబీ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు పడుతూనే



ఉన్నాయి. భారీ వర్షాల నేపథ్యంలో కొన్నిచోట్ల విత్తనాలు కొట్టుకుపోగా.. మరికొన్ని ప్రాంతాల్లో అరకొరగా మొలకలు వచ్చాయి. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. తుపాను ప్రభావంతో జిల్లాలో 20 వేల ఎకరాల్లో మొలక దశలో ఉన్న శనగ దెబ్బతిందని అధికారుల ప్రాథమిక అంచనా. 'ఈ ఏడు రబీ ప్రారంభమైనప్పటి నుంచి వర్షాలు కురుస్తూనే ఉండటంతో శనగ సాగుకు ఇబ్బందిగా మారింది. ప్రత్యామ్నాయంగా తక్కువ కాలపరిమితి ఉన్న మినుము, కొర్ర, పెసర, కుసుమ, ఆవాలు, పొద్దుతిరుగుడు వంటి పంటలు సాగు చేయొచ్చు' అని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ చెప్పారు.

# ఇంటి వద్దే కొలువు.. ఆసక్తి ఉంటే రండి..

భీమవరం : పకం: కౌశలం ఉద్దేశం: యువతకు విద్యార్హత ఆధారంగా ఇంటి వద్దే ఉపాధి కల్పిస్తారు. ఇందుకు చేపట్టిన కౌశలం సర్వేలో ఉమ్మడి జిల్లాలో 2,03,329 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 1,49,029 మంది వివరాలను పరిశీలించారు. వీరిలో ఆసక్తి చూపిన వారు విద్యార్హత ధ్రువపత్రాల పరిశీలనకు ముందుకొచ్చారు. నైపుణ్య శిక్షణ 18 ఏళ్లు పైబడి, పదో తరగతి, ఆపై విద్యార్హతలున్న వారు సర్వేలో తమ వివరాలు అందజేశారు. వీరిలో ఐటీఐ, డిప్లొమా, గ్రాడ్యుయేషన్, పోస్టుగ్రాడ్యుయేషన్, పీజీ డిప్లొమా, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారు ఉన్నారు. వీరి విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలను పరీక్ష ద్వారా తెలుసుకుని అవసరమైన వారికి నైపుణ్య శిక్షణ ఇస్తారు. తర్వాత ఇంటి నుంచే ఆదాయం పొందేలా ఉపాధి కల్పిస్తారు. నమూనా పరీక్ష ఈ నెల 10, 11 తేదీల్లో సచివాలయాల్లో కౌశలం మాక్ టెస్ట్ పెట్టినట్లు జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి తెలిపారు.

# కిట్టు ఉంటే ఒట్టు



చిత్తూరు : ప్రమాదాల తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆర్టీసీ బస్సుల్లో అత్యవసర ఏర్పాట్లు కరవయ్యాయి. ప్రధానంగా ప్రథమ చికిత్స కిట్లు లేకపోవడం విడ్డూరంగా ఉంది. కొన్ని బస్సుల్లో పెట్టెలున్నా మందుల్లేవు. మరికొన్నింట్లో పెట్టెలే లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరుగుతున్న బస్సు ప్రమాదాలు కలవరపెడుతున్నాయి.

జిల్లాలోని ఆర్టీసీ 11 డిపోల పరిధిలో సుమారు 855 బస్సులు ఉన్నాయి. రోజూ లక్ష నుంచి 1.20 లక్షల మంది ప్రయాణికులు వివిధ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. ఆయా బస్సుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రయాణికులకు సూచించే విధంగా బస్సులో ప్రథమ చికిత్స పరికరాలు (ఫస్ట్ ఎయిడ్ కిట్) ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ జిల్లాలోని ఒక్క బస్సులోనూ కనిపించడం లేదు. కొన్ని బస్సుల్లో పరికరాలను ఉంచే డబ్బాలు ఖాళీగా దర్శనమిస్తుండగా, మరికొన్ని బస్సుల్లో కనీసం ఆ డబ్బాలు కూడా కనిపించకపోవడం విచారకరం. ప్రధానంగా భక్తులు రాకపోకలు సాగించే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో (తిరుమల ఘాట్ రోడ్డు), చెన్నై, బెంగళూరు అంతర్రాష్ట్ర సర్వీసులైన ఏసీ వోల్వో బస్సుల్లోనూ లేకపోవడంపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

ప్రతి బస్సులోనూ ఫస్ట్ ఎయిడ్ కిట్ పెట్టెలు ఉంటూ.. అందులో కాటన్ బ్యాండేజీ, దూది, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, టించర్, యాంటీసెప్టిక్ క్రీం వంటివి ఉండాల్సి ఉంది. అయితే.. పల్లెవెలుగు మొదలు దూరప్రయాణం చేసే ఇంద్రా బస్సుల వరకు కిట్లు ఉండటం లేదు.

జిల్లాలోని డిపోలు : చిత్తూరు-1,2, పలమనేరు, పుంగనూరు, కుప్పం

ప్రయాణికులు: నెలకు 46 లక్షలమంది, ఆదాయం రూ.20 కోట్లు

ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బస్సు ప్రమాదాలు మొత్తం : 32, మరణాలు : 18, క్షతగాత్రులు : 67

కిట్‌లో ఉండాల్సినవి కాటన్ బ్యాండేజీ, దూది, వాటర్ ప్రూఫ్ ప్లాస్టర్, టించర్, యాంటీసెప్టిక్ క్రీం వంటివి

మొత్తం బస్సులు- 452 (ఆర్టీసీ 381, అద్దెవి 71)

**వారం రోజుల్లో ఏర్పాటు చేస్తాం**

ప్రతిబస్సులో ప్రథమ చికిత్స పరికరాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ, ఆర్టీసీ ప్రధాన కార్యాలయ ఉన్నతాధికారుల ఆదేశాలిచ్చారు. వాటికి అనుగుణంగా జిల్లాలో చర్యలు చేపడుతున్నాం. సంస్థ, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వారం రోజుల్లో అన్ని బస్సుల్లో ఏర్పాటు చేస్తాం. జగదీష్, జిల్లా ప్రజారవాణాధికారి

# ఉపాధిలో ప్రధాన 'భూమి'క!



విశాఖపట్నం : ఇంటికో పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దాలని, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో దశల వారీగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) పార్కులు, ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్ఎఫ్‌సీ)లను అభివృద్ధి చేయనున్నారు.

భూములు అందుబాటులో ఉన్న చోట పారిశ్రామిక పార్కుగా, తక్కువ భూమి ఉంటే ఎఫ్ఎఫ్‌సీగా నిర్మిస్తున్నారు. గాజువాక నియోజకవర్గం లోని పెదగంట్యాడలో నిర్మించిన ఎఫ్ఎఫ్‌సీని తాజాగా ప్రారంభించారు. విశాఖ పశ్చిమం, పెందుర్తి నియోజకవర్గాల్లో ఎఫ్ఎఫ్‌సీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయా పార్కుల్లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో..** 1. 70 శాతం కేంద్ర ప్రభుత్వం, 30 శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో వీటి నిర్మాణం చేపట్టనున్నారు. ఆయా పార్కుల్లో అభివృద్ధి చేసిన దుకాణాలను అద్దె ప్రాతిపదికన కేటాయించనున్నారు. 2. ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే పార్కులకు ప్రోత్సాహకాలు అందిస్తుంది. ఇవి అందుబాటులోకి వస్తే.. పెట్టుబడులు రావడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. చిన్న పరిశ్రమల నిర్వాహకులపై పెట్టుబడి భారాన్ని తగ్గించేందుకు ప్లగ్ అండ్ ప్లే విధానంలో మౌలిక సదుపాయాలు కల్పించ నున్నారు. 3. వెంకటాపురం, ముడసర్లోవలో ఎఫ్ఎఫ్‌సీలు మరో ఆరు నెలల్లో అందుబాటులోకి రావొచ్చు. విశాఖ ఉత్తరం, దక్షిణ నియోజకవర్గాల్లో ఏర్పాటుకు స్థలాలు గుర్తించే పనిలో ఉన్నారు.

4. 'పెదగంట్యాడ ఎఫ్ఎఫ్‌సీలో మొత్తం 29 దుకాణాలను నిర్మించాం. వాటి వివరాలను ఏపీఐఐసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తాం. అవసరమైనవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి కేటాయిస్తాం' అని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సింహాచలం తెలిపారు.

'భీమిలి'లో రెండు నెలల్లో..: భీమిలి నియోజకవర్గం పద్మనాభం మండలం కృష్ణాపురంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటుకు 63 ఎకరాలు ఎంపిక చేశారు. రూ.12.4 కోట్లతో పనులను ఈ ఏడాది మేలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి విడతగా 23.72 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నారు. 12.83 ఎకరాల్లో 163 ప్లాట్లు, మిగిలిన స్థలాన్ని రోడ్లు, పార్కింగ్, ఇతర సదుపాయాలకు కేటాయించనున్నారు. ప్రస్తుతం రోడ్లు, డ్రైనేజీ పనులు జరుగుతున్నాయి. రెండు నెలల్లో అందుబాటులోకి రావొచ్చు.

# చలితో చిన్నారులకు చేటు



అనకాపల్లి : అనకాపల్లికి చెందిన 11 ఏళ్ల బాలుడు శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడు. నడుస్తుంటే ఆయాసం వస్తోంది. మందులు వాడి తల్లిదండ్రులు మిన్నకుండిపోయారు. కొద్ది రోజులకు జ్వరం రావడంతో ఆసుపత్రిలో చేర్చారు. పరీక్షించగా న్యుమోనియా అని తేలింది. కశింకోటకు చెందిన ఓ వ్యక్తి సిగరెట్లు ఎక్కువగా కాలుస్తున్నాడు. ఇతనికి తరచూ దగ్గు వస్తుండేది. నిర్లక్ష్యం చేయడంతో ఊపిరితిత్తులు దెబ్బతిని న్యుమోనియా బారిన పడ్డాడు. మార్టూరుకు చెందిన మహిళకు న్యుమోనియా సోకింది. క్రషర్ బుగ్గి, వాతావరణ కాలుష్యంతో పలువురు అనారోగ్యానికి గురవుతున్నారని పరిశీలనలో తేలింది. చలికాలంలో చిన్నారులు తరచూ జలుబు, దగ్గుతో బాధపడుతుంటారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుంటారు. ఈ సీజన్‌లో అప్రమత్తంగా లేకుంటే చిన్నారులు న్యుమోనియా గురయ్యే ప్రమాదముంది. గతేడాది జిల్లాలో 160 మంది ఈ వ్యాధి బారిన పడ్డారు. జిల్లా ఆసుపత్రికి వచ్చే రోగుల్లో రోజూ 30 నుంచి 40 మంది తీవ్రమైన దగ్గు, ఆయాసం, ఊరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారే ఉంటున్నారు. ఈ వ్యాధి చిన్నారుల్లో అధికమవడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ఏడాది నవంబరు 12 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సర్వే చేపట్టి రోగులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో 1,20,534 మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఆరు నెలలు, 14 నెలలు, తొమ్మిదేళ్లలోపు వయసున్న చిన్నారులకు ఉచితంగా టీకాలు వేస్తారు. నేటి నుంచి ఇంటింటా సర్వే ప్రారంభంకానుంది. 1,467 మంది ఆశా కార్యకర్తలు ఒక్కొక్కరు తమ పరిధిలోని 1000 నుంచి 1500 ఇళ్లకు వెళ్లి అవగాహన కల్పించనున్నారు. శ్వాస సంబంధ సమస్యలతో బాధపడుతున్న చిన్నారులుంటే వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందిస్తారని డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి చెప్పారు.

కొవిడ్ అనంతరం చాలా మందిలో ఊపిరితిత్తుల సమస్యలు పెరుగుతున్నాయి. ఇది టీబీ, న్యుమోనియాకు దారితీస్తోంది. దగ్గు, ఆయాసం, జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆసుపత్రిలో చికిత్స చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్యం అందించేలా ఆక్సిజన్ ప్లాంట్లను ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచుతున్నాం. 50 ఏళ్లు దాటిన వారంతా ఈ టీకాలు వేయించుకుంటే మేలని జిల్లా టీకాల అధికారి డాక్టర్ చంద్రశేఖర్‌దేవ్ పేర్కొన్నారు.

# నిబంధనలు బట్టీంచుకోరు

నంద్యాల : నంద్యాల జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇటుకల బట్టీలను యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్వాహకులు పలువురికి ముడుపులు అందిస్తూ తమ వ్యాపారానికి ఇబ్బందులు లేకుండా చేసుకొంటున్నారు. నంద్యాల పట్టణ పరిధిలోని పొన్నాపురం, అయ్యలూరు మెట్ట, అయ్యలూరు, మహానంది వెళ్లే మార్గంలో అబండతండా వరకు 100కు పైగా ఇటుకల బట్టీలు ఉన్నాయి. వీటిల్లో చాలావాటికి సరైన అనుమతులు లేవు. నంద్యాలతోపాటు వివిధ మండలాల పరిధిలోని పలు గ్రామాల నుంచి మట్టిని అక్రమంగా బట్టీలకు తరలిస్తున్నారు. భూ యజమానుల నుంచి కొంతమేర అనుమతులు తీసుకుని పదింతల మట్టిని తవ్వేస్తున్నారు. కుందూ నది ఒడ్డు, చెరువులు, వంకల నుంచి తవ్వి బట్టీలకు సరఫరా చేస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలు సమృద్ధిగా ఉండటంతో అధికారులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**అధికారులు దృష్టి సారించక..**



నిబంధనల ప్రకారం ముందుగా భూమిని వ్యవసాయం నుంచి వాణిజ్య అవసరాలకు మార్చుకోవాలి. సంబంధిత గ్రామ పంచాయతీకి దరఖాస్తు చేసుకుని అనుమతి తీసుకోవాలి. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకోవాల్సి ఉంటుంది. వాణిజ్య విభాగం కింద విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలి. జల వనరుల శాఖకు దరఖాస్తు చేసుకుని వారి అనుమతి తీసుకోవాలి. రకరకాల నిబంధనలు ఉండటంతో నిర్వాహకులు వీటన్నింటికి తిలోదకాలిచ్చారు. అధికారులు సైతం పట్టించుకోవడం లేదు. వ్యవసాయానికి ఇచ్చే ఉచిత విద్యుత్తునే బట్టీలకు వినియోగిస్తున్నారు. మట్టిని తవ్వేందుకు సంబంధిత శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోవడం లేదు. నంద్యాల సమీపంలోని పెద్దకొట్టాల, అయ్యలూరు, సీతారామాపురం తదితర ప్రాంతాల్లో బట్టీల వద్ద పెద్దఎత్తున మట్టి నిల్వ చేసుకుంటున్నారు. టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో టిప్పరులో 13 క్యూబిక్ మీటర్ల ఎర్రమట్టి పడుతుంది. ఈ నేపథ్యంలో పలు చెరువులు, వివిధ ప్రాంతాల నుంచి తవ్వి తరలిస్తున్నారు.

# ఖర్చు గెలంత.. ఆదాయం కాయంత

తణుకు : అరటి సాగు సంక్షోభంలో పడింది. కార్తీక మాసం వచ్చిందంటే రైతుల కళ్లలో ఆనందానికి హద్దులుండవు. కానీ ఈ సారి పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. మొంథా తుపాను ప్రభావం వల్ల కురిసిన భారీ వర్షాలకుతోడు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు నిలిచిపోవడంతో సరైన గిట్టుబాటు ధర లేక అరటి రైతులు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పచి మార్కెట్‌కు గెలలు తీసుకొచ్చే రైతులకు చేదు అనుభవం ఎదురవుతోంది. మరోవైపు వాతావరణం అనుకూలించక గెలలు తోటల్లో ముగ్గిపోయి పాడవుతున్నాయని.. కనీసం పెట్టుబడులైనా వస్తాయోరావోనని పలువురు రైతులు వాపోతున్నారు. జిల్లాలో సుమారు 2000 ఎకరాల్లో అరటి పంట సాగు చేస్తున్నారు. ఇందులో ఎక్కువ భాగం కర్పూరం రకం పండిస్తున్నారు. తణుకు, పోడూరు, పెనుగొండ, ఆచంట, యలమంచిలి, పాలకొల్లు మండలాల్లో ఎక్కువగా అరటి సాగు చేస్తున్నారు. అనేక గ్రామాల్లో కొబ్బరికి అంతరపంటగా అరటి పండిస్తున్నారు.

పెట్టుబడికి ఆదాయానికి పొంతనే లేదు.. నేను అయిదెకరాల్లో కర్పూర రకం సాగు చేశాను. ఎకరాకు రూ. 80 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఎకరా తోటకు 700 నుంచి 800 వరకూ గెలలు తెగుతాయి. కారణాలేవైనా గిట్టుబాటు ధర లేక గెలకు రూ.100 లోపు మాత్రమే వస్తోంది. దీంతో పెట్టుబడి కూడా రాక నష్టం చవిచూడాల్సి వస్తోంది. కనీసం రూ.200 నుంచి రూ.300కు కొనుగోలు చేస్తేనే రైతులకు ధర ఆశాజనకంగా ఉంటుంది. చిల్లర వర్తకులు మాత్రం హస్తం రూ.40 నుంచి రూ.70 వరకు విక్రయిస్తున్నారు.

**పసుపులేటి రాంబాబు, ముక్కామల, పెరవలి మండలం**

ఎరువులు, కిరాయి ఖర్చులూ రావడం లేదు.. నేను రెండు ఎకరాల్లో కౌలుకు సాగు చేస్తున్నాను. పంట చేతికి రావాలంటే కనీసం నాలుగు సార్లు ఎరువులు వినియోగించాలి. ఈ మేరకు రూ.27,200 ఖర్చవుతుంది. ఎకరాకు కౌలు రూ.35 వేలు చెల్లించాలి. వెదురు ఖర్చు ఉండనే ఉంది. ఇంత మొత్తంలో ఖర్చవుతున్నా సరకు మార్కెట్‌కు తరలిస్తే కిరాయి కూడా రావడం లేదు.

కాకరపర్తి కిరణ్, తాడిపర్రు, ఉండ్రాజవరం మండలం

# డబ్బులిస్తే మీకే ముందు!

ఏలూరు : ప్రైవేటు ఆస్పత్రుల నుంచి వచ్చినా డబ్బులిస్తే ఏలూరు జీజీహెచ్‌లో.. వెనువెంటనే వైద్య పరీక్షల సేవలు అందుతాయనడానికి నిదర్శనాలు ఇవి. మరో పక్క పరీక్షల నుంచి ఫిల్మ్‌లు, రిపోర్టుల వరకు రోజుల తరబడి జీజీహెచ్ రోగులకు జాప్యం జరుగుతున్నా ఆసుపత్రి అధికారులు పట్టించుకోవడం లేదు. సగటున రోజుకు 20-30 ఎమ్మారై, సీటీ స్కాన్లు 50-60 దాకా జీజీహెచ్ వైద్యులు రాస్తారు. వీటికి 2-3 రోజులు ఆగి రావాలని సూచిస్తున్నారు. బాగా అత్యవసరమైతేనే వెంటనే చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రుల రోగులకు ఒక రోజులోనే పరీక్షలు చేసి రిపోర్టులు, ఫిల్ములు చేతికిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఒక్కో ఫిల్మ్‌కు రూ.300 తీసుకుని రోగికి ఇస్తారు. ఏలూరులో రోగి ఫోన్‌లో వీడియో షేర్‌చేస్తున్నారు. ఏలూరుకు చెందిన ఓ యువతి బైకుపై నుంచి పడి తీవ్ర గాయాలుపాలవగా జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. కాలి బొటన వేలు తెగిపోయింది. తలకు గాయమై నెత్తురోడుతోంది. వైద్యులు మెదడుకు సీటీ స్కాన్ చేయించుకుని రావాలని సూచించటంతో చాలాసేపు క్యాజువాల్టీలోనే ఉండిపోయింది. తీరా ఆ యువతికి సీటీ స్కాన్ వద్దకు తీసుకెళ్లి పరీక్ష చేయించటానికి సిబ్బంది లేక సకాలంలో వైద్యసేవలకు నోచుకోలేదు.

ఆకివీడుకు చెందిన లక్ష్మి చేయి లాగేస్తోందని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా ఎమ్మారై రాసి జీజీహెచ్‌లో తక్కువ ఫీజుకే చేస్తారని చెబితే.. అక్కడి నుంచి వస్తే రూ.3500 తీసుకుని మధ్యాహ్నానికి రిపోర్టు ఇచ్చారని వివరించారామె.

**పీపీపీ విధానంలో సేవలు..**

ఏలూరు జీజీహెచ్‌లో 2018 నుంచి ఎమ్మారై, సీటీస్కాన్ పరీక్షలు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో కొనసాగుతున్నాయి. జీజీహెచ్ రోగులకు ఇవి ఉచితమే. పరీక్షల నిర్వహణలో వీరికే తొలి ప్రాధాన్యమివ్వాలి. ఆ తర్వాతే ప్రైవేటు రోగులకు చేయాలి. ఎంత ఛార్జి వసూలు చేయాలో ఒప్పందంలో ఉంది. చర్యలకు సిఫార్సు చేస్తాం.. 'జీజీహెచ్ రోగులకు ఎమ్మారై, సీటీ ఏదైనా ఉచితంగానే చేయాలి.

# రొయ్యలకు బీమా.. రైతులకు ధీమా

కోట : అమెరికా సుంకాలతో ఆక్వా సాగు వ్యయం పెరిగింది. ప్రకృతి విపత్తులతో మరింత నష్టపోయారు. ఇక రొయ్యల్లో వచ్చే వ్యాధులు, వైరస్‌లతో పూర్తిగా నష్టాల ఊబిలో మునుగుతున్నారు. ఈక్రమంలో ప్రభుత్వం బీమాతో భరోసా కల్పిస్తోంది. వ్యవసాయ బీమా సంస్థ(ఏఐసీ) సహకారంతో చేపట్టే పథకంలో చేరితే వ్యాధులు, వైరస్‌ల నుంచి రక్షణ పొందొచ్చు.

**ఈ వివరాలు సరిచూసుకోండి**

ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు చేస్తున్న రైతులు బీమా కోసం రూ.8-12 వేలు వెచ్చిస్తే చాలు.

15-130 రోజుల వరకు ఉన్న రొయ్యలకు బీమా వస్తుంది.

కోస్తా ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలి.

అన్ని అనుమతులుంటే జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ద్వారా ప్రీమియంలో 40 శాతం రాయితీ ఇస్తారు.



అధికవేడితో చనిపోవడం, విష ప్రయోగాలు, పేలుళ్లు, వరదలు, తుపాన్లకు సాధారణ బీమా చేస్తారు.

వైరస్‌లు, తెగుళ్లు, వ్యాధులకు మరో బీమా చేస్తారు. రెండింటికీ కలిపి కూడా చేయవచ్చు.

జిల్లాలో సాగు: 3,822.96 హెక్టార్లలో

రైతులు: 2 వేల మంది

వర్తింపు: వనామీ, టైగర్, స్కాంపి, పీనస్, ఇండికస్

రైతులు అనుమతులు పొందాలి

జిల్లాలో 2,250 హెక్టార్లలోని రైతులే ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులు పొందారు. మిగతా రైతులు కూడా పొంది ప్రభుత్వ పథకాల లబ్ధి పొందాలి.

రాజేష్, జిల్లా మత్స్యశాఖాధికారి

# విశాఖలో మరో కిడ్నీ రాకెట్ కలకలం!!

విశాఖపట్నం : పేదల ఆర్థిక అవసరాలే ఆసరాగా చేసుకొని కిడ్నీలు కొట్టేసే ముఠాలు విశాఖలో పాగా వేశాయి. రూ.లక్షలు ఆశ చూపి కిడ్నీలు అమ్మేస్తున్నారు. తాజాగా మరో కిడ్నీ రాకెట్‌తో నగరంలో కలకలం రేగింది. మధురవాడకు చెందిన యమున అనే మహిళ కిడ్నీ తీసుకునేందుకు అన్నమయ్య జిల్లా మదనపల్లె తీసుకువెళ్లారు. అక్కడ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేసి కిడ్నీ తీస్తుండగా ఆమె మృతి చెందింది. ఈ విషయం తిరుపతిలో ఉన్న భర్తకు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కిడ్నీ రాకెట్ వెలుగులోకి వచ్చింది. ఓ ముఠా ఏకంగా విశాఖ నుంచి జిల్లాలు దాటించి కిడ్నీలు అమ్మే స్థాయిలో నెట్‌వర్క్ ఏర్పాటు చేయడంపై పోలీసులు దృష్టిసారించి ముఠా సభ్యులపై ఆరా తీస్తున్నారు. **దళారి... గాజువాక మహిళ:** కిడ్నీకి రూ.8 లక్షలు ఇస్తామని ఆశ చూపి యమునను మదనపల్లె తీసుకెళ్లారు. ముఠాలో గాజువాకకు చెందిన పద్మ కీలక దళారిగా వ్యవహరించినట్లు పోలీసులు గుర్తించారు. మదనపల్లెలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి సిబ్బందితో ముందుగా ఒప్పందం చేసుకొని ముఠా రంగంలోకి దిగింది. యమునను ఒప్పించి మదనపల్లెకు తీసుకెళ్లగా అనుకోని రీతిలో ఆమె



ప్రాణాలు కోల్పోయింది.

ఎన్నో ఘటనలు రెండేళ్ల క్రితం కిడ్నీ ఇస్తే రూ.8.50 లక్షలు ఇస్తామని మధురవాడ వాంబే కాలనీకి చెందిన డ్రైవర్‌ను నమ్మించారు. పెందుర్తిలోని ఓ క్లినిక్‌లో కిడ్నీ తీసి రూ.2.50లక్షలే ఇచ్చారు. డ్రైవర్‌కు సరైన వైద్యం అందక ఆరోగ్యం క్షీణించడంతో పోలీసులకు జరిగిందంతా చెప్పారు. అదే కాలనీలో ఓ యువకుడు ఇంట్లో గొడవపడి మద్యం మత్తులో ఆరుబయట నిద్రిస్తుండగా, రూ.లక్షలు ఆశచూపి, బైకు కొనిస్తామంటూ ఎర వేసి కిడ్నీ తీసేసుకున్నారు.

ఇదే ప్రాంతానికి చెందిన ఓ మహిళ నుంచి కిడ్నీ తీసుకుని రూ.4లక్షలే ఇవ్వడంతో ఆమె పోలీసులనాశ్రయించింది. బీ గతేడాది జులైలో ద్వారకా స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేటు నెఫ్రాలజిస్టు రూ.27 లక్షలకు బేరం కుదుర్చుకొని కిడ్నీ సమకూర్చకపోవడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# నీరుంది.. నిర్వహణే లేకుంది

ఈ చిత్రంలో కనిపిస్తున్నది.. ఎడమ పంట కాల్వ. దీని కింద సుమారు 3,752 ఎకరాల ఆయకట్టు ఉంది. రబీ సీజన్‌లో పంట కాల్వలకు నీటిని విడుదల చేస్తుంటారు. 0 కి.మీ నుంచి 2 కి.మీ. వరకు కాల్వలో గడ్డి, జమ్ము విపరీతంగా పెరిగిపోయింది. ఫలితంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతోంది. ఆయకట్టుకు నీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది ఎగువ ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా పడటంతో గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. దీనికింద సుమారు 24 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సాగునీటి కాలువలకు నీటిని విడుదల చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. పంటలకు సాగునీరు అందించే డిస్ట్రిబ్యూటరీ కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. ఫలితంగా పొలాలకు నీరందడం గగనంగా మారింది.

**అన్నదాతలపైనే భారం**

గాజులదిన్నె జలాశయం పరిధిలో 11 సాగునీటి సంఘాలున్నాయి. వీటి పరిధిలో పిల్ల కాల్వలున్నాయి. నిర్వహణ కరవవడంతో రైతులపై భారం పడుతోంది. వారే స్వయంగా తలా ఓ చేయి వేసుకొని పిల్ల కాల్వల్లో ముళ్ల పొదలు, పూడికతీత పనులు చేపడుతున్నారు. కాల్వల అభివృద్ధికి నిధులు సమకూరడం లేదని సాగునీటి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా చాలామంది రైతులు నష్టపోయారు. ఖరీఫ్‌లో చాలావరకు పంటలు చేతికిరాలేదు. ప్రస్తుతం జలాశయంలో నీటిమట్టం పూర్తిస్థాయికి చేరడంతో కర్షకులు రబీ సాగుపై ఆశలు పెంచుకున్నారు.

# నర్సులేరీ.. సేవలేవీ?



హిందూపురం : హిందూపురంలో వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రి ఉంది. అందులో ఉన్న సిబ్బందిని చూస్తే ఇది ఆస్థాయి అసుపత్రేనా అన్న సందేహం కలుతుగుంది. గతంలో ఇక్కడ 48 మంది నర్సులు పని చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక పాఠశాలల్లోనే కాదు. ఆసుపత్రుల్లోను క్రమబద్ధీకరణ పేరుతో వైద్యులు, సిబ్బంది సంఖ్యను తగ్గించింది. ఆసుపత్రిలో స్టాఫ్ నర్సుల పోస్టులను 40కి కుదించింది. ఆ తరువాత బదిలీలు ఇతరత్రా కారణాలతో చాలా మంది ఇక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రస్తుతం 27 మంది మాత్రమే పని చేస్తున్నారు. మరో 13 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**సేవలు.. గొడవలు**

ఎమ్మెల్యే బాలకృష్ణ చొరవతో ఇటీవల కాలంలో ఆసుపత్రికి అనేక సదుపాయాలు సమకూరడంతోపాటు వైద్యులు వచ్చారు. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య గతంలో కన్నా భారీగా పెరిగింది. నర్సుల సంఖ్య మాత్రం పెరగలేదు. ఉన్న వారిపై పనిభారం పెరిగింది. సెలవులు లేకుండా పని చేయాల్సి వస్తోంది. ఉదయం పూట విధులకు వచ్చిన నర్సులు మళ్లీ రాత్రి డ్యూటీకి రావాల్సి వస్తోంది. విరామం లేకుండా పని చేయాల్సి రావడంతో వారు నాణ్యమైన సేవలు అందించలేక పోతున్నారు. వారిపై రోగులు మండిపడుతున్నారు. వైద్యం అందించినా నర్సులు పని చేయడం లేదంటూ తరచూ గొడవలకు దిగుతున్నారు. అత్యవసర వైద్యం కోసం వచ్చిన వారిని, ప్రమాదాల్లో గాయపడిన వారికి వైద్య సేవలు అందించలేక బెంగళూరు, అనంతపురం ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు.

# కస్తూర్బాలకు మహర్దశ



కళ్యాణదుర్గం : కూటమి ప్రభుత్వం రాకతో జిల్లాలోని కస్తూర్బా విద్యాలయాల(కేజీబీవీ)కు మహర్దశ పట్టింది. ఒక్కో కేజీబీకి అదనంగా 6 గదుల సముదాయంతో కూడిన వసతి భవనాలు నిర్మిస్తుండటంతో ఇరుకు గదుల కష్టాలు తీరనున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థినులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 32 కేజీబీవీలు ఉన్నాయి. ఇందులో 6 నుంచి 10 తరగతుల్లో మొత్తంగా సుమారు 200 మంది విద్యార్థినులున్నారు. మూడేళ్ల కిందట వైకాపా ప్రభుత్వం అన్ని కేజీబీవీలను జూ.కళాశాలలుగా ఉన్నతీకరించడంతో మరో రెండు తరగతులు, ప్రయోగశాలలు పెరిగినప్పటికీ ఉన్న గదుల్లోనే సర్దుకోవాల్సిన స్థితి నెలకొంది.

**భోజనశాలల్లోనే బోధన**

అదనపు గదులు నిర్మించకుండా ఇంటర్‌లో ప్రవేశాలు తీసుకోవడంతో విద్యార్థినుల కష్టాలు రెట్టింపయ్యాయి. 'నాడు- నేడు' పథకంలో అదనపు గదులు మంజూరు చేసినా.. నిధులు మాత్రం మంజూరు కాకపోవడంతో పనులు పూర్తికాలేదు. ప్రతీ కేజీబీవీలో ఇంటర్ తరగతులను వసతి గృహాలు, భోజనశాల గదుల్లో తరగతులు కొనసాగించాల్సి వస్తోంది. రాత్రుళ్లు సుమారు 280 మంది విద్యార్థినులు తరగతి గదుల్లో నిద్రిస్తూ.. అవస్థలు పడుతున్నారు.

**యుద్ధప్రాతిపదికన పనులు**

కూటమి ప్రభుత్వం కేజీబీవీలలో వసతి గదుల నిర్మాణంపై దృష్టి సారించింది. గతంలో నిర్మించిన 10 కేజీబీవీలను మినహాయించి కణేకల్లు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, డి.హీరేహాళ్, ఉరవకొండ, కూడేరు తదితర ప్రాంతాల్లోని 22 కేజీబీవీలకు అదనంగా 6 గదుల సముదాయ వసతి భవనాలు మంజూరు చేసి పనులకు శ్రీకారం చుట్టారు. త్వరలో విద్యార్థులకు గదులు అందుబాటులోకి తెచ్చేలా పనులు యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. దీనివల్ల ఇంటర్‌లో విద్యార్థినులు ఎక్కువ సంఖ్యలో ప్రవేశాలు పొందడానికి ఆసక్తి చూపుతారు.

# నీరందేనా.. పండేనా!



తాడిమర్రి : పీఏబీఆర్ కుడికాలువలో నీరు ప్రవహిస్తే వేలాది ఎకరాలకు ప్రయోజనం చేకూరుతుంది. పీఏబీఆర్‌లో ప్రస్తుతం 5 టీఎంసీలకు పైగా జలాలు ఉన్నాయి. తాడిమర్రి, బత్తలపల్లి, ధర్మవరం మండలాల పరిధిలోని కుడికాలువకు ఈసారైనా నీరు అందుతాయా అనే ప్రశ్న రైతుల్లో తలెత్తుతోంది. విడుదల అయ్యాక ఎటువంటి ఆటంకాలు లేకుండా వస్తే వేలాది మంది రైతులకు ఏడాది పొడవున ఉద్యాన, స్వల్పకాలిక పంటలను సాగు చేసేందుకు అవకాశం ఉంది. కుడికాలువ ద్వారా నవంబరు, డిసెంబరు మాసాల్లో పలు చెరువులు, కుంటలకు నీటిని అందిస్తారు. మూడేళ్లుగా అరకొరగా విడుదల చేస్తుండటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈసారి నీరు ఆశాజనకంగా నిల్వ ఉండటంతో కాలువలోకి చేరితే.. భూగర్భజలాలు పెరిగి, బోర్లు రీఛార్జి అవుతాయి. దీంతో 20 వేల ఎకరాల్లోని పంటలకు నీరు అందుతుంది.

**42 చెరువులు, కుంటలకు నీరు**

పీఏబీఆర్ కుడికాలువ ఉమ్మడి జిల్లాలో 112 కి.మీ మేర విస్తరించి ఉంటుంది. కాలువ ద్వారా 42 చెరువులు, కుంటలు నింపుతారు. తాడిమర్రి మండలంలోని అగ్రహారం చెరువుకు తొలుత నీటిని విడుదల చేస్తారు. 87 కి.మీ నుంచి ప్రారంభమై.. ప్రవాహం ధర్మవరం నియోజకవర్గంలోని చెరువులకు చేరుతుంది.

**ఎన్నో ఆశలు**

నీరు వదిలితే ఉద్యాన పంటలే కాకుండా స్వల్పకాలిక పంటలను సాగు చేసే రైతులు అధికంగా ఉన్నారు. గతంలో టమాటా, మిర్చి, బెండ, ఆకుకూరలు, వంకాయ, వరి తదితర పంటలను వేసేవారు. సరైన సమయంలో కుడికాలువకు నీటిని విడుదల చేయకపోవడం, పూర్తిస్థాయిలో చెరువులను నింపకపోవడంతో పంటలను సాగు చేసేందుకు వెనుకడుగు వేశారు. దీనికి తోడు గత వైకాపా పాలనలో కుడికాలువ మరమ్మతులకు ఏమాత్రం నిధులను మంజూరు చేయలేదు. కాలువ అధ్వానంగా తయారై నీరంతా వృథాగా పక్కకు పోయి.. పొలాల్లోకి చేరి పంటలను ముంచేసింది.

కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద కాలువల్లో కొన్నిచోట్ల పూడికలు తీయించి, శుభ్రం చేయించడంతో ప్రవాహంపై రైతుల్లో ఆశలు నెలకొన్నాయి.

**సన్నాహాలు చేస్తున్నాం** ఈనెల 25న నీటి విడుదలకు సన్నాహాలు చేస్తున్నాం. గేట్ల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. వాటి పనులనూ త్వరగతిన పూర్తి చేస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. సుధాకర్, ఎస్ఈ, హెచ్ఎల్‌సీ

# ఆయకట్టు రైతుల్లో కలవరం

అనంతపురం : హెచ్చెల్సీ-ఎంపీఆర్ దక్షిణ కాలువ గేటు ఉన్నఫళంగా కిందకు దిగిపోయింది. దీంతో ఒక్కసారిగా కాలువలో నీటి ప్రవాహం పూర్తిగా ఆగిపోయింది. ఆ గేటును మళ్లీ పైకి ఎత్తడానికి నానా కష్టాలు పడుతున్నా ఫలితం కనిపించడం లేదు. ఐదు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

**రాడ్ విరిగిపోవడంతో...** నీటి సరఫరా ఆగడంతో ఆయకట్టుదారుల్లో ఆందోళన నెలకొంది. కాలువ కింద దాదాపు 35వేల ఎకరాలకుపైగా వరి సాగు చేశారు. పంటకు నిరంతరం నీరు అందించాల్సి ఉంది. నీటి ప్రవాహం కోసం అన్నదాతలు నిరీక్షిస్తున్నారు. మొన్నటి మొంథా తుపాన్ సమయంలో ఎంపీఆర్ జలాశయం దక్షిణ కాలువ గేటును కొద్దిమేర కిందకు దించి నీటి ప్రవాహ సామర్థ్యాన్ని తగ్గించారు. మళ్లీ ఈనెల 7వ తేదీన నీటి ప్రవాహ సామర్థ్యాన్ని పెంచాలన్న ఉద్దేశంతో ఆ గేటును పైకి ఎత్తడానికి యత్నించే సమయంలో ఒక్కసారిగా కిందకు దిగింది. గేటుకు కింద ఉండే రాండ్ విరిగిపోవడంతోనే ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది.

**మొరాయించిన ప్రధాన గేట్లు** ఎంపీఆర్ జలాశయం దక్షిణ కాలువకు మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. ఇవన్నీ గత వైకాపా పాలనలోనే మొరాయించాయి. ఏ ఒక్కదానికీ మరమ్మతు చేయించలేదు. ప్రస్తుత తెదేపా కూటమి ప్రభుత్వం రాగానే గతేడాది ఒక గేట్‌కు మరమ్మతు చేశారు. ఇప్పుడు ఒక్క గేటు మాత్రమే పని చేస్తుండగా తాజాగా అది కూడా మొరాయిస్తోంది.

# 'బాటిల్' బయటకెళ్తోంది..

గాజువాక : 'రక్షణ మద్యం ఇచ్చే కిక్కే వేరప్పా'... అంటారు మందుబాబులు. అందుకే బయట ఎంత మద్యం దొరికినా రక్షణ మద్యం కోసం అర్రులు చాస్తుంటారు. ధర కూడా బయటి మార్కెట్‌తో పోలిస్తే తక్కువగా ఉండటం కూడా వీరి ఆశకు మరో కారణం. అలాగని మందుబాబులందరూ రక్షణ ఉద్యోగులు కాదు. మరి వీరి చేతుల్లోకి 'రక్షణ' బాటిళ్లు ఎలా వస్తున్నాయనేది ఇప్పుడు పెద్ద ప్రశ్న. ఇటీవల తరచూ ఎక్సైజ్ పోలీసులు డిఫెన్స్ మద్యం స్వాధీనం చేసుకున్న వార్తలు చర్చనీయాంశమవుతున్నాయి. ఈ వివరాలు తెలుసుకుందాం..

**సైన్యంలో సామాజిక ఐక్యత పెంపొందించడానికి...** సైనికులు మానసిక ఒత్తిడిని జయించడానికి.. భౌగోళిక వాతావరణ పరిస్థితులను తట్టుకోవడం వంటి పలు లక్ష్యాలతో సైన్యంలో పనిచేసే సిపాయి మొదలు ఉన్నతాధికారుల వరకు రాయితీతో కూడిన మద్యం నిర్ణీత మొత్తంలో అందిస్తారు. విశ్రాంత సైనిక ఉద్యోగులకు కూడా ఈ మద్యం అందుతుంది.. క్యాంటిన్ స్టోర్స్ డిపార్టుమెంటు(సీఎస్డీ) ద్వారా దీన్ని కేటాయిస్తారు. సబ్సిడీతో లభించే ఈ మద్యం మార్కెట్ ధరల కన్నా తక్కువ. రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ లేనందున దీన్ని చౌకగా పొందుతుంటారు.



**బయటకు ఎందుకు వస్తుందంటే..:** రక్షణ/విశ్రాంత సిబ్బంది ఏదైనా వస్తువులు కొన్నప్పుడు డబ్బుల బదులు మద్యం ఇస్తుంటారు. ఇది తెలిసిన వారికే. ఉదాహరణకు.. రోజూ ఇంట్లో పాలు పోయించుకుంటే.. పాలకు డబ్బులు బదులు.. మద్యం బాటిళ్లు ఇస్తారు. పారిశ్రామిక ప్రాంతంలో ఈ తరహా మార్పిడి ఎక్కువ. రెండో విధానంలో.. ఎవరైనా దీన్ని అమ్ముకుంటారని అనుమానం ఉందో మందుబాబులు, బెల్టుషాపుల యజమానులు వారిని సంప్రదిస్తారు. ఒకసారి అమ్మితే ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఈ సమాచారం బయటకు వచ్చినపుడు ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి పట్టుకుంటుంటారు.

ఆ మద్యమే ఎందుకంటే..

త్రివిధ దళాల సైనికులకు మద్యం నేరుగా తయారీ కంపెనీల నుంచే డిఫెన్స్ క్యాంటీన్లకు చేరుతుందనే నమ్మకం.

బయటి మద్యం కల్తీకి ఆస్కారం ఉంటుందనే భావన

డిఫెన్స్ క్యాంటీనులో లిక్కర్ ధరకు బయటి దుకాణాల్లో రెండు నుంచి మూడున్నర రెట్లు వరకు తేడా ఉండటం

# 'తమలపాకు' పరిహారంలో అనర్హులు

పాయకరావుపేట : మొంథా తుపాను పరిహారం జాబితాల్లో అనర్హులు చొరబడ్డారు. తమలపాకు సాగు చేయకపోయినా కౌలు రైతులుగా పేర్లు నమోదు చేసుకున్నారు. నష్టపోయిన వారితోపాటు భూములు లేకున్నా, తోటలు లేకున్నా పేర్లు రాయించుకున్నారు. గత నెలలో పంజా విసిరిన మొంథా తుపాను ధాటికి అన్నదాతకు నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. ఊహించిన స్థాయిలో తుపాను ప్రభావం లేకపోవడంతో కొద్దిపాటి నష్టాలతో రైతులు గట్టెక్కారు.

పాయకరావుపేట మండలం కొత్తూరు, మాసాహెబ్‌పేట, సత్యవరం, మంగవరం తదితర గ్రామాల పరిధిలో అక్కడక్కడ ముదురు తమలపాకు తోటలు నేలకూలాయి. ఉద్యాన శాఖ అంచనా మేరకు సుమారు 140 ఎకరాల్లో తోటలు దెబ్బతిన్నాయని, 555 మందికి రైతులకు నష్టం వాటిల్లినట్లు జాబితాలు సిద్ధం చేశారు. తొలివిడతలో చేపట్టిన సర్వేలో విస్తీర్ణం తక్కువే. రైతులూ తక్కువగానే ఉన్నారు. కొంతమంది స్వార్థం వాస్తవంగా నష్టపోయిన వారికి చేటు చేస్తోంది. మాసాహెబ్‌పేట, సత్యవరం గ్రామాల్లో అనర్హుల పేర్లు జాబితాల్లోకి ఎక్కాయి. ఇసుక తిన్నెలు, తోటలు లేకుండానే ఉన్నట్లుగా రాయించుకున్నారు. ఈ రెండు గ్రామాల పరిధిలో 40 మందికిపైగా అనర్హులు ఉంటారని కలెక్టర్ విజయ్‌కృష్ణన్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. మాసాహెబ్‌పేట గ్రామంలో జాబితాలో పేర్లను ఫ్లెక్సీలు వేసి ప్రదర్శించారు. దీంతో అనర్హుల గుట్టు బయటపడింది.

ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందడంతో మరోసారి సర్వే చేయాలని ఆదేశాలొచ్చాయి. ఉద్యానశాఖ సిబ్బంది నుంచి తోటల పరిశీలన చేపట్టారు. మొక్కుబడిగా సర్వే చేయడంతోనే అనర్హుల పేర్లు జాబితాల్లోకి వచ్చాయన్న ఆరోపణలున్నాయి. ఉద్యానాధికారిణి సాయిప్రియ మాట్లాడుతూ.. మరోసారి గ్రామాల్లో సమగ్రంగా వివరాలు సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

# సహకరిస్తే.. ఉపాధి సాకారం

కర్నూలు : నంద్యాల జిల్లా నందికొట్కూరు సమీపంలోని తంగడంచలో జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలనుకున్నప్పటికీ అడుగులు ముందుకు పడటం లేదు. పీవీసీ, హెచ్‌డీపీఈ పైపులు, వ్యవసాయ ఉత్పత్తులు, స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలతో పాటు పలురకాల పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని 2017లో ఈ సంస్థ ప్రతిపాదించింది. పది వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని ప్రకటించింది. ఈ సంస్థకు అప్పట్లో తెదేపా ప్రభుత్వం అనుమతులిచ్చి భూమి సైతం కేటాయించింది. ఒప్పందం ప్రకారం ఆ సంస్థ నిర్వహణకు అవసరమైన నీరు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలి. **వైకాపా అధికారంలోకి రావడంతో..**

2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీనిని డోన్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయాలని నాటి మంత్రి బుగ్గన సూచించారు. అప్పటికే భూ కేటాయింపులు జరగడం.. వసతులు సమకూర్చుకోవడంతో ప్రతిపాదనకు నిరాకరించింది. ఈ నేపథ్యంలో సంస్థ సమీపం నుంచి వేయాల్సిన ముచ్చుమర్రి-ఓర్వకల్లు పైపులైను పనులను మార్చేశారు. గత ఒప్పందం ప్రకారం.. నీటి సౌకర్యం కల్పిస్తే తొమ్మిది నెలల్లో పరిశ్రమ నిర్మాణాన్ని పూర్తిచేసి ఉత్పత్తి మొదలుపెట్టేందుకు జైన్ ఇరిగేషన్ సంస్థ సుముఖంగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

**పది వేల మందికి ఉపాధి** సంస్థకు అవసరమైన నీరు, విద్యుత్తు అందించేలా రెండు నిర్ణయాలు తీసుకుంటే పది వేల మందికి ఉపాధి లభిస్తుంది. ముచ్చుమర్రి-ఓర్వకల్లు పైపులైను నిర్మాణ మార్గం మారిన నేపథ్యంలో నందికొట్కూరు నుంచి జైన్ ఇరిగేషన్ సంస్థ వరకు పైపులైను వేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం జైన్ ఇరిగేషన్ సంస్థ పండ్ల గుజ్జు తయారీ పరిశ్రమతోపాటు అదనంగా ఉల్లిపొడి తయారీ కూడా చేపట్టాలని నిర్ణయించింది. ఇవి సాకారమైతే ఉమ్మడి జిల్లాలో వేలాది మంది ఉల్లి, టమాటా రైతులకు సైతం మేలు చేకూరుతుంది.

## అవార్డ్స్ ఫంక్షన్ లో రకుల్.. ట్రెండీ లుక్ లో దర్శనమిస్తూ..


రకుల్ ప్రీత్ సింగ్.. తెలుగు, తమిళ, కన్నడ,హిందీ భాషల్లో పేరున్న హీరోయిన్.. పాకెట్ మనీ కోసం సినిమాల్లోకి వచ్చి అదే తన వృత్తిగా మార్చుకుంది.. అలా 2009లో వచ్చిన కన్నడ గిల్లి సినిమాతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది రకుల్ ప్రీత్ సింగ్. ఈ సినిమాలో అనిత అనే పాత్రలో మెరిసింది.ఆ తర్వాత కెరటం అనే సినిమాతో టాలీవుడ్లోకి ఎంట్రీ ఇచ్చింది.అయితే రకుల్ ప్రీత్ సింగ్ తాజాగా ఓ అవార్డ్స్ ఫంక్షన్ లో తన అందంతో అందరిని అట్రాక్ట్ చేసింది. తాజాగా ఓ అవార్డ్స్ ఫంక్షన్ లో పాల్గొన్న రకుల్ ప్రీత్ సింగ్ తన డ్రెస్సింగ్ స్టైల్ తో అక్కడున్నవారిని కట్టిపడేసింది.. ఫుల్ లెన్త్ ఫ్రాక్ ధరించిన రకుల్ ప్రీత్ సింగ్.. ఓ అవార్డు అందుకోవడం కోసం వెళ్ళినట్టు అర్థమవుతుంది. అంతేకాదు ఈ అవార్డ్స్ ఫంక్షన్లో రకుల్ ప్రీత్ సింగ్ అవార్డు అందుకున్న ఫోటో కూడా తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేసింది. విషయంలోకి వెళ్తే.. రీసెంట్గా రకుల్ ప్రీత్ సింగ్.. అజయ్ దేవగన్ హీరోగా వచ్చిన దేదే ప్యార్ దే -2 సినిమాలో హీరోయిన్ గా నటించిన సంగతి మనకు తెలిసిందే. ఈ సినిమాలో ఆయేషా అనే పాత్రలో రకుల్ నటించింది.అయితే ఈ సినిమాలో నటించినందుకు గానూ తనకు మొట్టమొదటి అవార్డు వచ్చిందని రకుల్ తన సోషల్ మీడియా ఖాతాలో ఈ విషయాన్ని షేర్ చేసుకుంది. అవార్డ్ ఫంక్షన్ కి వెళ్లిన ఫోటోలను షేర్ చేయడమే కాకుండా దేదే ప్యార్ దే -2 సినిమాలోని ఆయేషాకి మొదటి అవార్డు వచ్చింది.



ప్రధాన పాత్రలో ఈ సంవత్సరం అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చినందుకు.. ఈ అవార్డు వచ్చిందని థాంక్స్ చెప్తూ లవ్ సింబల్ ని పెట్టి క్యాప్షన్ లో రాసుకువచ్చింది. ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి. ఈ ఫోటోలో రకుల్ ప్రీత్ సింగ్ అందానికి ప్రతి ఒక్కరు ఫిదా కావాల్సిందే అంటూ ఫోటోలు చూసిన నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అంతేకాదు రకుల్ అందానికి ఫైర్ ఎమోజీలను కామెంట్ల రూపంలో తెలియజేస్తున్నారు. రకుల్ వేసుకున్న ఆ డ్రెస్ డిజైన్ అద్భుతంగా ఉండడంతో చాలామందికి ఆ డ్రెస్ తెగ నచ్చేసింది.. దీంతో ఈమె డ్రెస్సింగ్ స్టైల్ పై కూడా కామెంట్లు చేస్తున్నారు.. రకుల్ ప్రీత్ సింగ్ సినిమాల విషయానికి వస్తే.. కెరటం సినిమాతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన రకుల్ కి వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమా హిట్ ఇచ్చింది.ఈ సినిమా తర్వాత రకుల్ కెరియర్ పీక్స్ కి వెళ్ళిపోయింది. ఎటు చూసినా సరే వరుస హిట్స్ పడిపోయాయి. అలా తెలుగు , తమిళ, కన్నడ భాషల్లో స్టార్ హీరోయిన్ గా రాణించింది. కానీ ఆ తర్వాత ఈ హీరోయిన్ చేసిన సినిమాలు ఒక్కొక్కటిగా ఫ్లాప్స్ అవుతూ వచ్చాయి. దాంతో సౌత్ ఇండస్ట్రీలో పూర్తిగా అవకాశాలు కరువయ్యాయి. అంతేకాకుండా ఎప్పుడైతే నటుడు,నిర్మాత అయి నటువంటి జాకీ భగ్నాని ని పెళ్లాడిందో అప్పటినుండి రకుల్ ఎక్కువగా బాలీవుడ్ ఇండస్ట్రీకే పరిమితం అయిపోయింది. అలా హిందీలో పలు సినిమాలు చేస్తూ రాణిస్తోంది. ఈ మధ్యనే దే దే ప్యార్ దే -2అనే మూవీతో మనల్ని అలరించింది. త్వరలోనే ఈ హీరోయిన్ కొత్త సినిమాలతో కూడా మన ముందుకు రాబోతుంది.ప్రస్తుతం రకుల్ ప్రీత్ సింగ్ చేతిలో ఇండియన్ 3 సినిమా ఉంది.

## శత్రువు లేని పాన్ ఇండియా డార్లింగ్

ఒక హీరో పుట్టినరోజు కేవలం ఫ్యాన్స్కు మాత్రమే కాకుండా, మొత్తం ఇండస్ట్రీకి ఒక ఈవెంట్గా మారడం అరుదు. రెబల్ స్టార్ ప్రభాస్ విషయంలో ఇప్పుడు అదే జరుగుతోంది. అక్టోబర్ 23న ఆయన పుట్టినరోజు వస్తుందంటే, ముందు నుంచే సోషల్ మీడియాలో హంగామా మొదలవుతుంది. ఇది కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాదు, దేశవ్యాప్తంగా కూడా అలాంటి వైబ్స్ కనిపిస్తాయి. ఇక చివరికి ఓవర్సీస్లోనూ ఈ బర్త్డేను గ్రాండ్ గా సెలబ్రేట్ చేసుకుంటారు. ఇది డార్లింగ్ సంపాదించుకున్న పాన్ ఇండియా, పాన్ వరల్డ్ క్రేజ్కు నిదర్శమని చెప్పవచ్చు. ఒకప్పుడు టాలీవుడ్ స్టార్గా ఉన్న ప్రభాస్, 'బాహుబలి'తో తన రేంజ్ను పూర్తిగా మార్చేశాడు. తెలుగు సినిమా ఖ్యాతిని ఖండాంతరాలకు తీసుకెళ్లిన అతి కొద్ది మంది హీరోలలో ఆయన ఒకరు. ప్రభాస్ సినిమా వస్తుందంటే, అది ఏ భాషలో అయినా, ఏ దేశంలో అయినా భారీ ఓపెనింగ్స్ను రాబడుతుంది. యూఎస్, యూకే, జపాన్.. ఇలా ప్రతీ చోటా ప్రభాస్ సినిమాలకు స్పెషల్ ఫాలోయింగ్ ఉంది. అందుకే, డార్లింగ్ చేసే ప్రతీ సినిమా ఇప్పుడు సహజంగానే ఒక పాన్ వరల్డ్ ప్రాజెక్ట్గా మారిపోతోంది. ఈ నెల 31న రాబోతున్న 'బాహుబలి: ది ఎపిక్' రీ రిలీజ్పై ఉన్న అంచనాలే దీనికి నిదర్శనం. ?ప్రస్తుతం ప్రభాస్ లైనప్ చూస్తే, తన



ఇమేజ్ను ఎంత బ్యాలెన్స్డ్గా ప్లాన్ చేసుకుంటున్నాడో అర్థమవుతుంది. ఒకవైపు 'సలార్ 2', 'కల్కి 2', సందీప్ వంగాతో 'స్పిరిట్', హను రాఘవపూడితో స్పై యాక్షన్ థ్రిల్లర్ వంటి భారీ యాక్షన్ చిత్రాలు చేస్తూనే, మరోవైపు మారుతి దర్శకత్వంలో 'ది రాజా సాబ్' లాంటి రొమాంటిక్ హారర్ కామెడీతో వస్తున్నాడు. చాలా కాలంగా ఫ్యాన్స్ మిస్ అవుతున్న వింటేజ్, లవర్ బాయ్ ప్రభాస్ను ఈ సినిమాలో చూడబోతున్నామని తెలుస్తోంది. అందుకే ఆ, ప్రాజెక్ట్పై పవర్ఫుల్ హైప్ను క్రియేట్ చేసింది. ?కేవలం లీడ్ రోల్స్ మాత్రమే కాదు, చిన్న పాత్రల్లో కనిపించినా ప్రభాస్ తన మార్క్ను చూపిస్తున్నాడు. ఈ ఏడాది వచ్చిన 'కన్నప్ప' సినిమాలో పోషించిన రుద్ర పాత్ర నిడివి తక్కువే అయినా, సినిమాకే హైలైట్గా నిలిచింది. ఇది ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్కు, పెర్ఫార్మెన్స్కు ఉన్న పవర్ను తెలియజేస్తుంది. అందుకే, లైనప్లోని ప్రతీ సినిమాపై అంచనాలు స్కై రేంజ్లో ఉంటున్నాయి. అయితే, ప్రభాస్ను కేవలం బాక్సాఫీస్ నంబర్లతోనే కొలవలేం. తెరపై ఎంత పెద్ద స్టార్ అయినా, నిజ జీవితంలో సింప్లిసిటీ, ఫ్రెండ్షిప్, సహాయం చేసే గణం ప్రభాస్ ని అందరివాడిని చేశాయి. ఇండస్ట్రీలో ప్రభాస్ అంటే ఇష్టపడని వారు ఉండరు. ఎవరు కూడా ఆయనపై అనవసర కాంట్రవర్సీలు క్రియేట్ చేయరు. శత్రువులు అసలే లేరు. నచ్చితే గుండెల్లో పెట్టుకొని చూసుకుంటాడాని మంచి గుర్తింపు ఉంది. ఈ విషయం గురించి అందరికి తెలిసిందే. అందరినీ ఆప్యాయంగా పలకరించే మనిషిగా ఆయనకు మంచి పేరుంది. అందుకే, అభిమానులు ప్రేమగా "డార్లింగ్" అని పిలుచుకుంటారు. ఈ స్టార్డమ్, పర్సనాలిటీ కలయికే ప్రభాస్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. ?తెలుగు సినిమాను గ్లోబల్ మ్యాప్పై నిలబెడుతూ, అదే సమయంలో తన 'డార్లింగ్' ఇమేజ్ను కాపాడుకుంటున్న ప్రభాస్, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, మరిన్ని విజయాలు అందుకోవాలని ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.




## సంక్రాంతి చిత్రాలు.. ఏ ఓటీటీలోకి రానున్నాయి?



టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో సంక్రాంతి సీజన్ కు ఏ రేంజ్ లో క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. నిజానికి మామూలు సీజన్స్ కన్నా అప్పుడే సినిమాలను థియేటర్స్ లో చూసేందుకు ఎక్కువ ఇంట్రెస్ట్ చూపిస్తారు మూవీ లవర్స్. చాలా మంది దాన్ని ఒక ఆనవాయితీగా కూడా తీసుకుంటారు. పొంగల్ కు మూవీకి వెళ్లాల్సిందే అని ఫిక్స్ అవుతుంటారు. దీంతో హీరోలు, దర్శక నిర్మాతలంతా సంక్రాంతికే సినిమాలు రిలీజ్ చేయాలని ప్లాన్ చేసుకుంటారు. అందుకు గాను ముందు నుంచి కర్చీఫులు వేసుకుంటారు. అలా వచ్చే ఏడాది సంక్రాంతికి కానుకగా అనేక సినిమాలు థియేటర్స్ లో రిలీజ్ చేయనున్నాయి. బాక్సాఫీస్ వద్ద ఈసారి కూడా గట్టి పోటీ ఉండనున్నట్లు స్పష్టంగా అర్థమవుతుంది. ముందుగా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ది రాజా సాబ్ తో సినీ పొంగల్ సందడి మొదలు కానుంది. జనవరి 9వ తేదీన రిలీజ్ కానుంది. ఆ రోజు రాజా సాబ్ తో పాటు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతి జన నాయగన్ కూడా విడుదల అవ్వనుంది. ఇక ఆ రెండు సినిమాలతోపాటు మరో నాలుగు చిత్రాలు థియేటర్స్ లో రిలీజ్ కానున్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటించిన మన శంకర వరప్రసాద్ గారు మూవీ సంక్రాంతికే విడుదల అవుతున్న సంగతి తెలిసిందే. ఆయనతోపాటు మాస్ మహారాజా రవితేజ కూడా భర్త మహాశయులకు విజ్ఞప్తి చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. యంగ్ హీరో శర్వానంద్.. నారీ నారీ నడుమ మురారి మూవీతో పొంగల్ కానుకగా వస్తున్నారు. మరో యువ కథానాయకుడు నవీన్ పోలిశెట్టి యాక్ట్ చేసిన అనగనగా ఒక రాజు పొంగల్ కు రిలీజ్ అవ్వనున్నట్లు ఇప్పటికే పలుమార్లు ఆ సినిమా మేకర్స్ క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు చెప్పిన సినిమాలన్నింటితోపాటు కోలీవుడ్ స్టార్ హీరో శివ కార్తికేయన్ నటిస్తున్న పరాశక్తి కూడా సంక్రాంతికే రానుంది. దీంతో బాక్సాఫీస్ వద్ద భారీ పోటీ పక్కా. అయితే ఇప్పటికే సంక్రాంతికి పెద్ద ఎత్తున సినిమాలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్న ఆయా మేకర్స్.. ఓటీటీ డీల్స్ ను కంప్లీట్ చేశారు. ఒప్పందాల ప్రకారం.. థియేటర్స్ లో రిలీజ్ అయ్యాక సంక్రాంతి చిత్రాలు అన్నీ ఆయా ఓటీటీల్లోకి రానున్నాయి. మరి ఏ సినిమా.. ఏ ఓటీటీలోకి రానుందో ఇప్పుడు తెలుసుకుందాం. ది రాజా సాబ్- జియో హాట్ స్టార్, జననాయగన్- అమెజాన్ ప్రైమ్ వీడియో, నారీ నారీ నడుమమురారి- అమెజాన్ ప్రైమ్ వీడియో, మన శంకరవరప్రసాద్ గారు- జీ5, భర్త మహాశయులకు విజ్ఞప్తి- జీ5, అనగనగా ఒకరాజు- నెట్ ఫ్లిక్స్, పరాశక్తి- నెట్ ఫ్లిక్స్.

## 2026 మిడ్ లో తారక్-త్రివిక్రమ్ !



అన్ని అనుకున్నట్లు జరిగితే యంగ్ టైగర్ ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ ప్రాజెక్ట్ పట్టాలెక్కాలి. కానీ ఇండస్ట్రీలో లెక్కలు మారుతాయి గా. అదే లెక్క ఈ కాంబినేషన్ లోనూ మారింది. అనూహ్యంగా తారక్ తో ప్రశాంత్ నీల్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పట్టాలెక్కించడంతో? సీన్ మొత్తం మారింది.

త్రివిక్రమ్ తెరకెక్కించాల్సిన మైథలాజికల్ చిత్రం వాయిదా పడింది. దీంతో గురూజీ ఈ గ్యాప్ లో విక్టరీ వెంకటేష్ తో సినిమా చేస్తున్నాడు. ఈ సినిమా ఇప్పటికే ప్రారంభమైన సంగతి తెలిసిందే. రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది.

**డ్రాగన్ ఓ కొలిక్కి వచ్చిన తర్వాత:** ఈ సినిమా అన్ని పనులు పూర్తి చేసుకుని వచ్చే ఏడాది మిడ్ కల్లా రిలీజ్ కానుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తారక్-గురూజీ ప్రాజెక్ట్ ఎప్పుడు మొదలవుతుంది? అన్నది లీక్ అయింది. వెంకీ ప్రాజెక్ట్ పూర్తయిన వెంటనే గురూజీ తో తారక్ సినిమా కూడా మొదలవుతుందన్నది తాజా సమాచారం. డ్రాగన్ అప్పటికీ షూటింగ్ సహా పోస్ట్ ప్రొడక్షన్ కూడా ముగింపు దశకే చేరుకుంటుంది. రిలీజ్ అయినా అవ్వకపోయినా? ఆ సినిమా రిలీజ్ తో సంబంధం లేకుండా గురూజీ సినిమాకు తారక్ డేట్లు కేటాయించాలని డిసైడ్ అయ్యాడని ఆయన సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

**ఇప్పటికే మొదలైన ప్రిపరేషన్:** మైథలాజికల్ కాన్సెప్ట్ కావడంతో? ఈ సినిమా కు కూడా తారక్ ఎక్కువగా డేట్లు కేటాయించాల్సి వ స్తోందిట. ఈ సిని మా షూటింగ్ ఓ కొలిక్కి వచ్చే వరకూ మరో సినిమా మొదలు పెట్ట కూడాదని తారక్ కూడా స్ట్రాంగ్ గా ఉ న్నాడుట. గురూజీ సినిమాకు సంబంధించి తారక్ ఇప్పటికే సన్న ధం అవ్వడం మొదలు పెట్టాడు. డ్రాగన్ షూటింగ్ తో సంబంధం లేకుండా పాత్ర పరంగా సిద్ధమవ్వడం కోసం గురూజీ ఇచ్చిన పుస్తకాలు చదువుతోన్న సంగతి తెలిసిందే. పాత్రలో ఆత్మను పట్టుకునే ప్రక్రియలో భాగంగా తారక్ ముందొస్తు ప్రిపరేషన్ కనిపిస్తోంది.

**గురూజీ నుంచి మినహాయింపు ఉంటుందా:** పాత్ర లుక్ పరంగా ఎలాంటి ట్రాన్సఫర్మేషన్ అవసరం అవుతుంది? అన్నది జనవరి ముగింపు కల్లా గురూజీ సూచిస్తాడని వినిపిస్తోంది. మరి త్రివిక్రమ్ సిద్దం చేస్తన్న ప్రణాళిక పక్కాగా అమలవుతుందా? మధ్యలో ఏవైనా డిస్టబెన్సెస్ ఎదురవుతాయా? అన్నది అప్పటి సందర్భాన్ని బట్టి కనిపిస్తుంది. %-%డ్రాగన్%-% కోసం తారక్ లుక్ ఇప్పటికే మారిన సంగతి తెలిసిందే. బాగా సన్నమయ్యాడు. భారీ యాక్షన్ చిత్రం కావడంతో? అదనంగా శ్రమించాల్సి వస్తోంది. మరి ఇలాంటి కసరత్తుల నుంచి గురూజీ మనిహాయింపు ఇస్తాడా? ఆయనా సానబెడతాడా? అన్నది చూడాలి.

## తొలిసారి ట్రెడిషనల్ లుక్ లో అనన్య.. చూపులకే దాసోహం!

ప్రస్తుతకాలంలో చాలామంది హీరోయిన్స్ తమ ఉనికిని చాటుకోవడానికి సోషల్ మీడియాను ఆశ్రయిస్తున్నారు. అందులో కొంతమంది గ్లామర్ తో ఆకట్టుకుంటే.. మరి కొంతమంది ట్రెడిషనల్ లుక్ లో కనిపించి అబ్బురపరుస్తూ ఉంటారు. ఇంకొంతమంది గ్లామర్ తోనే హీట్ పెంచి సడన్ గా ట్రెడిషనల్ లుక్ లో కనిపించేసరికి అభిమానులు సైతం వారి అందానికి ముగ్ధులు అవుతున్నారు. అలాంటి వారిలో అనన్య పాండే కూడా ఒకరు. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ ఫోటోలతో ప్రేక్షకులలో హీట్ పుట్టించే ఈ ముద్దుగుమ్మ.. తాజాగా ట్రెడిషనల్ లుక్ లో కనిపించి అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఆరెంజ్ కలర్ సిల్క్ శారీ ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్ లో ఆరెంజ్ కలర్ బ్లౌజ్ ధరించి తన అందంతో ఆకట్టుకుంది. కొంటెగా ఫోటోలకు ఫోజులిస్తూ.. చూసే అభిమానుల హృదయాలు దోచుకుంది. ముఖ్యంగా అనన్య పాండేని ఇంత ట్రెడిషనల్ గా ఎప్పుడూ చూడలేదని కొంతమంది అభిమానులు కామెంట్లు చేస్తుంటే.. మరి కొంతమంది చక్కగా బుట్ట బొమ్మలా ఉంది అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా చాలా రోజుల తర్వాత ట్రెడిషనల్ లుక్ లో అందులోనూ చీరకట్టులో కనిపించి అందరిని మెస్మరైజ్



చేస్తోంది అనన్య పాండే. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ పేరు చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అనన్య పాండే కెరియర్ విషయానికి వస్తే.. ప్రముఖ నటిగా పేరు సొంతం చేసుకున్న ఈమె.. హిందీ, తెలుగు చిత్రాలలో నటించి ప్రేక్షకులను అలరిస్తోంది. ముఖ్యంగా ఈమె ఎవరో కాదు ప్రముఖ హిందీ సినిమా నటుడు చుంకీ పాండే కూతురు. ఈమె తాత ఎవరో కాదు ప్రముఖ హార్ట్ సర్జన్ శరద్ పాండే. 2019లో వచ్చిన స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2 చిత్రం ద్వారా సినీ ఇండస్ట్రీలోకి అడుగు పెట్టిన ఈమె మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. పునీత్ మల్హోత్రా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో టైగర్ ష్రాఫ్, తారా సుతారియా, అనన్య పాండే, ఆదిత్య సీల్ కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా తర్వాత పతీ పత్నీ ఔర్ ఓ సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఇకపోతే 2022లో ప్రముఖ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో రౌడీ హీరో విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన లైగర్ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించింది ఈ ముద్దుగుమ్మ. భారీ అంచనాల మధ్య పాన్ ఇండియా రేంజ్ లో విడుదలైన ఈ సిని మా డిజాస్టర్ గా నిలిచింది. దీంతో ఈ అమ్మడికి మళ్లీ తెలుగులో అవకాశాలు లభించలేదు. ప్రస్తుతం హిందీలోనే సినిమాలు చేస్తూ ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుంది. అనన్య పాండే సోదరుడు అహాన్ పాండే సయారా సినిమా ద్వారా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి మొదటి సినిమాతోనే అత్యధిక ప్రజాదారణ పొందిన నటుడిగా పేరు దక్కించుకున్నారు.

## ఆ రెస్టారెంట్ ఆదాయం విని షాకయ్యా!

సెలబ్రిటీలు ఎంతో తెలివిగా పెట్టుబడులు పెడుతుంటారు. అందులోనూ బాలీవుడ్ తారలు తాము సంపాదించిన దాన్ని, ఎంతో ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుని దాన్ని ఇన్వెస్ట్ చేస్తూ ఉంటారు. బాలీవుడ్ నటి శిల్పా శెట్టి కూడా అలానే చేశారు.

శిల్పా శెట్టి, ఆమె భర్త రాజ్ కుంద్రా ముంబైలో బాస్టియన్ అనే రెస్టారెంట్ ను మొదలుపెట్టిన సంగతి తెలిసిందే. సినిమాల్లో బిజీగా ఉన్నప్పుడే శిల్పా బిజినెస్ లోకి అడుగుపెట్టి, బాస్టియన్ రెస్టారెంట్ ను ప్రారంభించారు. ఆ తర్వాత బాస్టియన్ ను మరింత విస్తరిస్తూ పలు బ్రాంచ్ లను కూడా స్టార్ట్ చేసి సక్సెస్ఫుల్ బిజినెస్ గా కొనసాగిస్తున్నారు. ముంబైలో ఉన్న ఈ బాస్టియన్ రెస్టారెంట్ ఎంతో ఫేమస్. ఆ రెస్టారెంట్ ఎంత ఫేమస్ అంటే పలువురు ప్రముఖులు కూడా దాని ఆదాయం చూసి ఆశ్చర్యపోయేంత.

**ఆ రెస్టారెంట్ ఆదాయం రోజుకు రూ.2 కోట్లు...** రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో ప్రముఖ రచయిత్రి శోభా డే, బాస్టియన్ రెస్టారెంట్ గురించి కొన్ని ఇంట్రెస్టింగ్ విషయాలను వెల్లడించారు. ముంబైలోని



కొన్ని అంశాలు తనను ఆశ్చర్యపరుస్తాయని చెప్పిన శోభా, బాస్టియన్ రెస్టారెంట్ లోకి అడుగుపెడితే ఎలా ఉంటుందో ఆమె తెలిపారు. బాస్టియన్ రెస్టారెంట్కు మామూలు రోజుల్లో రూ.2 కోట్లు, వీకెండ్స్ లో రూ.3 కోట్ల ఆదాయం వస్తుందని చెప్పారు.

**అదంతా నమ్మలేకపోయా...** మొదట్లో ఈ వార్తలు నిజం కాదనుకున్నానని, కానీ తర్వాత వాటి గురించి తెలిసిందని, ఆ రెస్టారెంట్ లోపలికి వెళ్లి చూడగానే తాను షాకయ్యానని, అందులో దాదాపు 1400 మంది గెస్టులు స్టే చేయొచ్చని, ఒకేసారి 700 మంది భోజనం చేసేలా రెండు పెద్ద పెద్ద హాల్స్ ఉన్నాయని, అంతమందని అక్కడ చూసి తాను చూస్తున్నది నిజమేనా అని నమ్మలేకపోయినట్టు శోభా తెలిపారు. అంతటి స్టార్ హోటల్ కు సంబంధించిన బాంద్రా బ్రాంచ్ ను క్లోజ్ చేస్తున్నట్టు శిల్పా రీసెంట్ గా అనౌన్స్ చేశారు.

అయితే అదే రెస్టారెంట్ను జుహూ లో బాస్టియన్ బీచ్ క్లబ్ పేరుతో ప్రారంభించనున్నామని, ఎన్ని బ్రాంచ్ లు ఓపెన్ చేసినా బాంద్రాలోని రెస్టారెంటే అన్నింటికీ మూలమని, ఆ రెస్టారెంట్ ఎప్పటికీ తమకు స్పెషలేనని శిల్పా చెప్పారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536